ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 24.03.2026 | సంపుటి : 12 సంచిక : 244 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## హేట్ స్పీచ్ నిరోధక బిల్లుకు
# కేబినెట్ ఆమోదం

### గిగ్ వర్కర్లు, తల్లిదండ్రుల మద్దతు బిల్లులు సహా పలు కీలక బిల్లులకు ఆమోదం

- నేరాల నిరోధక బిల్లు, తెలంగాణ ప్లాట్‌ఫామ్, తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లులకు గ్రీన్ సిగ్నల్
- ఎల్అండ్‌టీ నుంచి మెట్రో స్వాధీన ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్ణయం
- ప్రభుత్వం తరపున లావాదేవీలు నిర్వహణ బాధ్యతను హెచ్ఎంఆర్ఎల్‌కు అప్పగింత
- కులగణనపై జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కమిటీ ఇచ్చిన నివేదికకు ఆమోదం
- నిపుణుల కమిటీ నివేదికను పరిశీలించే బాధ్యత కేబినెట్ సబ్‌కమిటీకి
- రోహిత్ వేముల చట్టం విధివిధానాల కోసం సబ్‌కమిటీ .. ఛైర్మన్‌గా భట్టి
- సభ్యులుగా దామోదర రాజనరసింహ, శ్రీధర్‌బాబు, ఉత్తమ్, పొన్నం



హైదరాబాద్(జనంసాక్షి):విద్వేష పూరిత ప్రసంగాలు, నేరాల బిల్లును రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. తెలంగాణ న్యాయవాదుల రక్షణ బిల్లుకు కేబినెట్ పచ్చజండా ఊపింది. విద్యాల యాల్లో కులవివక్షను నియంత్రించే ఉద్దేశంతో రోహిత్ వేముల చట్టం విధివిధానాలు తయారు చేసేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైంది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఆదరించని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల వేతనాల నుంచి 15 శాతం లేదా రూ.10వేలను తల్లిదండ్రులకు ఇచ్చే బిల్లుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్ష తన జరిగిన కేబినెట్ సమావేశం లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అసెంబ్లీ సమావే శాల్లో కీలక బిల్లు లు ప్రవేశపె ట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మిగతా 2లో..





# ఏ1గా కేటీఆర్

- ఏ2,ఏ3లుగా ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి వార్త 2 లో
- ఈ-కార్ కేసులో నాంపల్లి కోర్టులో ఏసీబీ ఛార్జిషీటు దాఖలు



# అపోహలు వీడండి

- నదీ అభివృద్ధిని ఆపేస్తాం అనకండి
- కావాలంటే సలహాల కోసం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, డిప్యూటీ సీఎం భట్టి సారథ్యంలో కమిటీ వేస్తాం
- కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుదాం
- ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నాం
- మానవ తప్పిదాల వల్లే ఇవాళ అనేక సమస్యలు వస్తున్నాయి
- దూరం తగ్గించేందుకు మూసీపై ఎలివేటెడ్ కారిడార్లు వేస్తాం
- వీటితో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుంది
- నగరంలోని పరిశ్రమలు ఓఆర్ఆర్ అవతలకు తరలింపు
- రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరణ
- గుడ్ గవర్నెన్స్ కాదు... మాది స్మార్ట్ గవర్నెన్స్
- శాసనమండలిలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

## మూసీ పునర్నిర్మాణానికి సహకరించండి



మన నగరం ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా మానవ తప్పిదాలే. రవాణాలో రోడ్లు, రైల్వే, ఎయిర్? పోర్ట్ వంటివి కీలక పాత్ర పోషిస్తాయి. తెలంగాణను మూడు జోన్లుగా విభజించడం జరిగింది. క్యూర్, ప్యూర్, రేర్‌గా చేసుకున్నాం. అత్యధికంగా జనాభా వినియోగిస్తున్న మెట్రోను విస్తరించే దిశగా వెళ్తున్నాం" - సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ అద్భుత నగ రంగా మారుతుందని తెలంగాణ సీఎం రేవంత రెడ్డి అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామని చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ.. తెలం గాణ రూపురేఖలు మార్చేందుకే క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ తీసుకొస్తున్నామని వ్యాఖ్యానించారు. కాలుష్యకారక పరిశ్రమలను ఓ ఆర్ ఆర్ బయటకు తరలిస్తామని తెలిపారు. నగరంలో ఉన్న పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తే.. ఆ భూములను మల్టీజోన్స్‌గా వినియోగించు కోవచ్చని వివరించారు. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ఎందుకు సహకరించ లేదని ప్రశ్నిం చారు. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకే మెట్రోను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రూ.15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకున్నామని వెల్ల డించారు. ఏ రాష్ట్రంలోనైనా మిగతా 2లో..

## గ్యారెంటీలకు చట్టబద్ధత

- అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లుకు బీఆర్ఎస్ నోటీసు
- పెన్షనర్ల బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం
- అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

2లో..

రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ వ్యవహారం
## ఆర్థిక కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం
తక్షణం కోర్టు ముందుకు రావాలని ఆదేశం

## బియ్యం రవాణాలో కుంభకోణం

- బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయరా?:హరీశ్‌రావు
- మాది రైతుపక్షపాత ప్రభుత్వం రైతుల నుంచి రికార్డు స్థాయిలో బియ్యం సేకరించాం
- సన్న బియ్యానికి బోనస్ ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నాం: మంత్రి ఉత్తమ్
- సకాలంలో ఉద్యోగులకు జీతాల చెల్లింపు
- పెండింగ్ బిల్లులు కూడా త్వరలోనే చెల్లిస్తాం
- బీఆర్ఎస్ వదిలిన మూడు డీఏలు కూడా చెల్లిస్తాం
- బకాయిలు చెల్లించలేక పదవీ విరమణ పెంచారు
- ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వివరాలు 2వ పేజీలో..



## హర్మ్యూజ్‌ని దాటి భారత్ దిశగా రెండు ఎల్పీజీ నౌకలు

త్వరలోనే ఈ నౌకలు దేశీయ పోర్టులకు చేరిక

న్యూయార్క్(జనంసాక్షి):దేశంలో ఇంధన కొరత ఆం దోళనల వేళ.. భారత్‌కు చెందిన కొన్ని నౌకలు నెమ్మదిగా హర్మ్యూజ్ జలసంధిని దాటుతుండటం ఒకింత ఉపశమనం కలిగిస్తోంది. తాజాగా రెండు ఎల్పీజీ నౌకలు హర్మ్యూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయి.ఇరాన్‌లోని ఇస్లామిక్ రివ ల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అనుమతితో జగ్ వసంత్, పైన్ గ్యాస్ అనే రెండు ఎల్పీజీ నౌకలు సోమవారం ఉదయం హర్మ్యూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడిం చాయి. త్వరలోనే ఈ నౌకలు దేశీయ పోర్టులకు చేరనున్నట్లు తెలిపాయి. దీంతో దేశీయంగా వంట గ్యాస్ లభ్యత మరికొంత మిగతా 2లో..

# తగ్గిన అమెరికా

- చర్చలు జరుగుతున్నాయి • దాడులు ఆపుతున్నాం: ట్రంప్
- ఎలాంటి చర్చలు జరగడంలేదు • భయపడే ఇలాంటి ప్రకటన: ఇరాన్
- దురాక్రమణకు దిగితే.. పర్షియన్ గల్ఫ్ అంతా సీమైన్స్ పరుస్తామని హెచ్చరిక



వాషింగ్టన్(జనంసాక్షి): హర్మ్యూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరి గి తెరవాలంటూ ఇరాన్‌కు అమెరికా అధ్య క్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం జారీ చేసిన విషయం తెలిసిందే. లేనిపక్షంలో ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తామంటూ హెచ్చరించారు. ఈ క్రమం లోనే ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో యు ద్ధాన్ని పూర్తిగా నిలిపివేసే విషయమై ఇరా న్‌తో రెండు రోజులుగా చర్చలు ఫలప్ర దంగా సాగుతున్నాయని చెప్పారు. ఈ నేప థ్యంలో ఇరాన్ ఇంధన మౌలిక సదుపా యాలు, విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజుల వరకు వాయిదా వేయాలని తమ బలగాలను ఆదేశించినట్లు చెప్పారు. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతాయని, వాటి ఫలితంపై ఆధారపడి భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు. ఇరాన్‌పై దాడులను తాత్క లికంగా నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించి న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు దిగి వచ్చాయి. బ్రెంట్ క్రూ డ్ బ్యారెల్ ధర 13 శాతం మేర పతనమై 96 డాలర్ల స్థాయికి చేరింది. మిగతా 2లో..

## ప్రపంచం ఇంధన సంక్షోభం ముప్పును ఎదుర్కొంటోంది

- 40కి పైగా ఇంధన క్షేత్రాలు ధ్వంసమయ్యాయి
- అంతర్జాతీయ ఇంధన సంస్థ అధిపతి ఫాతిహ్ బిరోల్ ఆందోళన

2లో..



దానం నాగేందర్ వ్యవహారంపై విచారణ

## స్పీకర్‌కు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్(జనంసాక్షి): ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు తెలంగాణ హైకో ర్టు నోటీసులు ఇచ్చింది. బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటి షన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. దానం నా గేందర్ పార్టీ మారిన వ్యవహారంలో స్పీకర్ తీర్పు ను కొట్టివేయాలని ఏలేటి పిటిషన్ దాఖలు చేశా రు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన దానం నాగేం దర్.. కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేశారని న్యాయస్థానం దృష్టికి ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీసు కొచ్చారు. ఇతర పార్టీ నుంచి నామినేషన్ వేసిన రోజు నుంచే ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

‘క్యూనెట్’ ఘరానా మోసం
## 32 మంది నిందితుల అరెస్ట్
వివరాలు వెల్లడించిన సీపీ సజ్జనార్

హైదరాబాద్(జనంసాక్షి):క్యూనెట్ సంస్థ మల్టీలెవల్ మార్కె టింగ్ పేరిట ఘరానా మోసం చేస్తోందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ వ్యాఖ్యాని చారు. దేశవ్యాప్తంగా మోసాలు చేస్తున్న క్యూనెట్ సంస్థపై దాడులు చేసి 32 మంది నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. సోమవారం క్యూనెట్ కేసుకు సంబంధించి బషీర్‌బాగ్ సీసీఎస్‌లో సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించారు. 1998 నుంచి మిగతా 2లో..



డ్రగ్స్ కేసులో కీలక పరిణామం
## నిందితులకు మూడురోజుల పోలీస్ కస్టడీ
2లో..



పీజీ మెడికల్ సీట్ల భర్తీ
## కౌన్సెలింగ్ పొడిగింపునకు అనుమతి ఎందుకివ్వట్లేదు?

- వెంటనే వివరణ ఇవ్వండి
- మెడికల్ కమిషన్‌కు సుప్రీం కోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):పీజీ మెడికల్ సీట్ల భర్తీ కౌన్సెలింగ్ పొడిగింపుపై సుప్రీం కోర్టులో సోమవారం విచారణ జరిగింది. కౌన్సెలింగ్ పొడిగింపునకు సంబం ధించి అనుమతి ఇవ్వకపోవడంపై వివరణ ఇవ్వాలని మెడికల్ కమిషన్‌కు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరేందుకు సిద్దంగా ఉన్నారని, సీట్లు వృథా కాకుండా చూడాలని సుప్రీంకోర్టు ధర్మా సనం సూచించింది. సీట్ల భర్తీ కౌన్సెలింగ్ పొడిగింపు అంశంపై విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఖాళీగా ఉన్న మెడికల్ పీజీ సీట్ల భర్తీ వ్యవహారంపై వైద్య విద్య కళాశాల యాజమాన్యాలు ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28వ తేదీతో కౌన్సెలింగ్ ముగిసిందని, అయితే ఆ తేదీకి ఆంధ్రప్రదేశ్‌లో 246 సీట్లు, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని న్యాయస్థానం దృష్టికి కాలేజీ యాజమాన్యాలు మిగతా 2లో..

## పశ్చిమాసియా యుద్ధంతో భారత్‌కు
# ఎన్నో సవాళ్లు



- ఆందోళనకరంగా ప్రపంచ పరిస్థితి
- లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యం లో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలు గా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విష యాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొ చ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యు ద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా వెనక్కి వచ్చారని మోదీ తెలిపారు. పెట్రోల్, డీ జిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నా రు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నా మని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం మిగతా 9లో..

డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా
## పార్టీలకు ప్రచారం
ఈసీ కీలక నిర్ణయం

యుద్ధ విమానాలు, క్షిపణుల సమాచారం
## పాక్‌కు చేరవేత
వాయుసేన ఉద్యోగి అరెస్ట్

తమిళనాట ఎన్డీయే
## సీట్ల సర్దుబాటు ఖరారు
భాజపాకు 27 సీట్లు ఇచ్చేందుకు అన్నాడీఎంకే ఒకే

వివరాలు లోపలి పేజీల్లో..

వనవాసీలు కాదు వాళ్లు..
# ఆదివాసీలే

- బీర్సా ముండా వారసత్వంపై భాజపా దాడి
- బీజేపీ భాష తప్పు : రాహుల్ గాంధీ



వడోదర(జనంసాక్షి):కేంద్ర ప్రభుత్వం, ఆర్ఎ స్ఎస్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. గిరిజనులను ‘వనవాసి’ అని సంభోదించడంపై విమర్శలు గుప్పించారు. శ తాబ్దాలుగా గిరిజనులకు చెందిన నీరు, అడవు లు, భూములపై వారి అసలైన యాజమాన్య హక్కులను నిరాకరించ డానికే ఈ పదాన్ని సృష్టించారని ఆరోపించారు. దేశంలో అధి కారం, సంపదలో గిరిజనులు తమ వాటాను పొందాలంటే కులగణన అత్యంత కీలకమని పేర్కొన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని వడోదరలో జరిగిన ‘ఆదివాసీఅధికార్‌సంవిధాన సమ్మేళన్’లో ఈ మేరకు వ్యాఖ్యానించారు.

**‘పరిహారం చెల్లించకుండానే గిరిజనుల భూములను లాక్కుంటున్నారు’**

‘వనవాసి’ అనే పదం గిరిజనులు కేవలం అడవులలో నివసిస్తున్నారని సూచి స్తుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఆదివాసీలను ‘వనవాసి’ అని పిలవడ మంటే రాజ్యాంగంపై, గిరిజన నాయకుడు బిర్సా ముండాపై దాడి చేయడమే నని ఆరోపించారు. “భారత రాజ్యాంగం వేల సంవత్సరాల నాటి తత్వాన్ని తనలో ఇముడ్చుకుంది. మోదీతో సహా బీజేపీ నాయకులు మిగతా 2లో..



### ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్

# ప్రారంభ వేడుకలకు రండి

### గవర్నర్‌ను ఆహ్వానించిన డీజీపీ శివధర్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించనున్న 74వ బి.ఎన్. మల్లిక్ మెమోరియల్ ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్-2026 ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి సోమవారం నాడు లోక్‌భవన్‌లో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తున్న పోలీసు జట్ల వివరాలను డిజిపి గవర్నర్‌కు వివరించారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మెగా టోర్నీ మార్చి 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానుంది. ఈ వేడుకల్లో భాగంగా వివిధ రాష్ట్రాల పోలీసు బృందాల గౌరవ వందన స్వీకరణ, క్రీడాకారుల మార్చ్ పాస్ట్, ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ పతాకావిష్కరణ వంటి కార్యక్రమాలు ఘనంగా జరగనున్నాయి. గవర్నర్ ఈ క్రీడలను అధికారికంగా ప్రారంభించనుండగా, ప్రత్యేక కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పాటు కేంద్ర భద్రతా బలగాల నుంచి అత్యుత్తమ ఫుట్‌బాల్ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఈ వేదిక సిద్ధమైంది. క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వివిధ రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు ఈ పోటీలు దోహదపడనున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, స్పోర్ట్స్ ఐజీపీ గజరావు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

# హేట్‌స్పీచ్ నిరోధక బిల్లుకు కేబినెట్ ఆమోదం

సిద్ధ మైంది. సమావేశాలు ముగిసిన తర్వాత అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశమైన కేబినెట్ కీలక బిల్లులకు ఆమోదముద్ర వేసింది. విద్వేషపూరిత ప్రసంగా లు నేరాల నిరోధక బిల్లును మంత్రివర్గం ఆమో దించింది. మత సామరస్యానికి భంగం కలిగిం చేలా సోషల్ మీడియా పోస్టులు అల్లర్లు, ఘర్ష ణలు ప్రేరేపించే ప్రసంగాలను కట్టడి చేసేం దుకు ప్రభుత్వం ఈ బిల్లును రూపొందించింది. గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల సంక్షేమం భద్రత కోసం రూపొందించిన తెలంగాణ ప్లాట్ ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమ బిల్లును మంత్రివర్గ సమావేశం ఆమోదించింది. రాష్ట్రంలో సుమారు 4 లక్షల 20వేల మంది గిగ్ వర్కర్లు, ప్లాట్ ఫారం ఆధారిత కార్మికులు ఉన్నారు. గిగ్ వర్కర్ల రిజిస్ట్రేషన్?తో పాటు సంక్షేమ బోర్డు, నిధిని ఏర్పాటు చేస్తారు. గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు, సామాజిక భద్రత లభించడంతో పాటు హక్కుల కు రక్షణకు కల్పించేలా బిల్లును రూపొందించా రు. గతంలోనే మంత్రివర్గం ఆమోదించినప్పటికీ ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన సోషల్ సెక్యూరిటీ కోడ్ కు అనుగుణంగా స్వల్ప మార్పులు చేశారు. సుమారు 60 కిలోమీటర్ల హైదరాబాద్ మెట్రో వ్యవస్థను ఎల్అండ్ టీ కంపెనీ నుంచి స్వాధీనం చేసుకునే చర్యలు వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అప్పులతో పాటు.. మొత్తం 15 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఎల్ అండ్ టీకి చెల్లించి ఫేజ్ 1 ప్రాజెక్టు స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని ఇప్పటికే సబ్ కమిటీ నివేదికను సమర్పించింది. ప్రభుత్వం తరపున నిధుల చెల్లింపులు, లావాదేవీలు నిర్వర్తించే బాధ్యతను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ కు మంత్రివర్గం అప్పగించింది. హెచ్ఎంఆర్ఎల్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తల్లిదండ్రుల మద్దతు బిల్లును రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఆదరించని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల వేతనాల నుంచి 15 శాతం లేదా 10 వేలు ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని వారి తల్లిదండ్రులకు ఇచ్చేలా బిల్లును రూపొందించారు. విద్యాలయాల్లో కుల వివక్ష నియంత్రించే ఉద్దేశంతో రోహిత్ వేముల చట్టం విధివిధానాల రూపకల్పన కోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుకు చేయాలని నిర్ణయించారు. మంత్రివర్గ ఉప సంఘంలో దామోదర రాజనరసింహ, శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేసిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని స్వతంత్ర నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను మంత్రివర్గం ఆమోదించింది..

## డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పార్టీలకు ప్రచారం

న్యూఢిల్లీ(జనంసాక్షి):నాలుగు అసెంబ్లీ ఎన్నికల వేళ భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం కోసం డిజిటల్ వోచర్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో మాత్రమే ఈ ఉచిత ప్రసార అవకాశం ఉంటుంది. త్వరలో అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ ఉచిత ప్రసార అవకాశం కల్పించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని 39ఏ సెక్షన్ కింద రాజకీయ పార్టీలకు ఈ అవకాశం కల్పిస్తున్నట్టు ఈసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు ఐటీ ప్లాట్‌ఫాం ద్వారా ఈ డిజిటల్ టైమ్ వోచర్లు జారీ చేస్తున్నట్టు పేర్కొంది. ఈ బ్రాడ్‌కాస్ట్ విండో అభ్యర్థుల జాబితా విడుదలైన తేదీ నుంచి ప్రారంభమై పోలింగ్‌కు రెండ్రోజుల ముందు వరకూ కొనసాగుతుందని తెలిపింది. రాష్ట్ర/యూటీ స్థాయిలో పారదర్శకంగా డ్రా నిర్వహించడం ద్వారా బ్రాడ్‌కాస్ట్ స్లాట్‌లు నిర్ధారిస్తారు. ప్రతి పార్టీకి దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియాలో 45 నిమిషాల ఉచిత ప్రసార సమయం కేటాయిస్తారు. గత అసెంబ్లీ సమయంలో పార్టీల పనితీరు ఆధారంగా కూడా అదనపు ప్రసార సమయం కేటాయించే వీలుంటుంది. సాంకేతిక, రెగ్యులేటరీ ప్రమాణాలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు ట్రాన్స్‌క్రిప్టులు, రికార్డింగ్‌లను ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. ఆయా రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను సమష్టిగా వ్యక్తం చేసేందుకు వీలుగా ప్రసార భారతి ప్యానల్ డిస్కషన్లు, డిబేట్లను కూడా నిర్వహిస్తుంది. చిత ప్రసార సమయం కేటాయింపు ద్వారా రాజకీయ పార్టీలు తమ విధానాలను, ప్రచారాన్ని ప్రజల్లోకి సులభంగా తీసుకువెళ్లవచ్చని ఈసీఐ భావిస్తోంది.

## వనవాసీలు కాదు వాళ్లు.. ఆదివాసీలే

బిర్సా ముండా, అంబేడ్కర్, పూలే, గాంధీల విగ్రహాలకు నమస్కరిస్తారు. కానీ బిర్సా ముండా ప్రతిపాదించిన సూత్రాలను, ఆయన ఆశయాన్ని కాపాడటంలో విఫలమవుతున్నారు. రాజ్యాంగం బిర్సా ముండా వాణికి ప్రతిరూపం. బీజేపీ గిరిజనులను వనవాసులు అని ముద్రవేస్తోంది. తద్వారా వారి నీటిని, అడవులను, భూములను కార్పొరేట్లకు అప్పగిస్తోంది. అభివృద్ధి పేరిట ఆదివాసీల భూములను ఎటువంటి పరిహారం చెల్లించకుండానే లాక్కుంటున్నారు.” అని రాహుల్ విమర్శించారు.

# అపోహాలు వీడండి

ఎయిర్‌పోర్టులకు మెట్రో కనెక్టివిటీ ఉంటుందని.. కానీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. జూన్, జులైలోపు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పంజాగుట్ట, హైటెక్‌సిటీ, జూబ్లీహిల్స్‌లో ఎలివేటెడ్ కారిడార్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరిస్తామని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బేగంపేట ఎయిర్‌పోర్టు మధ్య నుంచి అండర్‌పాస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. సిగ్నల్స్ దగ్గర వాహనాలు ఆగకుండా వెళ్లాలనేదే తమ ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలే కొన్ని ప్రమాదాలకు కారణమని అన్నారు. చిరు వ్యాపారులకు ఇబ్బంది ఉన్నా ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీ మాదిరిగా కాలుష్య నగరం కాకూడదనే హిల్ట్ పాలసీ తీసుకువచ్చామని వివరించారు. ప్రతిపక్షాల నేతలు హిల్ట్‌పాలసీపై ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. నగరం నుంచి బయటకు వెళ్లేందుకే ఎలివేటెడ్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతోపాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎలివేటెడ్ కారిడార్లకు ఎక్కువ భూమి కూడా అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. గతంలో మాదిరిగా నచ్చితే నజరానా.. లేకపోతే జరిమానా విధించే విధానం ఉండదని చెప్పుకొచ్చారు. గుడ్ గవర్నెన్స్ కాదని.. మాది స్మార్ట్ గవర్నెన్స్ అని వ్యాఖ్యానించారు. అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని.. ప్రతిపక్షాలు, ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రతిపక్షాల నేతలు అభివృద్ధిని అడ్డుకోవాలని చూడొద్దని.. ఏవైనా సూచనలు ఉంటే ఇవ్వండి.. స్వీకరిస్తామని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన అత్యంత అవసరమని తెలిపారు. మూసీ కాలుష్యంతో నల్గొండ జిల్లా ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటలు కూడా తినే పరిస్థితి లేదని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను తమ ప్రభుత్వం తీసుకురాలేదని..కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన విధానాన్నే తాము కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గుజరాత్‌లో సబర్మతి ప్రక్షాళనకు కాంగ్రెస్ సహకరించిందని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనకు రాజకీయ రంగు ఎందుకు? అని ప్రశ్నించారు. ఎవరినీ నిరాశ్రయులను చేయం.. పునరావాసం కల్పిస్తామని భరోసా కల్పించారు. ప్రతిపక్షాల నేతలు అడ్డుకోవడం తప్పించి.. ఏ సలహా ఇచ్చినా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరికీ నష్టం కలిగించం.. బాధితులందరినీ ఆదుకుంటామని మాటిచ్చారు. మూసీ పరివాహకంలో ఉన్న అందరికీ మెరుగైన వసతులు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు ఇబ్బందులు తప్పట్లేదని తెలిపారు. హైదరాబాద్‌ను విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశంలో ఐదు మెట్రో నగరాలైన హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు అత్యంత కీలకమైనవని చెప్పుకొచ్చారు. పెట్టుబడులను నగరాల నిర్మాణం, నిర్వహణ నిర్దేశిస్తాయని అన్నారు. నగరాలపైనే రాష్ట్రాల ప్రగతి ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఢిల్లీలో కాలుష్యం వల్లే స్కూల్స్, ఆఫీసులకు సెలవులు ఇస్తున్నారని ప్రస్తావించారు. ముంబైలో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. చెన్నై, బెంగళూరులోనూ ట్రాఫిక్ కష్టాలు తప్పట్లేదని అన్నారు. మానవ తప్పిదాల వల్లే అనేక కష్టాలు వస్తున్నాయని ప్రస్తావించారు. హైదరాబాద్ అంటే లేక్స్ అండ్ రాక్స్ సిటీ అని చెప్పుకొచ్చారు. ఓల్డ్ సిటీగా పిలుస్తున్న ప్రాంతం ఒకప్పుడు ఒరిజినల్ సిటీ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదాయ మార్గాలు మెరుగుపడటంతో ప్రతి కుటుంబంలో కార్లు పెరిగాయి. ట్రాఫిక్ రద్దీ వల్లే మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరించుకున్నాం. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ బాగా పెరిగింది. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తాం. రోడ్లను అండం ˉపాస్‌లు, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా విభజించాం. ఎక్కడా ట్రాఫిక్ ఆగకూడదనేదే మా లక్ష్యం. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రాలేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల నేపథ్యంలో రూ.15వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకున్నాం. ఈ ప్రాజెక్టును మరో 76 కి.మీ విస్తరిస్తాం. విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా స్పందించింది. నగర శివార్ల నుంచి వచ్చే ఉద్యోగుల సంఖ్య బాగా పెరిగింది. శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తాం. దీనికోసం కేంద్ర సంస్థలతో మాట్లాడి భూమి తీసుకుంటున్నాం. జూబ్లీహిల్స్, బంజారా హిల్స్‌లో రోడ్ల విస్తరణకు ఇబ్బందులు ఉన్నాయి. సిగ్నల్ వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు.

## ఆరు గ్యారెటీలకు చట్టబద్ధత

హైదరాబాద్(జనంసాక్షి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రైవేటు బిల్లు ప్రతిపాదించింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శికి నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా బిల్లు ప్రతిని సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అందజేశారు. బిల్లును ఈ సమావేశాల్లోనే అనుమతించాలని కోరారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సంబంధించిన నోటీసును స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లుతో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే అవకాశం ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు. అత్యంత కీలకమైన ఈ బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి అనుమతించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లుకు సంబంధించిన నోటీసులు అందజేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, మల్లారెడ్డి, కేపీ వివేకానందా, సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్, అనిల్ జాదవ్, మానిక్‌రావు, దాసోజ్ శ్రవణ్‌కుమార్ , శంభీపూర్ రాజు, మాదవరం కృష్ణారావు, కల్వకుంట్ల సంజయ్, కౌశిక్ రెడ్డి తదితరులున్నారు.

**అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ సభ్యుల వాకౌట్**

ప్రభుత్వ ఉద్యోగులు జీతభత్యాల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి నిరసనగా సభ నుంచి వెళ్లిపోయారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వడంలో అలసత్వం వహించడం, పీఆర్సీ డీఏ విషయంలో సీపీఎస్ విషయంలో, ఉద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం చూపిస్తున్న మోసపూరిత వైఖరికి సభ నుండి వాకౌట్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గళమెత్తారు. వారి పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు కేపీ వివేకానందా , కల్వకుంట సంజయ్ సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ నెలకు రూ. 700 కోట్ల బకాయిలను చెల్లిస్తామని చెప్పి , ఇంతవరకు చెల్లించలేదని ఆరోపించారు. ఎంతోమంది ఉద్యోగులు వారి మనోవేదనను చెప్పుకోలేక, ఆరోగ్య సమస్యలతో చనిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. రిటైర్డు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ఏ1గా కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి నాంపల్లి కోర్టులో ఏసీబీ ఛార్జిషీటు దాఖలు చేసింది. ఇందులో ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డి, ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు, ఏ5గా యూకేకి చెందిన ఎఫ్ఈఓ సంస్థను చేర్చింది. హైదరాబాద్‌లో 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ-కార్ రేస్ కోసం విదేశీ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా సొమ్ము చెల్లించడం వల్ల ప్రభుత్వానికి రూ.55 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఏసీబీ కేసు నమోదు చేసింది. అయితే పురపాలక శాఖ మంత్రి హోదాలో కేటీఆర్ ఆదేశించడంతోనే తాము నిధులు విడుదల చేశామని అప్పట్లో ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన అర్వింద్ కుమార్ గతంలోనే ప్రభుత్వానికి లిఖితపూర్వక వాంగ్మూలంతో పాటు ఏసీబీ విచారణలోనూ అంగీకరించారు.

## బియ్యం రవాణాలో కుంభకోణం

**హైదరాబాద్(జనంసాక్షి):**బియ్యం రవాణాపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసత్యాలు చెప్పారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఖీజీనీ) విమర్శించారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం పంపడంలో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ కేసులున్న ప్రేమ్‌చంద్ గార్గ్‌ను సలహాదారుగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. ఆయన ఇప్పుడు ఎక్కడ ఉన్నారో ప్రభుత్వం చెప్పాలని హరీశ్ ప్రశ్నించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు.“బియ్యం ఎగుమతి కోసం టెండర్లు పిలిచారా?నాఫెడ్‌కు అనుమతి ఇవ్వకుండా నామినేషన్ పద్ధతిలో ప్రైవేట్ సంస్థకు ఎందుకిచ్చారో చెప్పాలి. కాకినాడ పోర్టులో 7,500 టన్నుల బియ్యం ఉన్నది నిజమా.. కాదా?ఆ పోర్టులో గిడ్డంగి, నిర్వహణ ఛార్జీలు చెల్లిస్తున్నారా?లేదా?బియ్యం రవాణాలో కుంభకోణం జరిగింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగింది. ఈ అంశంపై హౌస్ కమిటీ వేసి నన్ను కూడా సభ్యుడిగా ఉంచాలి” అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

సన్న బియ్యానికి బోనస్.. కట్టుబడి ఉన్నాం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: సన్న బియ్యానికి బోనస్ ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బియ్యం కుంభకోణం జరిగిందని విమర్శించారు. గత ప్రభుత్వ పాలనలోని అన్ని అక్రమాలపై దర్యాప్తు చేయాల్సి ఉంటుందని చెప్పారు. శాసనసభలో మంత్రి మాట్లాడారు. “మాది రైతుపక్షపాత ప్రభుత్వం. రైతుల నుంచి రికార్డు స్థాయిలో బియ్యం సేకరించాం. 72 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి నగదు చెల్లించాం. ఇంకా మిగిలిన బియ్యం కూడా కొనుగోలు చేస్తాం. ఈ రబీలో కూడా ప్రతి గింజనూ కొంటాం. ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ. 86 లక్షల టన్నుల నిల్వ ఉంది.. పంపించేందుకు చర్యలు చేపడుతున్నాం. బియ్యాన్ని మంచి ధరకే విక్రయించాం. ఛత్తీస్‌గఢ్, ఏపీ బియ్యం కంటే మన సోనా మసూరి, బాస్మతి బియ్యానికి డిమాండ్ ఉంది. కేంద్రం నిధులు ఇచ్చినా, ఇవ్వకపోయినా మేం మాత్రం ధాన్యం కొనుగోలు చేస్తున్నాం” అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు.

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ వ్యవహారం

హైదరాబాద్(జనంసాక్షి): రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఏడాదిగా బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో ఆర్థిక కార్యదర్శి పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈరోజు అర్ధరాత్రి వరకైనా కోర్టులోనే ఉంటాము.. . ఆర్థిక కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. .

## హర్మూజ్‌ని దాటి భారత్ దిశగా రెండు ఎల్పీజీ నౌకలు

పెరిగే అవకాశం ఉంది. ఉద్రిక్తతల కారణంగా భారత్‌కు చెందిన నౌకలు రోజులతరబడి అక్కడే నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మన నౌకలు సురక్షితంగా హర్మూజ్ దాటేందుకు.. ఇరాన్ అధికారులతో కేంద్రం నిరంతరం సంప్రదింపులు జరిపింది. దీంతో కొన్ని రోజులుగా భారత నౌకలు ఒక్కొక్కటిగా దేశీయ పోర్టులకు చేరుకుంటున్నాయి. అయితే, ఇరాన్ సీనియర్ లీడర్ అలీ లారిజానీ మరణం, ఆ దేశ చమురుక్షేత్రాలపై అమెరికా దాడులు వంటి కారణాలతో నౌకల ప్రయాణానికి అనుమతులు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది.

## డ్రగ్స్ కేసులో కీలక పరిణామం

హైదరాబాద్(జనంసాక్షి): మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టైన నిందితులను పోలీస్ కస్టడీకి ఇవ్వడానికి కోర్టు అనుమతి ఇచ్చింది. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిందితులుగా ఉన్న పైలెట్ రోహిత్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, నమిత్ శర్మలను మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని ఉప్పర్‌పల్లి కోర్టు ఆదేశించింది. విచారణలో భాగంగా మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసుల అభ్యర్థనపై కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. కోర్టు అనుమతితో నిందితులను రేపటి నుంచి కస్టడీకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టనున్నారు. ఈ కేసులో డ్రగ్స్ సరఫరా, నెట్‌వర్క్‌కు సంబంధించిన కీలక విషయాలను వెలికితీయాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, కస్టడీ విచారణలో మరిన్ని కీలక వివరాలు బయటపడే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.

# వాయుసేన ఉద్యోగి అరెస్ట్

న్యూఢిల్లీ(జనంసాక్షి):పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తోన్నట్లు వచ్చిన ఆరోపణలపై భారత వాయుసేనలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని రాజస్థాన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడికి పాక్ హ్యాండ్లర్లతో విస్తృత పరిచయాలు ఉన్నట్టు దర్యాప్తులో తేలింది. ఓ కేసు దర్యాప్తులో తీగ లాగితే.. ఈ గూఢచర్యం విషయం బయటపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ ఏడాది జనవరిలో రాజస్థాన్‌లోని జైసల్మేర్‌కు చెందిన జబరా రామ్‌ను ఓ కేసులో పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. అతడిని ప్రశ్నించగా.. పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలతో సంబంధం ఉన్న సుమిత్ కుమార్ గురించి తెలిసింది.

అంటే ఒక్క ప్రకటనతో 17 డాలర్ల మేర దిగొచ్చింది. అలాగే, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ సైతం 13 డాలర్లు క్షీణించి 85 డాలర్ల స్థాయికి చేరింది.

**ట్రంప్ వెనక్కి తగ్గారు: ఇరాన్**

ట్రంప్ ప్రకటనపై ఇరాన్ స్పందించింది. విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న హెచ్చరికలతో ఆయన వెనక్కి తగ్గారని ఇరాన్ అధికారిక టెలివిజన్ పేర్కొంది. అఫ్గానిస్థాన్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం సైతం ఇదే విధమైన వ్యాఖ్యలు చేసింది. తమ పవర్ ప్లాంట్‌లను అమెరికా లక్ష్యంగా చేసుకుంటే.. హర్మూజ్ జలసంధిని పూర్తిగా మూసివేస్తామని అంతకు ముందు టెహ్రాన్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఆ కేంద్రాలను పునర్నిర్మించే వరకు హర్మూజ్‌ను తెరిచేదే లేదని స్పష్టం చేసింది. ఇజ్రాయెల్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలు, సమాచార, ప్రసార సాంకేతికతలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని పేర్కొంది.

**దురాక్రమణకు దిగితే..**

**పర్షియన్ గల్ఫ్ అంతా సీమైన్స్: ఇరాన్ వార్నింగ్**

ఇరాన్‌లో అమెరికా భూతల దాడులకు దిగొచ్చని, ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనంలోకి తీసుకోవచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి స్ట్రాంగ్ వార్నింగ్ వచ్చింది. తమ దేశ తీరం లేక ద్వీపాలపై దాడి చేస్తే.. పర్షియన్ గల్ఫ్ అంతటా సీమైన్స్ పరుస్తామని తాజాగా ఇరాన్ డిఫెన్స్ కౌన్సిల్ హెచ్చరించింది. ఈ మేరకు రాయిటర్స్ కథనం పేర్కొంది.

# తగ్గిన అమెరికా

దాంతో గల్ఫ్ షిప్పింగ్ మార్గాలు, కమ్యూనికేషన్ లైన్లకు తీవ్ర అంతరాయం కలగొచ్చని పేర్కొంది. తమ తీరం నుంచే వాటిని జలాల్లోకి ప్రవేశపెట్టగలమని వెల్లడించింది. “దాంతో సుదీర్ఘకాలం గల్ఫ్ ప్రాంతమంతటా.. హర్మూజ్ జలసంధిలో నెలకొన్న పరిస్థితే ఉంటుంది. 1980ల్లో స్వల్ప సంఖ్యలో పరిచిన సీమైన్స్‌ను తొలగించడానికి 100 మైన్ స్వీపర్లు ప్రయత్నించి విఫలమైన సంగతిని మర్చిపోకూడదు” అని ఇరాన్ తన ప్రకటనలో శత్రుదేశాలకు గుర్తుచేసింది. ఇరాన్ చమురు ఎగుమతులకు ఖర్గ్ ఐలాండ్ అత్యంత కీలకమైనది. హర్మూజ్‌ను తెరిచే విషయంలో ఆ దేశంపై ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఆక్రమించాలని యూఎస్ (జూం) యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దానికి తగ్గట్టే 4500 మంది సెయిలర్లు, మెరైన్లను మోహరించింది. హెలికాప్టర్లు, ఎఫ్-35 ఫైటర్ జెట్స్, సాయుధ ల్యాండింగ్ వెహికిల్స్‌లో కూడిన బెటాలియన్‌ను కూడా పంపింది. అయితే ఈ మోహరింపు హర్మూజ్‌ను తెరవడానికా లేక ఖర్గ్ స్వాధీనానికి అనే దానిపై మాత్రం స్పష్టత లేదు.

**అదే జరిగితే.. ఇరాన్ ‘యురేనియం’**

**స్వాధీనం చేసుకుంటాం: ట్రంప్**

ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవాలను కుంటోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఈ క్రమంలోనే అమెరికా ప్రతినిధులు ఆ దేశానికి చెందిన ఓ ‘గౌర వప్రదమైన నేత’తో చర్చలు జరుపు తున్నారని తెలిపారు. ఒప్పందం కుదిరితే.. ఇరాన్ శుద్ధి చేసిన యురేనియంను స్వాధీనం చేసుకునే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా జరుగుతున్నాయని ‘ట్రూత్ సోషల్’లో ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో మీడియాతో ట్రంప్ ఈ మేరకు మాట్లాడారు. మధ్యప్రాచ్యంలో వ్యవహారాల కోసం తాను నియమించిన ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్, తన అల్లుడు జారెడ్ కుష్నర్ ఆదివారం ఇరాన్‌తో సుదీర్ఘ చర్చలు జరిపారని ట్రంప్ తెలిపారు. ఇవాళ కూడా చర్చలు కొనసాగుతాయని చెప్పారు. అయితే, అమెరికా ఎవరితో చర్చలు జరుపుతోంది? ఆ ‘గౌరవప్రదమైన నేత’ ఎవరనే వివరాలను మాత్రం ట్రంప్ వెల్లడించకపోవడం గమనార్హం. అదే సమయంలో ఇరాన్ నూతన సుప్రీం లీడర్ ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీతోఅదే సమయంలో ఇరాన్ నూతన సుప్రీం లీడర్ ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీతో మాత్రం తాము చర్చలు జరపలేదన్నారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని నిలిపివేసే విషయమై ఇరాన్‌తో రెండు రోజులుగా చర్చలు ఫలప్రదంగా సాగుతున్నట్లు అంతకుముందు ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజుల వరకు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న హెచ్చరికలతోనే ఆయన వెనక్కి తగ్గినట్లు ఇరాన్ పేర్కొంది.

# క్యూనెట్ ఘరానా మోసం

క్యూనెట్ నిర్వాహకులు వివిధ రకాల పేర్లతో మోసాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. ప్రొడక్ట్ ముందు చూపెడుతూ వెనకాల మోసం చేసి డబ్బులు దండుకోవడమే క్యూనెట్ సంస్థ నిర్వాహకుల టా÷-గ్గ్గ÷ట్ అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ నగరంలో 22 మంది బాధితులు తెలిపిన వివరాల మేరకు కేసులు నమోదు చేశామని అన్నారు. క్యూనెట్ కీలక ఆధారాల కోసం 30 టీమ్‌లతో ఈ కేసును ఛేదించామని తెలిపారు. సిద్దిపేటలో హరికృష్ణ అనే బాధితుడు రూ.5 లక్షలు మోసపోయారని అన్నారు. హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్యూనెట్ సంస్థ కార్యకలాపాలపై దృష్టిసారించామని చెప్పుకొచ్చారు. క్యూనెట్ సంస్థ చెప్పేది ఒక్కటని, చేసేది ఇంకొకటంటూ బాధితుడు సూసైడ్ నోట్ రాసి చనిపోయారని అన్నారు. వెల్‌నెస్ ప్రొడక్ట్స్, బిస్కెట్స్, హెల్త్‌ఫుడ్స్ తయారీ పేరిట ప్రజల్లోకి వెళ్తూ ట్రాప్‌లోకి దించుతున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. క్యూనెట్ సంస్థలో చేరే వ్యక్తులకు ముందు ఇష్టపూర్వకంగా చేరుతున్నామని బాండ్ పేపర్లపై రాయించు కొన్న తర్వాతే ఈ సంస్థలోకి తీసుకుంటారని తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను టా÷-గ్గ్గ÷ట్ చేస్తూ వాళ్లకు ప్రొడక్ట్ చూపెట్టి సైడ్ ఇన్‌కమ్ పేరుతో ట్రాప్ చేస్తున్నారన్నారు. ఉద్యోగస్థులు పెట్టుబడి పెట్టడానికి డబ్బులు లేకపోతే వాళ్లే ప్రైవేట్గ్ ÷నాన్స్ ద్వారా ఇప్పించి అధికంగా డబ్బులు వసూలు చేశారని తెలిపారు. నెలరోజులుగా క్యూనెట్ సంస్థపై దర్యాప్తు చేసి పూర్తి స్థాయిలో ఆధారాలను సేకరించి అరెస్ట్ చేశామని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 32 మంది నిందితులను అరెస్ట్ చేశామని.. 32 మందిలో 11 మంది మహిళలు ఉన్నారని ప్రస్తావించారు.

## స్పీకర్‌కు హైకోర్టు నోటీసులు

కర్ణాటక, బిహార్‌లో ఇలాంటి పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన ప్రస్తావించారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని దానం నాగేందర్‌తో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్, అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది.

## తమిళనాట ఎన్డీయే సీట్ల సర్దుబాటు ఖరారు

చెన్నై(జనంసాక్షి):తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. మరో వారం రోజుల్లో నామినేషన్ల ప్రక్రియ మొదలుకానుంది. ఈ క్రమంలోనే ఎన్డీయే కూటమిలోని భాజపా సహా కీలక భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల పంపకం ఒప్పందాన్ని అన్నాడీఎంకే ఖరారు చేసింది. భాజపాకు 27 సీట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. పట్టలి మక్కల్ కట్చి (పీఎంకే)కి 18, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే)కు 11 స్థానాలు కేటాయించింది. భాజపా నేత, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, పీఎంకే అగ్రనేత అన్బుమణి రామ్‌దాస్, ఏఎంఎంకే చీఫ్ టీటీవీ దినకరన్ తదితరుల సమక్షంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి సీట్ల పంపకాల వివరాలు ప్రకటించారు. గత ఎన్నికలతో పోలిస్తే కాషాయ పార్టీ ఈసారి అదనంగా ఏడు స్థానాల్లో పోటీ చేయనుంది. మరోవైపు అధికార డీఎంకే.. కాంగ్రెస్‌కు 28 సీట్లను కేటాయిస్తూ ఇప్పటికే ఒప్పందాన్ని ఖరారు చేసింది. 2021తో పోలిస్తే మూడు సీట్లు ఎక్కువగా కేటాయించింది. సీపీఐకి ఐదు, ఎండీఎంకేకు నాలుగు, కేఎండీకే, ఐయూఎంఎల్, ఎంఎంకేలకు రెండు సీట్ల చొప్పున ఇచ్చింది.

## ప్రపంచం ఇంధన సంక్షోభం ముప్పును ఎదుర్కొంటోంది

న్యూయార్క్(జనంసాక్షి):కొన్ని దశాబ్దాలుగా ఎన్నడూ లేనంత ఇంధన సంక్షోభం ముప్పును ప్రపంచం ఇప్పుడు ఎదుర్కొంటోందని అంతర్జాతీయ ఇంధన సంస్థ అధిపతి ఫాతిహ్ బిరోల్ హెచ్చరించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు ఆ ప్రాంతంలో 40కి పైగా ఇంధన క్షేత్రాలు ధ్వంసమయ్యాయని మీడియాతో మాట్లాడుతూ హెచ్చరించారు. దాంతో ఇంధన సరఫరాపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.“1970ల్లో, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పుడు చవిచూసిన చమురు, గ్యాస్ సంక్షోభాలను మించిన పరిస్థితులు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ప్రపంచ ఆర్థికవ్యవస్థ అతిపెద్ద ముప్పును ఎదుర్కొంటోంది సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాను. పశ్చిమాసియాలో ఇంధన మౌలిక సదుపాయాలు దెబ్బతింటే.. ఆ ప్రభావం అంతర్జాతీయ మార్కెట్ల పైనా తీవ్రంగా ఉంటుంది. దాంతో ధరల్లో అస్థిరత, సరఫరా కొరతకు దారితీస్తుంది” అని హెచ్చరించారు. ఇప్పటికే పలు ఆర్థికవ్యవస్థలు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మందగిస్తోన్న వృద్ధితో సతమతమవుతున్నాయి. ఈ సమయంలో ఆయన హెచ్చరికలు వచ్చాయి. ప్రపంచ చమురు వాణిజ్యంలో అతిపెద్ద సంక్షోభంగా 1973ని వ్యవహరిస్తారు. ఇజ్రాయెల్‌కు మద్దతుగా వ్యవహరించిన అమెరికా, నెదర్లాండ్స్, పోర్చుగల్, దక్షిణాఫ్రికా... తదితర దేశాలపై ఒపెక్ దేశాలు చమురు ఆంక్షలు విధించాయి. దీంతో పెట్రోల్, డీజిల్‌కు తీవ్ర కొరత ఏర్పడి.. అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమన్నాయి. 1970ల్లోనే ఇస్లామిక్ విప్లవం వల్ల మరోసారి చమురు ధరలు భారీగా పెరిగాయి.

# కౌన్సెలింగ్ పొడిగింపుకు అనుమతి ఎందుకివ్వట్లేదు

తీసుకువచ్చాయి. వీటిలో ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ అలోక్ అరాథే ధర్మాసనం దృష్టికి యాజమాన్యాల తరపు న్యాయవాదులు తీసుకువచ్చారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, కానీ గడువు ముగియడంతో కౌన్సెలింగ్ ముగించారని యాజమాన్యాలు ప్రస్తావించాయి. గడువు పెంచాలని ఫిబ్రవరి 28వ తేదీకి ముందే జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు విజ్ఞప్తి చేశాయి. యాజమాన్యాలు విజ్ఞప్తి చేసినా ఎన్ఎంసీ నుంచి ఎలాంటి సమాధానమూ రాలేదని కోర్టుకు న్యాయవాదులు చెప్పారు.

## ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి బీమా చెక్కు అందజేత



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ పోలీస్ శాఖతో కుదుర్చుకున్న ప్రత్యేక వేతన ప్యాకేజీ ఒప్పందం ప్రకారం, ప్రమాదవశాత్తు ఉద్యోగులు మరణిస్తే బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి బీమా సౌకర్యం కల్పిస్తుంది. ఇటీవలి ఒక కేసులో, పెట్లబూరిలోని సీఏఆర్ హెచ్‌క్యూస్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ బి. రామనాయుడు గత సంవత్సరం రోడ్డు ప్రమాదానికి గురై మరణించారు. ఆయన తెలంగాణ దక్షిణ ప్రాంతం, బ్యాంక్ ఆఫ్ బరోడా నార్కెట్‌పల్లి బ్రాంచ్‌లో బరోడా పోలీస్ వేతన ప్యాకేజీని కొనసాగిస్తున్నారు. ఆయన బీమా క్లెయిమ్‌ను వెంటనే ప్రాసెస్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ ప్రధాన కార్యాలయంలోని డీజీపీ కార్యాలయంలో, తెలంగాణ రాష్ట్ర పోలీస్ డీజీపీ బి. శివధర్ రెడ్డి దివంగత బి. రామనాయుడు సోదరుడు బోయ బీచుపల్లికి రూ. 1.05 కోట్ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమానికి ఐజీ వెల్ఫేర్, ఐపీఎస్ డాక్టర్ గజరావు భూపాల్, జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ రితేష్ కుమార్, తెలంగాణ దక్షిణ ప్రాంత డీజీఎం, రీజినల్ హెడ్ రవి హెచ్ జి, డిఫెన్స్ బ్యాంకింగ్ అడ్వైజర్ బ్రిగేడియర్ సనియాయ్ కుమార్ ప్రసాద్, తదితర టీజీ పోలీస్, బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు హాజరయ్యారు.

## ఓఆర్ఆర్‌పై డిసిఎంను ఢీకొన్న కారు

- మాగంటి కూతుళ్లకు ప్రమాదం



హైదరాబాద్, మార్చి23 (జనంసాక్షి) : దివంగత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కూతుళ్ల ప్రయాణిస్తున్నవాహనం ప్రమాదానికి గురైంది. ఆదివారం రాత్రి మాగంటి కూతుళ్ల ప్రయాణిస్తున్న కారు ఓఆర్ఆర్‌పై గచ్చిబౌలి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వైపు వెళ్తుండగా డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మాగంటి పెద్ద కూతురు అక్షరకు తీవ్రగాయాలు కాగా.. చిన్నకూతురుతోపాటు మరో వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. దీంతో వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. నార్సింగ్ పోలీస్ అకాడమీ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. పెద్ద కూతురు అక్షర చికిత్స అనంతరం కోలుకుంటుందని, చిన్న కూతురు స్వల్ప గాయాలపాలైందని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ స్నేహితులను ఎయిర్‌పోర్టులో వదిలిపెట్టి తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

## బడ్జెట్‌లో ప్రభుత్వాలు బీసీలకు మొండిచేయి

- రేవంత్ సర్కార్ పై టీఆర్పీ నాయకుల ఆగ్రహం
- సీఎం రేవంత్ రాజీనామా చేయాలని అఖిల్ పాషా డిమాండ్
- కరీంనగర్ జిల్లాలో భారీ ర్యాలీ, కలెక్టర్ కార్యాలయం ముట్టడి
- అరెస్ట్ చేసి పోలీస్ ట్రెనింగ్ సెంటర్‌కు తరలించిన పోలీసులు




కరీంనగర్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో బీసీలకు తగిన నిధులు కేటాయించలేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యవర్గం మరియు రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారు ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కేంద్రంలో జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా హాజరయ్యారు. పార్టీ నాయకులు కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి, కన్లకు గంతలు కట్టుకొని నగరంలో గీతభావన్ చౌరస్తా నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు దిగి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించే ప్రయత్నం చేశారు. పోలీసులు అప్రమత్తమై పార్టీ నాయకులను కార్యకర్తలను అరెస్ట్ చేసి నగరంలో ఉన్న సిటీ పోలీస్ ట్రెనింగ్ సెంటర్ కి తరలించారు. అనంతరం టీఆర్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మీడియా తో మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో బిసిలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని, ఆ దొంగ హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందనే విషయాన్ని రేవంత్ గుర్తుతెచ్చుకోవాలని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రతి ఏడాది బీసీల అభివృద్ధికి 20,000 కోట్లు కేటాయిస్తామని ప్రకటించినప్పటికీ, ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం 12,000 కోట్లకే పరిమితం చేయడం అన్యాయమని, బీసీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని చెప్పి పక్కన పెట్టడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో 60% ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం 3.86% మాత్రమే కేటాయించి అందులో పక్కా ఖర్చు చేసేది 1% మాత్రమే అని చెప్పుకొచ్చారు. అధిక శాతం ఉన్న బిసిలకు బడ్జెట్ విషయంలో న్యాయానికి విరుద్ధమని మండిపడ్డారు. బిసిలకు 51% బడ్జెట్ కేటాయించాల్సి ఉండగా, ప్రభుత్వం కేవలం అంకెల గారడీతో ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. రాష్ట్ర క్యాబినెట్‌లో బీసీలకు సరైన ప్రాతినిధ్యం లేదని, 16 మంది మంత్రుల్లో కేవలం ముగ్గురు మాత్రమే బీసీ వర్గానికి చెందినవారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ధ్యక్షులు గంగిపెల్లి అరుణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా ఉపాధ్యక్షుడు ఇరగదిండ్ల సురేశ్, మైనార్టీ ప్రెసిడెంట్ వాజిద్, ప్రధాన కార్యదర్శి అంకుష్, యూత్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్, మండల అధ్యక్షులు ఓర్సు రాజు, చెరుకు పైడయ్య, అమ్మిగల్ల కుమార్, కిరణ్, ఇశ్రత్ శవాలి, కనుమల సరిత, విమల, చిగుర్ల మోహన్, కోట సమ్మయ్య, కొప్పుల వెంకటేష్, ఓర్సు కార్తీక్, దండుగల మోహన్, సల్లంగుల రాము, కృష్ణ, సత్తిష్, విజయ్, వంశీ పాల్గొన్నారు.

## 25న ఇందిరా పార్కు వద్ద పెన్షనర్ల ధర్నా

హైదరాబాద్ (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం మార్చి 25న చేసిన పెన్షన్ దృవీకరణ చట్టాన్ని రద్దు చేయాలనీ, 8వ వేతన సవరణ కమిషన్ కు ఇచ్చిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ని సవరించాలని కోరుతూ 25.03.2026న హైదరాబాద్ లోని ఇందిరా పార్కువద్ద పెద్ద ఎత్తున మాస్ ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కేంద్ర పెన్షనర్ల కన్వీనర్ పి. నారాయణ రెడ్డి, పి. క్రుష్ణ మూర్తి, వి క్రిష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలియజేసారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టం రానున్న కాలంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లందరి మెడకూ చుట్టుకోనుందని, దానిని నివారించడానికి పెన్షనర్లందరూ కలిసి పోరాడ వలసిన అవసరం ఉందనీ, కాబట్టి అన్ని రకాల పెన్షనర్లు ఈ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వాలిడేషన్ ఆఫ్ సిసిఎస్(పెన్షన్) రూల్స్ చట్టం 2025 ని రద్దు చేయాలని, 8వ వేతన సవరణ కమిషన్ టర్మ్స్ ఆఫ్ రిఫరెన్సుని సవరించాలని, ఎన్‌పీఎస్/యూపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి డిఫైండ్ పెన్షన్(ఓపీఎస్) విధానాన్ని అమలు చేయాలని, కమ్యూటేషన్ ఆఫ్ పెన్షన్ రికవరీ కాలాన్ని 11 సం. ల 3 నెలలకు తగ్గించాలని 01.01.2017 నుండి జరగవలసిన బిఎస్ఎన్ఎల్ ఎంటిఎన్ఎల్ పెన్షనర్ల పెన్షన్ సవరణని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల బకాయిల చెల్లింపు విషయంలో కోర్టుకు వెళ్లి సానుకూల ఉత్తర్వులు పొంది, మళ్లీ కంటెప్ట్ ఆఫ్ కోర్టు కేసు వేస్తేనే బకాయిలు చెల్లించే విధానం కాకుండా అందరికీ ఒకే సారి బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని తెలిపారు.

# విద్యాశాఖలో అమ్మగారి వింత రాజకీయం

- పెద్ద పదవికి నో.. చిరు పదవికి సై!
- రికార్డులు రాసింది ఒకరు.. ఫలాలు ఆశించేది మరొకరు!
- విద్యార్థుల భవితవ్యంపై నీలినీడలు
- పాలమూరు విద్యాశాఖ లో వింత పోకడలు




మహబూబ్‌నగర్ (జనంసాక్షి) : పాలమూరు జిల్లాలోని ఒక ప్రతిష్టాత్మక ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలి వ్యవహారం ప్రస్తుతం విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది. బాధ్యతాయుతమైన ఉన్నత పదవిని చేపట్టడానికి వెనుకాడుతూ, కేవలం వ్యక్తిగత ప్రయోజనం ఉన్న చిన్న స్థాయి ఇన్-చార్జ్ బాధ్యత కోసం ఆమె పట్టుబట్టడం వివాదానికి దారితీసింది.

మహబూబ్ నగర్ జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను సుమారు 150 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు.వీరి రికార్డుల నమోదు, భద్రపరచడం వంటి అత్యంత కీలకమైన 'ఎస్-ఎస్‌సీ ఇన్-చార్జ్' బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించేందుకు గతంలో ఉన్న ప్రధానోపాధ్యాయులు నైపుణ్యం కలిగిన ఇతర ఉపాధ్యాయులకు ఆ పనిని అప్పగించారు. సదరు ఉపాధ్యాయులు నిర్ణీత సమయంలో ఆ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. అయితే, ఆ సమయంలో సీనియారిటీ ఉన్నప్పటికీ, పనితీరుపై నమ్మకం లేక ఆమెకు ఆ బాధ్యతలు ఇవ్వలేదని సమాచారం.

### పని పూర్తయ్యాక పదవి కోసం పట్టు!

ప్రస్తుతం విద్యా సంవత్సరం ముగింపు దశకు రావడం, రికార్డుల పని అంతా పూర్తవడంతో.. ఇప్పుడు ఆ 'ఎస్ఎస్‌సీ ఇన్-చార్జ్' పదవిని తనకే ఇవ్వాలని సదరు సీనియర్ ఉపాధ్యాయురాలు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. సీనియారిటీని సాకుగా చూపుతూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు కూడా ఆమె సిద్ధపడటం గమనార్హం.

### బాధ్యత అంటే భయం.. లాభం అంటే ఇష్టం?

అదే సమయంలో, పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎఫ్ఏసీ ప్రధానోపాధ్యాయురాలి హోదాను చేపట్టే అవకాశం వచ్చినప్పటికీ, బాధ్యతలు ఎక్కువగా ఉంటాయన్న కారణంతో ఆమె ఆ పదవిని తిరస్కరించినట్లు పాఠశాల వర్గాలు చెబుతున్నాయి. ఉన్నత పదవిని వద్దనుకుని.. ఇతరులు కష్టపడి పూర్తి చేసిన పనికి వచ్చే ప్రయోజనాల కోసం ప్రాకులాడటంపై తోటి ఉపాధ్యాయులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

### వృత్తి ధర్మంపై ప్రశ్నలు

ఈ ఘటన ఉపాధ్యాయులలో ఉండవలసిన అంకితభావం మరియు బాధ్యతాయుత ప్రవర్తనపై పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల పనితీరుపైనే ఆధారపడి ఉంటుంది. మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి తప్ప, కేవలం సౌలభ్యం లేదా లాభం కోసం ప్రయత్నించడం సరైన ధోరణి కాదని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

- భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా యస్ కె యం కన్వీనర్ ల పిలుపు




హైదరాబాద్ (జనంసాక్షి) : భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు అమరవీరుల స్ఫూర్తి తో సామ్రాజ్యవాదానికి వ్యతిరేక దినంగా పోరాడుదామని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టీ సాగర్, పశ్యపద్మ, బి రాము, మామిడాల బిక్షపతి, జక్కుల వెంకటయ్య లు పిలుపునిచ్చారు. ఈరోజు (మార్చి 23న) హిమాయత్ నగర్ (హైదరాబాద్)లో జరిగిన భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపాలని, అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని, 4 కార్మిక చట్టాలను, ఇతర కార్పొరేట్ అనుకూల చట్టాలు, విధానాలను తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ఇరాన్‌పై యుద్ధం అనైతికమైనది, చట్టవిరుద్ధమైనదని, డోనాల్డ్ ట్రంప్, బెంజమిన్ నెతన్యాహులను యుద్ధ నేరస్థులుగా ప్రకటించి, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించినందుకు, సార్వభౌమ దేశమైన ఇరాన్‌పై దాడి చేసినందుకు వారిపై విచారణ జరిగేలా చూడాలని కోరారు. బ్రిక్స్ కూటమికి భారతదేశం అధ్యక్షత వహిస్తున్నప్పటికీ, గాజా/పాలస్తీనా, వెనిజులా, ఇరాన్‌లలో జరుగుతున్న మారణహోమం వంటి పలు పరిణామాలపై మోదీ ప్రభుత్వం మౌనం వహించిందని, అదే సమయంలో, మిగతా సభ్య దేశాలన్నీ ఈ సమస్యలన్నిటిపై అమెరికా-ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా గట్టి వైఖరిని తీసుకున్నాయి. ఈ అమెరికా అనుకూల సామ్రాజ్యవాద విధానం భారతదేశాన్ని ఇతర ప్రపంచ దేశాల మధ్య ఏకాకిని చేసిందని, రైతులు, కార్మికులు, దేశీయ పరిశ్రమల కీలక ప్రయోజనాలను ప్రభావితం చేసే అసమాన వాణిజ్య ఒప్పందాన్ని అమెరికాతో మోదీ ప్రభుత్వం అంగీకరించడంలో, జాతీయ సార్వభౌమత్వం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి పరిమితం కావడానికి సిద్ధంగా ఉందని, ఈ నేపథ్యంలో, అమెరికా అనుకూల విధానానికి, అమెరికా వాణిజ్య ఒప్పందంపై ట్రంప్ బెదిరింపు వ్యూహాలకు గురైన భారత ప్రజల ప్రయోజనాలను వదులుకోవడానికి మధ్య ఉన్న సంబంధాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ ప్రభుత్వం లొంగిపోవడానికి, ఇరాన్‌పై యుద్ధానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని రైతులు, మేధావులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యస్ కె యం నాయకులు మూడ్ శోభన్, జ్వాలా వెంకటేశ్వర్లు, హాజీ మలంగ్, కాశీం తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ లింగమూర్తి గొప్ప పాలనాదక్షుడు

- కేయూ వైస్ ఛాన్సలర్ కర్నాటి ప్రతాపరెడ్డి



హనుమకొండ (జనంసాక్షి) : కాకతీయ విశ్వవిద్యాలయం పాలకుల్లో ప్రొఫెసర్ లింగమూర్తి గొప్ప పాలనా దక్షుడని కేయూ వీసీ కర్నాటి ప్రతాపరెడ్డి కొనియాడారు. ఇటీవల అకాల మరణం చెందిన కేయూ మాజీ వీసీ లింగమూర్తి సంస్మరణర్థం పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అధ్యక్షతన ఆచార్య లింగమూర్తి యాది సభ ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆచార్య లింగమూర్తికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి, అనంతరం మాట్లాడుతూ మానవతకు మారుపేరు ఆచార్య లింగమూర్తి అని కొనియాడారు. కేయూ జర్నలిజం విభాగం సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైస్ ఛాన్సలర్ హాజరై లింగమూర్తి చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. ప్రస్తుతం వర్సిటీలో ఉన్న పర్మినెంట్ ఉద్యోగులు లింగమూర్తి నియమించిన వాండ్లు 50 శాతం మంది ఉండడం, ఆయన పని తీరుకు ఇది గొప్ప నిదర్శనమన్నారు. ఉద్యోగ నియామకాల్లో వీసీల పాత్ర ఎంతో కీలకమని, వారిపై ఎంతో ఒత్తిడి ఉంటుందన్నారు. ముఖ్యంగా రిక్రూట్మెంట్ ను విజయవంతం చేయడంలో వీసి లింగమూర్తి గణనీయమైన పాత్ర పోషించారని ఆయన గొప్పతనాన్ని కొనియాడారు. 50 సంవత్సరాల కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్రలో అభివృద్ధి కోసం తండ్లాడిన ముగ్గురు, నలుగురు వీసీలలో లింగమూర్తి ఒకరిని ఇలాంటి వీసిలు వస్తే విశ్వవిద్యాలయాలు ఎంతో మెరుగు పడతాయన్నారు. లింగమూర్తి గారు లేని లోటును ఎవరూ తీర్చ లేనిదని, ఆ కుటుంబ సభ్యులు ఈ బాధ నుండి కోలుకునేలా దేవుడు వారికి శక్తిని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆయన యూనివర్సిటీకి చేసిన సేవలకుగాను స్మరించుకోవడం కోసం వచ్చే నెల మొదటి వారంలో యూనివర్సిటీ అధికారికంగా లింగమూర్తి సంస్మరణ సభ నిర్వహించనుందని విసి ప్రతాప్ రెడ్డి తెలిపారు. విద్యార్థులకు, టీచర్లకు ఉద్యోగులకు నిస్వార్థంగా లింగమూర్తి 35 సంవత్సరాలపాటు సేవలందించడం ఎంతో గర్వకారణమని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఒత్తిళ్లు, ఇబ్బందులు అధిగమించి ఆయన సుదీర్ఘకాలంపాటు వైస్ చాన్సలర్‌గా పని చేయడం చాలా గొప్ప విషయం అని, ఆయన ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్తామని వీసీ ప్రతాపరెడ్డి అన్నారు. ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకట్ నారాయణ మాట్లాడుతూ పదవులు వచ్చిన తర్వాత చాలామంది అధికారులు స్వార్థంతో ఆస్తులు పెంచుకునే పనిలో పడతారు కానీ దానికి విరుద్ధం లింగమూర్తి అని అన్నారు. కనీసం తన కుటుంబాన్ని కూడా పట్టించుకోకుండా యూనివర్సిటీకి సేవలందించారన్నారు. పదవిలో ఉన్నప్పుడు ఆర్ బాటలకు పోయే ఎంతోమందితో పోల్చితే,వారి పిల్లల పెళ్లిళ్లు కూడా చాలా సాధారణంగా జరిగాయని తెలిపారు. పదవుల కోసం ఎలాంటి అక్రమాలు చేయలేదని, కొంతమంది స్వార్థం కోసం ఆయనను బ్లాక్ మెయిల్ చేసి ఇబ్బంది పెట్టారన్నారు. ఒక విద్యావేత్తగా, పరిపాలకుడిగా ఆయన ఆదర్శ సేవలు అందించారని కొనియాడారు. ఆ కుటుంబ సభ్యులకు సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించాలని సభలో ఉన్న వారికి సూచించారు.

శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ ఇక్బాల్ ఆలీ మాట్లాడుతూ ఎస్ఆర్ఆర్ కాలేజీలో చదివిన లింగమూర్తి మొదటి నుంచి ఎంతో బ్రిలియంట్ స్టూడెంట్ అని కొనియాడారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఎంఫిల్‌లో టాపర్‌గా నిలిచారని, అందరితో నిత్యం కాంటాక్ట్ లో ఉండడం ఆయన గొప్పతనం అని కొనియాడారు. మానవతావాదిగా ఆయన ఎంతో పేరు సంపాదించారని అన్నారు. ఈ యాది సభలో ఆచార్య లింగమూర్తి విశ్వవిద్యాలయానికి చేసిన సేవలకు గాను కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలకు ఆచార్య లింగమూర్తి ఇంజనీరింగ్ కళాశాలగా పేరు పెట్టాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి ఆచార్య వడ్డే రవీందర్, ఆచార్య ఏం సారంగపాణి, ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్, ప్రొఫెసర్ కుంట ఐలయ్య, ప్రొఫెసర్ బిక్షాలు, ప్రొఫెసర్ స్వర్ణలత, కేయు,పాలకమండలి సభ్యులు డాక్టర్ రమాదేవి, డాక్టర్ చిర్రరాజు, పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య పాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మెరుగు బాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు డాక్టర్ తాడూరు శాస్త్రి, ఉపాధ్యక్షులు డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ మమత, భార్గవి శర్మ రమేష్ నాయక్ కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, పాస్ నాయకులు బేరే జనార్ధన్, శ్రీరామ్ వీరయ్య, బేరే కేదారి, బోళ్ల వీర ప్రతాప్, బోధ నేతర సిబ్బంది నాయకులు వల్లాల తిరుపతి, యాదగిరి, మూర్తి, గిడియన్, డాక్టర్ వంగల సుధాకర్, డాక్టర్ ఏ సంపత్ కుమార్, డాక్టర్ ఎం.బ్రహ్మం, డాక్టర్ బి వీరేందర్, డాక్టర్ చాగంటి శ్రీనివాస్, డాక్టర్ రాజు నాయక్, తదితరులునివాళులు అర్పించారు



### తెలంగాణ మలిదశ ఉద్యమకారులపై రౌడీషీట్లు ఎత్తివేత

హాలియా (జనంసాక్షి) : హాలియా పట్టణంలో తెలంగాణ మలిదశ ఉద్యమ కాలంలో పాల్గొన్న పలువురు ఉద్యమకారులపై నమోదైన రౌడీషీట్లను ఎత్తివేస్తూ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమకారులు వర్ర వెంకటరెడ్డి, వడ్డే సతీష్ రెడ్డి, వర్ర రామకృష్ణారెడ్డి, కోనేటి శ్రీను, గోపిశెట్టి నరసింహ, ఎడారి రాములు, షేక్ హుస్సేన్, నాగార్జున మధుసూదన చారి, సయ్యద్ జావిద్‌పై నమోదైన రౌడీషీట్లు రద్దయ్యాయి. తమపై పెట్టిన రౌడీషీట్లను రద్దు చేయాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి గారితో పాటు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయగా, ప్రభుత్వ నిర్ణయంతో వీరికి ఊరట లభించింది. ఈ సందర్భంగా తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు వర్ర వెంకటరెడ్డి మాట్లాడుతూ, రౌడీషీట్లు ఎత్తివేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే గారిని త్వరలో స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేయనున్నారు.

## టూ వీలర్‌ను ఢీకొన్న చెత్త వాహనం

- ద్విచక్రవాహనం కిందపడి వ్యక్తి మృతి

హైదరాబాద్, మార్చి23 (జనంసాక్షి) : లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఒకరు మృతి చెందారు. కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని కీసర ఓఆర్ఆర్ వద్ద చెత్త లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగింది. యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామానికి చెందిన రవీందర్ (54) ద్విచక్ర వాహనంపై కీసర మీదుగా మల్యాలకు వెళుతుండగా లారీ ఢీ కొంది. దీంతో లారీ వెనుక టైర్ కింద పడి పోయి మృతి చెందాడు. కీసర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని మృత దేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు.

## ప్రైవేట్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

హైదరాబాద్, మార్చి23 (జనంసాక్షి) : హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ పోలీసు స్టేషన్ పరిధి విజయనగర్ కాలనీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శృతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి మూడో అంతస్తులో ఏసీ పేలడంతో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో భయాందోళనకు గురైన సిబ్బంది, రోగులు బయటికి పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకొని మంటలను ఆర్పుతున్నారు.

## నేటి నుండి 8 బృందాలతో ఆకస్మిక తనిఖీలు

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : జిల్లా వ్యాప్తంగా గృహ వినియోగానికి కేటాయించిన ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను కొంతమంది వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగిస్తున్న నేపథ్యంలో, అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో వాణిజ్య సముదాయాల వద్ద రెండు రోజులుగా అవగాహన అని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. ఇకనుండి చట్ట విరుద్ధంగా గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్, వాణిజ్యానికి పరంగా ఉపయోగించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయబడతాయని ఎస్పి హెచ్చరిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రభుత్వం సబ్సిడీతో ప్రజలకు అందిస్తున్న గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, ఇతర వ్యాపార సంస్థల్లో వినియోగించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమే కాకుండా, ప్రజల ప్రాణ భద్రతకు కూడా ముప్పు కలిగిస్తాయని తెలిపారు.డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిం చడం వల్ల గ్యాస్ లీకేజీ, అగ్ని ప్రమాదాలు వంటి ప్రమాదాల అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. రేపటినుండి జిల్లా వ్యాప్తంగా 8 బృందాలచే తనిఖీలను నిర్వహించారని తెలిపారు.



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
24 మార్చి 2026

# డిజిటల్ యుగంలో సమాచార కేంద్రాలు

## నాయకత్వం లేకుండా పరివర్తన సాధ్యమేనా?



ఇరవై ఒకటవ శతాబ్దపు సమాచార కేంద్రాలు (గ్రంథాలయాలు, ఆర్కైవ్ లు, డేటా సెంటర్లు) కేవలం భౌతిక స్థలాలుగా మాత్రమే కాకుండా, డిజిటల్ పరిసరాల్లో చైతన్యవంతమైన జ్ఞాన కేంద్రాలుగా రూపాంతరం చెందుతున్నాయి. ఈ పరివర్తనకు కేంద్ర బిందువుగా నిలిచేది 'డిజిటల్ నాయకత్వం' (డిజిటల్ లీడర్షిప్). సాంప్రదాయ నిర్వహణకు, డిజిటల్ యుగపు సవాళ్లకు మధ్య వారధిగా వ్యవహరించే ఈ నాయకత్వ శైలి, నేటి సమాచార వ్యవస్థల ఔచిత్యాన్ని, స్థిరత్వాన్ని నిర్ణయించే అత్యంత కీలక అంశంగా మారింది.

**డిజిటల్ నాయకత్వం అంటే ఏమిటి?**

సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే డిజిటల్ నాయకత్వం కాదు. ఇది సంస్థాగత దృష్టిని డిజిటల్ యుగానికి అనుగుణంగా మార్చుకోగల సామర్థ్యం, సాంకేతిక ఆవిష్కరణలను సమర్థవంతంగా స్వీకరించడం, మానవ వనరులను సాధికారులను (ఎంపవర్) చేయడం, మరియు డిజిటల్ సంస్కృతిని సృష్టించగల నైపుణ్యం. సమాచార కేంద్రాల సందర్భంలో, డిజిటల్ నాయకుడు అనేది కేవలం సాఫ్ట్వేర్ ను ఇన్ స్టాల్ చేసే సాంకేతిక నిపుణుడు మాత్రమే కాదు; అతను డిజిటల్ వ్యూహాన్ని రూపొందించే దార్శనికుడు, సిబ్బందిలో మార్పుకు ప్రేరణనిచ్చే మార్గదర్శి, అలాగే సంక్లిష్ట డిజిటల్ పర్యావరణ వ్యవస్థలను నావిగేట్ చేసే నిపుణుడు.

**సాంప్రదాయ నిర్వహణకు, డిజిటల్ నాయకత్వానికి మధ్య వ్యత్యాసం**

సాంప్రదాయ గ్రంథాలయ నిర్వహణ అనేది గతంలో, వాటి స్థిరత్వం, క్రమబద్ధత, సంగ్రహణ, అలాగే వాటి ముఖాముఖి సేవలపై ఆధారపడి ఉండేది. నిర్వాహకుడి పాత్ర పరిపాలనాపరంగా, సంరక్షణాత్మకంగా ఉండేది. అయితే, డిజిటల్ నాయకత్వం ఈ నమూనాను సమూలంగా మారుస్తుంది.

**1. స్థిరత్వం నుంచి చురుకుదనం వరకు:**
డిజిటల్ నాయకుడు మారుతున్న సాంకేతిక పోకడలకు (క్లౌడ్ కంప్యూటింగ్, (ఏఐ), డేటా అనలిటిక్స్) అనుగుణంగా తక్షణమే నిర్ణయాలు తీసుకోగలగాలి.

**2. సంరక్షణ నుంచి ఆవిష్కరణ (ఇన్నోవేషన్) వరకు :**
ఇప్పటికే ఉన్న వనరులను కాపాడుకోవడం మాత్రమే కాకుండా, వర్చువల్ రియాలిటీ, ఓపెన్ యాక్సెస్ రిపోజిటరీలు, డిజిటల్ ప్రిజర్వేషన్ వంటి కొత్త మార్గాల ద్వారా సేవలను విస్తరింపజేయడం.

3.సింగిల్ ఇంటర్ ఫేస్ నుంచి మల్టిపుల్ ఇంటర్ ఫేస్ డిజిటల్ స్థలం:
డిజిటల్ నాయకత్వంలో భాగంగా నాయకుడు భౌతిక స్థలాన్ని మాత్రమే కాకుండా, వెబ్సైట్లు, సోషల్ మీడియా, డిజిటల్ రిపోజిటరీలు, మొబైల్ యాప్ లతో కూడిన సంక్లిష్ట డిజిటల్ ఈకో-సిస్టమ్స్ ను నిర్వహించాలి.

**సమాచార కేంద్రాల్లో డిజిటల్ నాయకత్వం యొక్క ప్రధాన అంశాలు:**

ఒక సమర్థవంతమైన డిజిటల్ నాయకత్వం నాలుగు ప్రధాన స్తంభాలపై నిలుస్తుంది:

**1. దార్శనికత (విజనరీ అవుట్ లుక్):**
భవిష్యత్తులో సమాచార కేంద్రం ఎలా ఉండాలి? వినియోగదారుల డిజిటల్ అవసరాలు ఏమిటి? ఈ ప్రశ్నలకు స్పష్టమైన దృష్టితో, డిజిటల్ పరివర్తనకు సంబంధించిన దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించడం నాయకుని ప్రధాన బాధ్యత. ఉదాహరణకు, భౌతిక పుస్తకాలతో పాటు ఈ-బుక్స్, ఆడియో బుక్స్, డేటాబేస్ లను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం.

**2. డిజిటల్ సాక్షరత అలాగే నైపుణ్యాభివృద్ధి:**
సిబ్బందికి డిజిటల్ సాక్షరత లేకపోతే, అత్యాధునిక సాంకేతికత కూడా విఫలమవుతుంది. డిజిటల్ నాయకుడు తన బృందంలోని ప్రతి సభ్యునికీ డేటా అనలిటిక్స్, (ఏఐ) టూల్స్, సైబర్ భద్రతా ప్రోటోకాల్స్ పై నిరంతర శిక్షణ ఇచ్చి, వారిని 'డిజిటల్ లైబ్రేరియన్లు'గా మార్చాలి.

**3. డేటా ఆధారిత నిర్ణయాధికారం (డేటా - డ్రివెన్ డెసిషన్ మేకింగ్ ):**
సాంప్రదాయంలో నిర్ణయాలు అనుభవం లేదా ఇంటర్నెట్ జ్ఞానం పై ఆధారపడి ఉండేవి. డిజిటల్ నాయకత్వంలో, వినియోగదారుల ప్రవర్తన, వనరుల వినియోగం, డిజిటల్ ట్రాఫిక్ విశ్లేషణ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది. ఏ వనరు (రిసోర్స్) ఎక్కువగా ఉపయోగించబడుతుంది? ఏ సమయంలో డిజిటల్ సేవలకు డిమాండ్ ఎక్కువ? ఈ డేటాను అర్థం చేసుకోగలిగిన నాయకుడే విజయవంతమవుతాడు.

**4. సహకార సంస్కృతి (కొలాబరేటివ్ కల్చర్):**
డిజిటల్ ప్రపంచం ఒంటరిగా పనిచేయడానికి కాదు. డిజిటల్ నాయకుడు ఐటీ విభాగం, విద్యాసంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలు, అలాగే ఇతర ప్రైవేట్ డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లతో సమన్వయం చేసుకోవాలి. ఇది వనరుల సమీకరణను సులభతరం చేస్తుంది అలాగే డూప్లికేట్ నకిలీ పనిని తగ్గిస్తుంది.

**సవాళ్లు, బాధ్యతలు:**

డిజిటల్ నాయకత్వం అనేది సవాళ్లను ఎదుర్కోవడం కూడా. సైబర్ భద్రతా బెదిరింపులు, వేగంగా మారుతున్న సాంకేతికతతో పోటీ పడటం, వృద్ధాప్య సిబ్బందిలో మార్పుకు వ్యతిరేకత, అలాగే బడ్జెట్ పరిమితులు ప్రధాన సమస్యలు. ఈ సందర్భంలో, డిజిటల్ నాయకుడు సాంకేతిక నిపుణుడు మాత్రమే కాకుండా, ఒక మార్పు నిర్వాహకుడు (చేంజ్ మేనేజర్) గా వ్యవహరించాలి. సిబ్బంది భద్రతా భావనను దెబ్బతీయకుండా, కొత్త విధానాలను అమలు చేయడంలో సునిశితత అవసరం. అంతేకాకుండా, డిజిటల్ నాయకుడు సమానత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలి. డిజిటల్ విభజన (డిజిటల్ డివైడ్) ఎక్కువగా ఉన్న సమాజంలో, సాంకేతిక సేవలు అందరికీ అందుబాటులో ఉండేలా చూసుకోవడం నైతిక బాధ్యత. దృశ్య, శ్రవణ దోషాలు ఉన్నవారికి అనుకూలమైన డిజిటల్ ఇంటర్ఫేస్ లను అందుబాటు లోకి తీసుకురావడం కూడా డిజిటల్ నాయకుని పాత్రలో భాగమే.

**భవిష్యత్తు కోసం ఒక దృష్టి:**

డిజిటల్ నాయకత్వం అనేది ఒక స్థానం కాదు, ఒక మనస్తత్వం (మైండ్సెట్). సమాచార కేంద్రాలు కేవలం భౌతిక భవనాలుగా మిగిలిపోవాలా, లేక డిజిటల్ యుగానికి అనుగుణంగా చైతన్యవంతమైన, ప్రపంచ స్థాయి జ్ఞాన కేంద్రాలుగా ఎదగాలా అనే ద్వంద్వ ప్రశ్నకు సమాధానం ఈ నాయకత్వం లోనే దాగి ఉంది. భారతీయ సందర్భంలో, నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా (ఎన్.డీ.ఎల్.ఐ.) వంటి ప్రాజెక్టులు విస్తరిస్తున్న ఈ తరుణంలో, ప్రతి సమాచార కేంద్రానికి ఒక బలమైన డిజిటల్ నాయకుడు అవసరం. ఐటీ పరిజ్ఞానం, మానవ సంబంధాల నైపుణ్యం, మార్పును స్వీకరించే ధైర్యం కలిగిన ఈ నాయకులు మాత్రమే సమాచార కేంద్రాలను 'నిశ్చల నిలయాలు' నుంచి 'డైనమిక్ డిజిటల్ హబ్బులు'గా మార్చగలరు. భవిష్యత్తులో నిలదొక్కుకోవాలంటే, సమాచార నిపుణులు ఈ డిజిటల్ నాయకత్వ లక్షణాలను సంతరించుకోవడం ఇక ఐచ్చికం కాదు, అనివార్యం కూడా.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

---

విశ్వశాంతి-మన సంకల్పం
ప్రపంచం ఆధిపత్య పిడుగుల మధ్య
పలుకరించుకో లేక వణుకుతోంది...
మానవత్వం మౌనంగా కన్నీళ్లు కారుస్తోంది...
సరిహద్దుల గీతలు దాటి?
గాయాలయ్యే వేళ,బాంబుల నాదం
భవిష్యత్తును భయపెడుతోంది...
బాల్యం బూడిదైపోతే
భూమాత మాత్రం నవ్వుతుందా?
తల్లి కన్నీరు తుడవని యుద్ధం
విజయం అవుతుందా?

అహంకారం అగ్నిగా మారితే
అమాయక జీవితాలు బలైపోతున్నాయి...
విద్వేషం విత్తిన చోట
శాంతి పూలు పూయవు ఎప్పుడూ?
ప్రేమ ఒక చుక్క పడితే
వేలహృదయాల్లో ప్రశాంతత
వెలుగొందుతోంది...
మనిషి మనీషిగా నిలబడితేనే
మనుగడకు అర్థంమిగులుతుంది...
కలిసిన చేతులు శక్తి అవుతాయి,
కలిసిన హృదయాలు శాంతిని నెలకొల్పుతాయి...

విధ్వంసం కాదు వినయం కావాలి,
ఆయుధం కాదు-ఆత్మీయత కావాలి
సహనం మార్గం చూపితే
శాంతి పావురంమళ్లీఎగురుతుంది.
మనసులు మారితేనే-మారుతుంది లోకం.
మానవత్వమే విశ్వానికి నిజమైన దీపం.
శాంతి కోసం కలిసే అడుగులే-
మానవీయ(మన)విజయానికి నిజమైన మార్గం.

మేకిరి దామోదర్
కవి రచయిత, జిల్లా : హనుమకొండ,

---

దశాబ్దాలుగా వెలమ, రెడ్డి రాజకీయాల మధ్య నలుగుతున్న

# జగిత్యాల బీసీ రాజకీయాలు

## టి జీవన్ రెడ్డి భవిష్యత్తు ఎలా వుండాలి




ఇటీవల ఏర్పడిన జగిత్యాల జిల్లా ప్రాంతం దశాబ్దాలుగా వెలమ రెడ్డి రాజకీయాల మధ్య బీసీల రాజకీయాలు నలిగి పోతున్నాయి. పార్టీ టికెట్ ఇస్తే బీసీలు తప్పకుండా గెలుస్తారు. కాని టికెట్ రాకుండా రాజకీయాలు చేస్తారు. టికెట్ వచ్చాక సొంత పార్టీ అభ్యర్థిని ఓడించే రాజకీయాలు చేస్తారు. అయినా బీసీలు టికెట్ ఇచ్చాక గెలుచుకుంటూ వచ్చారు.

జగిత్యాల నియోజక వర్గ రాజకీయాల్లో 1969 జై తెలంగాణ ఉద్యమం ఒక మలుపు. బీసీ విద్యార్థులు బాగా చైతన్య వంతులయ్యారు. నిజానికి 1953 లోనే మెట్ పెల్లి నుండి గంగుల భూమయ్య పద్మశాలి సామాజిక వర్గం నుండి వెలమలను ఎదిరించి ఎమ్మెల్యేగా గెలిచారు. వెలమల పట్టున్న బుగ్గారం అనే నియోజక వర్గం నుండి బీసీలైన అంబల్ల రాజారాణ, కడకుంట్ల గంగారాం, శికారి విశ్వనాథం గెలిచారు. జగిత్యాల నియోజక వర్గం నుండి బీసీలైన గొడిసెల రాజేశం గౌడ్, ఎల్ రమణ టి జీవన్ రెడ్డి పై గెలుస్తూ వచ్చారు. రాయికల్ వాస్తవ్యులైన వేముల పెరుమాళ్లు బలమైన బీసీ నాయకులు. ఎమ్మెల్యే కావలసిన వారు. కాలేదు. కోరుట్ల నుండి అంబల్ల భాగ్యమ్మ, జగిత్యాల మున్సిపాలిటీ చైర్మన్ గా పుప్పాల విజయ వంతంగా ప్రశంసలు అందుకున్నారు. అంతకు చాలా ముందు జగిత్యాల మునిసిపాలిటీ చైర్మన్ గా జోగయ్య గౌడ్ పని చేసారు. మేజర్ గ్రామ పంచాయతీలైన ధర్మపురిలో , చీపురుశెట్టి కిష్టయ్య, మల్యాలలో మిట్టపెల్లి సుదర్శన్, బలమైన సర్పంచులుగా పని చేసారు. ఇలా ఆయా కాలాల్లో ఎమ్మెలెలుగా పోటీ చేసి గెలిచే విధంగా ఎదుగుతూ వచ్చారు.

. రాష్ట్ర రాజకీయాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి రాజకీయ నాయకులు శాసన సభ్యత్వానికి రాజీనామా చేసారు. తరువాత డాక్టర్ మర్రి చెన్నారెడ్డి రాజకీయం పెరిగింది. బీసీ రాజకీయం రాష్ట్ర స్థాయి నాయకత్వ మద్దతు లేక వెనక బడింది.

రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పడానికి బాలా గౌడ్, కొండలా లక్ష్మణ్ బాపూజీ గారల శక్తి చాల లేదు. కమంగా. వెలమ రెడ్డి రాజకీయాల బలం పెరిగి బీసీ నాయకత్వం వెనక బడింది. మధ్యలో నక్సలైట్ల ఉద్యమం వచ్చింది. ఎన్నికలను బహిష్కరించాలన్నారు. దాంతో ఉద్యమంలో చైతన్య వంతులైన నాయకులు పోటీ చేయకుండా పోయింది. బీసీ ఎస్సీ ప్రజలు ఎన్నికలు బహిష్కరించడంతో వెలమలు రెడ్లు ఆడుకున్నాయి ఆట పాడుకున్నంత పాటగా అగ్ర కుల నాయకత్వానికి ఎదురు లేకుండా పోయింది. 1962లో తన కులం వారైనా పద్మశాలీలే ఎక్కువ ఉన్నారని కస్తూరి లక్ష్మణ్ జగిత్యాల పోటీ చేస్తే ఓడిపోయారు. ఆ దిగులుతో ఆత్మహత్య చేసుకున్నాడు.

1981లో జీవన్ రెడ్డి మల్యాల పంచాయతి సమితి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ ఎన్నిక యువతరానికి ఉత్తేజం. ఆ ఎన్నికతో పాత తరానికి ఫుల్ స్టాఫ్ పడింది. 1983లో ఎన్టీ ఆర్ టిడిపిలో ఎమ్మెల్యేగా గెలిచారు. ఎక్సైజ్ మంత్రి అయ్యారు. మొదటి తప్పటడుగు వేసి నాదెండ్లా భాస్కర రావును సమర్థించారు. 1985 ఎన్నికల్లో జీవన్ రెడ్డి కాంగ్రెస్ తరపున పోటీ చేయగా బీసీ సామాజిక వర్గం నుండి టిడిపీ తరపున జి రాజేశం గౌడ్ గెలిచి న్యాయ శాఖ మంత్రి అయ్యారు.

ఆ తరువాత 1994 లో జీవన్ రెడ్డిపై టీడీపి తరపున ఎల్ రమణ గెలిచి మంత్రి అయ్యారు. జగిత్యాలకు రెండు కిలోమీటర్ల దూరంలో అంతర్గామ రాజేశం గౌడ్ స్వగ్రామం. అక్కడి సుద్దాల దేవయ్య ఎస్సీ నియోజక వర్గం నుంచి గెలిచి మంత్రి. ప్రస్తుత ఎమ్మెల్యే వెలమ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సంజయ్ ది కూడ అంతర్గాం సొంత ఊరు.

మట్టదట జగిత్యాల లో వెలమ రాజకీయాలు. దాన్ని జీవన్ రెడ్డి బ్రేక్ చేసారు. జీవన్ రెడ్డి గారి రెడ్డి రాజకీయాలను బీసీ కార్డుతో రాజేశం గౌడ్, ఎల్ రమణ బ్రేక్ చేశారు. రాష్ట్ర స్థాయికి ఎదిగారు. కాని జగిత్యాల లో వారిపై జీవన్ రెడ్డి ఓడుతూ గెలుస్తూ వస్తున్నారు.

ఇలా దశాబ్దాల కాలంలో వెలమలు పోయి రెడ్డి , బీసీల రాజకీయాలు వచ్చాయి. దానికి టిడిపి అండ. కెసిఆర్ తిరిగి వెలమ రాజకీయాలు ముందుకు తెచ్చారు. కవిత మద్దతుతో వెలమ డాక్టర్ సంజయ్ కుమార్ గెలిచారు. రెండుసార్లు గెలవడంతో జీవన్ రెడ్డి రాజకీయాలు, బీసీ రాజకీయాలు వెనక్కి నెట్టి వేయబడి వెలమ రాజకీయం ముందుకు వచ్చింది. డబల్ బెడ్రూం పథకం లబ్ది దారుల ఓట్లతో రెండవసారి డాక్టర్ సంజయ్ గెలిచాడు.


బీసీలు రాజకీయంగా ఎదిగి వచ్చినప్పటికీ జీవన్రెడ్డిపై చేయి సాధించారు. జీవన్ రెడ్డి పై మలి తెలంగాణ ఉద్యమ చైతన్యంతో సంజయ్ గెలిచారు. టీఆర్ ఎస్ లోకి రమ్మని అవకాశం ఇచ్చినా ఎల్ రమణ రాలేదు. నాకు అన్నీ చేసిన టీడీపీని ఏమని వదలాలి అన్నాడు. అలా బీసీ రాజకీయం స్థానంలో తిరిగి వెలమ రాజకీయం రావడానికి ఎల్ రమణ కారకుడయ్యారు. అలా బీసీ రాజకీయాల స్థానంలో వెలమ డాక్టర్ సంజయ్ పూరించారు. ఎల్ రమణ బీసీల నుండి నాయకత్వాన్ని అభివృద్ధి చేసినప్పటికీ వారు నిల దొక్కుకోలేక పోయారు.

కాంగ్రెస్ లో జీవన్ రెడ్డి తాను తప్ప యువతరం నాయకులను తయారు చేయ లేక పోయారు. అంతదాక కాంగ్రెస్ లో వున్న నాయకులు కనుమరుగయ్యారు. జీవన్ రెడ్డి తప్ప కాంగ్రెస్ దిక్కెవరా అనే దశ ను తన చాతుర్యంతో రాజకీయాల్లో పట్టు సాధించారు. జీవన్ రెడ్డి ప్రధాన లోపం ఏమంటే జగిత్యాల దాటి ఎదగమంటే ఎదగరు.

నలభయి ఏళ్లలో కాంగ్రెస్ లో ఎవరినీ సాయకుడుగా ఎదిరించింది లేదు. . కేవలం తను చెప్తే వినే వారిని మున్సిపల్ చైర్మన్లుగా చేసాడు. సర్పంచులుగా చేసాడు. టిడిపి నుండి తనతో పాటు కాంగ్రెస్ రమ్మంటే రాని వారి మీద పగ ప్రతీకారం ఆయన్ని ఫ్యాక్షనిస్టుగా నిలిపాయి. రాజేశం గౌడ్ గెలిచి న్యా శాఖ మంత్రిగా అటు తరువాత కరీం నగర్ జిల్లా పరిషత్ చైర్మన్ గా పని చేశారు. సుద్దాల దేవయ్య కూడా ఎమ్మెల్యే గా, జిల్లా పరిషత్ చైర్మన్గా ఎస్సీల నుండి ఎదిగారు. బుగ్గారం ి యోజక వర్గం పేరు మారి ధర్మపురి నియోజక వర్గంగా ఏర్పడి ఎస్సీ రిజర్వేషన్ అయింది. దాంతో ఆ మేరకు వెలమల రాజకీయం బలం తగ్గింది. ధర్మ పురినుండి కొప్పుల ఈశ్వర్

టీఆర్ ఎస్ తరపున గెలిచి మంత్రి అయ్యారు. ఇపుడు అడ్లూరి లక్ష్మణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కోరుట్ల మెట్ పెల్లిలో బీసీల రాజకీయాలను వెనక్కి నెట్టి వెలమ రాజకీయాలు తోసుకొని వచ్చాయి. బీసీలకు టికట్లు రాకుండా చేయడం, టికట్ వచ్చినా గెలువ కుండా చేసి వెలమలనే గెలిపించుకోవడం వెలమలు మొదటి నుండి అనుసరిస్తున్న పాలసీ. ఎర్ర జెండాతో గెలిచినాయన ఆ నియోజక వర్గం తాటగానే కమలం కాషా జెండాలతో ప్రచారం చేసిన ఈ ప్రాంత వెలమల రాజకీయాలది.

ఇపుడు జీవన్ రెడ్డి రాజకీయాల్లో ఒంటరి అయ్యారు. జూనియర్ రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధ్యక్షుడు కావడాన్ని జీవన్ రెడ్డి బలంగా వ్యతిరేకించారు. జానారెడ్డి కొడుకును రేవంత్ తీసుకొని జానారెడ్డిని సంతృప్తి పరిచారు. జీవన్ రెడ్డి పిల్లలు రాజకీయాల్లోకి రాలేదు. ఇపుడు కేంద్ర రాష్ట్ర అధిష్టానంతో కాడో పేడతో తేల్చుతుందా నుకుంటున్నారు. ఈ వయసులో యువ నాయకుడిలా ప్రవర్తిస్తున్నారు. పోతే మాకు పోయేదేమా లేదు స్టింగ్రే ఎమ్మెల్యే సంజయ్ మాతో వున్నాడని రేవంత్ భరోసా! ఈ ఆవుల కొట్లాటలో బీసీల కాళ్లు విరిగినట్లవుతున్నాయి. బీసీలు తిరిగి ఎదగాలి. ఇపుడు బీసీ చైతన్యం పెరిగింది. మూడో సారి సంజయ్ కుమార్ గెలుపు సందేహాస్పదం ఇపుడు మూడు వర్గాలను సమన్వయం చేయడం రావాలి. జీవన్ రెడ్డి ి బుజ్జగించు ఆర్టీసీ చైర్మన్ వంటి ప్రతిష్ట గల సంస్థకు చైర్మన్ ను చేయాలి. జగిత్యాల రాజకీయాలనుండి రిటైర్మెంటు తీసుకోవాలి. అపుడు బీసీ రాజకీయాలకు దారి సుగమం అవుతుంది. కోల్పోయిన బీసీల అవకాశాలు పోటీ చేసి గెలిచి అందుకునే అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో డాక్టర్ సంజయ్ కుమార్ కూడాఏదో ఒక సంస్థకు చైర్మన్ అయితే జగిత్యాల్లో నూతన తరం రాజకీయాలకు అవకశం ఇచ్చిన వార వుతారు. రేవంత్ రెడ్డి, జీవన్ రెడ్డి పరస్పర గౌరవంతో పాతవి మరిచి కలిసి పోవాలి. అందుకు జీవన్ రెడ్డి పట్టు వీడాలి. మొండి పట్టుదలకు పోయి నాకన్నా జూనియర్ అని బెట్టు పోయిన కొండలా లక్ష్మణ్ బాపూజీ నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం కోల్పోయారని గుర్తు చేసుకోవడం అవసరం. కాస్త బెట్టు సడలిస్తో కొండలా లక్ష్మణ్ బాపూజీ కేంద్ర మంత్రిగా, గవర్నర్గా పదవీ విరమణ చేసి వుండేవారు. జీవన్ రెడ్డి ఈ చరిత్ర నుండి నేర్చుకోవాల్సి వుంది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

---

**వాతాపిజీర్ణం!**

వీరిదొకవిచిత్ర ప్రకృతి
అప్పుడప్పుడు వికృతి
ప్రకృతివికృతులేవైతేనేమి
పరమార్థం ఒక్కటే!
కోడిగుడ్డు పెట్టొద్దని!
పేదలతక్కువధరప్రోటీన్
ఇంతకంటే ఏముంది?
అదికూడా వద్దంటాడు!
ఏ హాస్టల్ చరిత్రచూసినా
పురుగులన్నంపాచికూర!
బాలికలహాస్టల్ ఐతే
రేప్ లు,హత్యలుకూడా!
ఇంతేలే'సూద్ర'బ్రతుకులు
చదువుల్లేకుండాచేసారు!
తెల్లోడిచలవవల్ల వీళ్లు
అంబేద్కరులయ్యారు!
దాన్నేసహించలేకపోతే
ఇప్పుడు ప్రోటీన్ గుడ్డు!
మీరుపెట్టారుగాఇన్నాళ్లు
అబద్ధాలగాడిద గుడ్డు!
అబద్ధాల గాడిదగుడ్డు
పెట్టిపెట్టినాశనంచేసారు
నిజం తెలుసుకోనివ్వండి
కోడిగుడ్డుతిననివ్వండి!
మీలాంటి పెద్దలు
ఏ గుడ్డైనా తింటారు!
జీర్ణించు కుంటారు!
జీర్ణంజీర్ణంవాతాపిజీర్ణం!
ఇన్నాళ్లు మీరు పెట్టిన
స్వర్గం,ఆత్మలు,జన్మలు
పద్నాలుగులోకాల
గాడిదగుడ్లుజీర్ణంకాలేదు
మీనోటికిఅడ్డాఆపాఎన్ని
అబద్ధాలుచెప్పినచెల్లుద్ది!
మా పిల్లల్ని కోడిగుడ్డు
తిననివ్వండి సార్ -ప్లీజ్!
శోభనం అర్థమే తెలీదు
మాకెందుకుశోభనాలు!
చతుర్వర్ణశోభనాలుమీవి
మాతిండిమమ్మల్నితిన
నివ్వండి!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

---

# జల సంరక్షణే భవిష్యత్ భద్రత

## భారతదేశం ఎదుర్కొంటున్న నీటి సంక్షోభం!



నీరు జీవనానికి ఆధారమన్న మాట చాలా సాధారణంగా వినిపిస్తుంది. కానీ 2025-26 నాటికి ఆ మాట సాధారణ నీతి వాక్యంగా మిగిలిపోలేదు - అది జాతీయ భద్రతకు, ఆర్థిక స్థిరత్వా నికి, సామాజిక న్యాయానికి, పర్యావరణ సమతుల్యతకు సంబంధం చిన అత్యంత తీవ్రమైన ప్రశ్నగా మారింది. మార్చి 22న ప్రపంచ జల దినోత్సవం జరుపుకునే రోజు కేవలం గుర్తుచేసే తేదీ కాదు; అది మన అభివృద్ధి నమూనాలు, సాగు విధానాలు, పట్టణ విస్తరణ, వాతావరణ మార్పులు, పాలనా వైఫల్యాలు, సామాజిక అసమానత లపై ప్రశ్నలు వేసే దినం. భారతదేశంలో నీటి సంక్షోభం ఇక భవిష్యత్ ఊహ కాదు - చాలా ప్రాంతాల్లో అది ఇప్పటికే వర్తమాన వాస్తవం.

**భారతదేశ జల సంస్కృతి యొక్క అసలు ఆధారం**

మనం తరచూ గంగ, గోదావరి, కృష్ణా, కావేరీ వంటి మహానదుల గురించి మాట్లాడుతాం. కానీ భారత గ్రామీణ జీవనాన్ని శతాబ్దాల తరబడి నిలబెట్టినవి ఆ మహానదులు కావు - చెరువులు, కుంటలు, గుంటలు, చిన్న ట్యాంకులు, పెర్కొలేషన్ ట్యాంకులు, వాననీటి నిల్వ గుంటలు, చెక్డ్యాంలు. జలశక్తి మంత్రిత్వశాఖ 2023--24లో విడుదల చేసిన తొలి జలముఖాల లెక్కింపు (Census of Water Bodies) ఈ వాస్తవాన్ని బహిర్గతం చేసింది. దేశవ్యాప్తంగా 24,24,540 జలముఖాలు నమోదయ్యాయి. వాటిలో 97.1% గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. 59.5% చెరువులు, 15.7 % ట్యాంకులు, 12.1% జలాశయాలు, 9.3% చెక్డ్యాంలు, 0.9 % సరస్సులు - ఈ గణాంకాలు భారతదేశ జల సంస్కృతి చిన్న, స్థానిక జల వనరులపై ఎంతగా ఆధారపడి ఉందో స్పష్టం చేస్తాయి.

ఈ చిన్న జలముఖాలు కేవలం నీటి నిల్వ కేంద్రాలు మాత్రమే కావు. అవి స్థానిక వర్షపాత చక్రాలను స్థిరపరుస్తాయి, భూగర్భజలాల రీఛార్జ్కు దోహదపడతాయి, పశువులకు నీరందిస్తాయి, సాగుకు మద్దతు ఇస్తాయి, మత్స్య సంపదకు ఆధారమవుతాయి, పక్షుల నివాసాలుగా నిలుస్తాయి, గ్రామీణ సూక్ష్మ వాతావరణాన్ని సమతుల్యం చేస్తాయి. ఒక చెరువు నిండితే పొలం పండడమే కాదు - గ్రామ ఆర్థిక వ్యవస్థలో అనేక చక్రాలు తిరుగుతాయి. ఒక చెరువు ఎండిపోతే సాగు తగ్గడమే కాదు - బావులు క్షీణిస్తాయి, కూలీ పని తగ్గుతుంది, అప్పులు పెరుగుతాయి, వలసలు పెరుగుతాయి, మహిళల పనిభారం పెరుగుతుంది. అందుకే నీటి సంరక్షణను కేవలం ఇంజినీరింగ్ సమస్యగా చూడటం పూర్తిగా తప్పు. అది జీవన విధానం, సామాజిక న్యాయం, స్థానిక స్వయం పరిపాలన, పర్యావరణ సమతుల్యతల సమ్మిళిత రంగం.

**నీటి సంక్షోభం యొక్క బహుముఖ స్వరూపం**

భారతదేశంలో నీటి సమస్య కేవలం లేమి సమస్య కాదు - అది నిర్వహణ వైఫల్యం, నాణ్యత సమస్య, పంపిణీ అసమానత, పర్యావరణ అస్థిరతల సమ్మేళనం.

**పరిమాణ సంక్షోభం**

నీతి ఆయోగ్ సమగ్ర జల నిర్వహణ సూచిక ప్రకారం దాదాపు 600 మిలియన్ల మంది అధిక నుంచి అత్యధిక నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వ్యక్తికి అందుబాటులో ఉన్న నీటి పరిమాణం చాలా రాష్ట్రాల్లో తీవ్రంగా క్షీణిస్తోంది. 2030 నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

**నాణ్యత సంక్షోభం**

భూగర్భజలాల్లో ఫ్లోరైడ్, ఆర్సెనిక్, నైట్రేట్, లవణాలు, భారీ లోహాలు పెరుగుతున్నాయి. నదీలు, చెరువుల్లో పారిశ్రామిక, పట్టణ మురుగునీరు కలుషితం చేస్తోంది. సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు నివేదికల ప్రకారం దేశంలోని దాదాపు 20% బ్లాక్లు కలుషిత భూగర్భజలాలతో బాధపడుతున్నాయి.

**ప్రాప్యత సంక్షోభం**

నీరు ఉన్నా అందరికీ సమానంగా చేరడం లేదు. పట్టణాల్లో ట్యాంకర్ మాఫియా, అపార్ట్మెంట్లకు ప్రత్యేక సరఫరా, గ్రామాల్లో బావుల ఎండిపోవడం, రైతులకు సాగునీరు లేకపోవడం - ఇవన్నీ సామాజిక, ఆర్థిక అసమానతను మరింత పదును పెడుతున్నాయి.

**వాతావరణ మార్పు ప్రభావం**

మాన్సూన్ ఎపిసోడిక్గా మారుతోంది. స్వల్పకాలంలో భారీ వర్షాలు (cloudburst), దీర్ఘ ఎండలు (meteorological drough), హిమనదాల కరుగుదల, సముద్ర మట్టం పెరుగుదల వల్ల తీర ప్రాంత భూగర్భజలాల్లో ఉప్పుతనం (saltwater intrusion) పెరుగుతోంది. యుఎన్-వాటర్, IPCC నివేదికలు ఈ దిశలో హెచ్చరిస్తున్నాయి.

**చిన్న జల వనరుల పునరుద్ధరణ - ఏకైక ఆశాకిరణం**

భారతదేశ జల భద్రతకు భారీ జలాశయాలు, బ్యారేజీలు, ఇంటర్-లింకింగ్ ప్రాజెక్టులు మాత్రమే సరిపోవు. అసలు శక్తి స్థానిక చిన్న జల వనరుల్లో ఉంది. జలముఖాల లెక్కింపు చూపినట్లు 97% గ్రామీణ జలముఖాలే. అందుకే:

- చెరువులు, కుంటలు, గుంటలు, చెక్డ్యాంలు మ్యాప్ చేసి చట్టబద్ధ రక్షణ కల్పించాలి.
- ఆక్రమణలు తొలగించి పూడిక తీయాలి. (1.6% జలముఖాలు ఆక్రమణకు గురైనట్లు లెక్కింపు తేల్చింది - శాతం చిన్నదిగా కనిపించినా సంఖ్యాపరంగా ఆందోళనకరం.)
- వాననీటి మార్గాలను నిరోధించకుండా ఉంచాలి.
- గ్రామ పంచాయతీలు, రైతు సంఘాలు, మహిళా సంఘాలు జల కమిటీలుగా పనిచేయాలి.
- అటల్ భూజల్ యోజన, అమృత సరోవర్, జల్ శక్తి అభియాన్ వంటి పథకాలను స్థానిక స్థాయిలో బలోపేతం చేయాలి.

**పట్టణ జల సంక్షోభం - మరో ముఖం**

పట్టణ భారతదేశంలో సరస్సులు నింపి నిర్మాణాలు, డ్రెయినేజీ మార్గాల మూసివేత, వర్షపు నీటి వృథా, మురుగునీటి కలుషితం - ఇవన్నీ కలిసి వరదలు, నీటి కొరతలు ఒకే సమయంలో జరిగే విరుద్ధ దృశ్యాన్ని సృష్టిస్తున్నాయి. పట్టణ భవనాలకు వర్షపు నీటి సంగ్రహణ (RWH) తప్పనిసరి చేయాలి. మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించే వ్యవస్థలు (Recycle & Reuse) పెద్ద నివాస సముదాయాల్లో, పరిశ్రమల్లో అమలు చేయాలి. కాంక్రీట్ ఉపరితలాలను తగ్గించి పచ్చదనాన్ని పెంచాలి.

**వ్యవసాయ రంగంలో మార్పు అనివార్యం**

నీటి వినియోగంలో 80-85% వ్యవసాయానికే వెళ్తోంది. కానీ సాగు పద్ధతులు, పంటల ఎంపిక, ఉచిత/తక్కువ ధర విద్యుత్ ఆధారిత అధిక భూగర్భజల వినియోగం సమస్యను పెంచుతున్నా యి. మైక్రో ఇరిగేషన్ (డ్రిప్, స్ప్రింక్లర్), పంట వైవిధ్యీకరణ, నేల తేమ సంరక్షణ, స్థానిక విత్తనాలు, సాగు క్యాలెండర్ సర్దుబాటు అవసరం. నీటి ఆకలి పంటల స్థానంలో ప్రాంతానికి అనుకూల, తక్కువ నీటి అవసరం గల పంటలు ప్రోత్సహించాలి.

**ముందున్న మార్గం - ఏమి చేయాలి?**

- చెరువులు, కుంటలు, గుంటలు మ్యాప్ చేసి చట్టబద్ధ రక్షణ కల్పించాలి.
- ఆక్రమణలు తొలగించి పూడిక తీయాలి.
- పట్టణాల్లో వర్షపు నీటి సంగ్రహణ తప్పనిసరి చేయాలి.
- మురుగునీటి శుద్ధీకరణ, తిరిగి వినియోగం విధానాలు అమలు చేయాలి.
- భూగర్భజల వినియోగంపై రియల్ టైమ్ మానిటరింగ్, నియంత్రణ తీసుకోవాలి.
- వ్యవసాయంలో మైక్రో ఇరిగేషన్, పంట వైవిధ్యీకరణ ప్రోత్సహించాలి.
- గ్రామ పంచాయతీలు, రైతు సంఘాలు, మహిళా సంఘాలు జల కమిటీలుగా పనిచేయాలి.
- పాఠశాల స్థాయి నుంచి నీటి సాక్షరతను విద్యలో భాగం చేయాలి.

**చివరి మాట**

భారతదేశం నీటి సమస్యను పూర్తిగా తప్పించుకోలేకపోవచ్చు. కానీ దాన్ని విపత్తు స్థాయికి చేరకుండా అడ్డుకోవచ్చు. దానికి అవసరమైన వి మూడు: శాస్త్రీయ డేటా, స్థానిక జల సంస్కృతి పునరుద్ధరణ, రాజకీయ సంకల్పం.

- ఒక చెరువును కాపాడటం అంటే ఒక గ్రామాన్ని కాపాడటమే.
- ఒక వాననీటి మార్గాన్ని నిరోధించకుండా ఉంచడం అంటే వరద నష్టాన్ని తగ్గించడమే.
- నీటిని వస్తువుగా కాకుండా హక్కుగా, బాధ్యతగా, సంస్కృతిగా, సామూహిక సంపదగా చూసిన దేశమే 2030ను, 2050ను స్థిరంగా ఎదుర్కోగలదు.

**ప్రపంచ జల దినోత్సవం మనకిచ్చే అసలైన సందేశం ఇదే:**

నీటిని కాపాడటం అనేది ప్రకృతిని కాపాడటమే కాదు - మనుగడను కాపాడటం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# పెండింగ్ ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- పదవ తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ
- మౌలిక వసతులు ఏర్పాటు చేయండి
- కాపింగ్‌కు పాల్పడితే కట్టిన చర్యలు
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్ జిల్లా బ్యూరో మార్చ్ 23 (జనం సాక్షి) :** పెండింగ్ లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కొరకు వచ్చిన వారి ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 135 పిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పూర్తి స్థాయి లో పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ శాఖ ల వారిగా డి పి ఓ ,పంచాయతీ రాజ్, గృహ నిర్మాణము డీఆర్‌డీఏ, ప్రణాళిక శాఖ, భూ సేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వివరణ ఇవ్వాలని కోరారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా స్థాయిలో రోజువారీ షెడ్యూల్ ప్రకారం ప్రజలు,.ప్రజా ప్రతినిధులునిర్వహించిన కార్యక్రమాలను తప్పని సరిగా ఫోటోలు పంపించాలని సూచించారు. ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు , వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని, ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ రెవెన్యూ రాజేశ్వరి ,జడ్.పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ మంగీ లాల్ ,డి ఆర్ డి ఓ శ్రీనివాస్ ,ఆర్ డి ఓ వాసు చంద్ర,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పదవ తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ

పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ దీపక్ తివారి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారము జిల్లా కేంద్రంలోని పదవ తరగతి పరీక్షల సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా పర్యటించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం చీఫ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో విద్యార్థుల హాజరు, డ్యూటీ రిజిస్టర్, ప్రశ్నపత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## రైల్వే కార్యకలాపాల భద్రతా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి




**సికింద్రాబాద్, మార్చి 23 (జనంసాక్షి) :** రైల్వే కార్యకలాపాల భద్రతా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ మధ్య జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాస్తవ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో అధికారులతో కలసి రైళ్ల కార్యకలాపాల భద్రతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి క్రమబద్ధమైన, దశలవారీ విధానాన్ని అనుసరించాలని సూచించారు. ట్రాక్‌ల భద్రతను మరింత బలోపేతం చేయడం, ముఖ్యంగా పాయింట్లు అండ్ క్రాసింగ్‌లు, భద్రతా అలారమ్‌ల వద్ద చేపట్టాల్సిన తనిఖీలు, భద్రతా డ్రైవ్‌ల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ట్రాక్‌ల సమీపంలో పనులు జరుగుతున్నప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పని స్వభావానికి అనుగుణంగా హెచ్చరిక ఉత్తర్వులు జారీ చేయాలని వివరించారు. రైల్వే ప్రాంగణంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా పరికరాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ రఘునందన్ రావు ను కలిసిన బీజేపీ నాయకులు



**సంగారెడ్డి, మార్చి 23 (జనం సాక్షి) :** మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ను భారతీయ జనతా పార్టీ నాయకులు కలిశారు. సోమవారం ఎంపీ రఘునందన్ రావు జన్మదినం పురస్కరించుకొని ఆయన నివాసంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్, ఎడ్ల రమేష్ ,జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆగరెడ్డి లక్ష్మణ్ గుప్త ,రఘు లు కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## భగత్ సింగ్ త్యాగం భావి పోరాటాలకు స్ఫూర్తి




**వనపర్తి బ్యూరో, మార్చి 23 (జనంసాక్షి) :** దేశ స్వాతంత్రం కోసం ఉరికొయ్యని ముద్దాడిన భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవుల త్యాగం భావి పోరాటాలకు స్ఫూర్తిగా తీసుకోవాలని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ అన్నారు. సోమవారం సాయంత్రం సిపిఐ ఆఫీసులో అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాట్లాడుతూ.. పార్లమెంటులో పొగ బాంబులు విసిరి భారతీయుల స్వాతంత్ర ఆకాంక్షను భగత్ సింగ్ ఎలుగెత్తి చాటారన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినదించి తెల్లవారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించారన్నారు. ఆయన మరణం స్వాతంత్ర ఆకాంక్షను దేశం నలువైపులా పాకిందన్నారు. దేశం కోసం ప్రాణాలకు లెక్క చేయని ఆయన దేశభక్తి త్యాగం నేటి యువతరానికి ఆదర్శం కావాలన్నారు. స్వాతంత్ర్యం అంటే అధికార మార్పిడి కాదని అందరికీ విద్యా వైద్యం ఉద్యోగము స్వేచ్ఛ సమ సమాజం అని నివదించాలని పాలకుల వైఫల్యం వల్ల అవి నేటికి నెరవేరలేదన్నారు. పాలకులు దేశ సంపదను పేదల కష్టాన్ని సంపన్నులకు దోచిపెడుతున్నారని అవినీతి అక్రమాలు పిచ్చ పెరిగాయని ఫలితంగా యువత నిరాశతో పెడదారి పడుతున్నారన్నారు. యువశక్తిని ఉపయోగించుకునేందుకు అవినీతి అవిద్యకు వ్యతిరేకంగా యువత పోరాడాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశీ, భువన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమన్న, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ కో కన్వీనర్, డి హెచ్ పి ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్ శిరీష జ్యోతి సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలు

- మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, మార్చి 23 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత అవినీతిమయమైందని, అభివృద్ధిని విస్మరించి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతోందని మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ కళా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ అప్పులపై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రూ. 2.80 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేసిందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో స్పష్టం చేసిన, రేవంత్ రెడ్డి మాత్రం రూ. 3.50 లక్షల కోట్లు అని తప్పుడు లెక్కలు చెబుతున్నారని విమర్శించారు. అధికారం చేపట్టిన ఈ రెండున్నర ఏళ్లలో చేసిన రూ. 3.50 లక్షల కోట్ల అప్పుతో ఏయే అభివృద్ధి పనులు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే తెలంగాణ మరో శ్రీలంకలా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు కేవలం ఓట్ల కోసమేనని, క్షేత్రస్థాయిలో వాటి అమలు శూన్యమని ఆయన ఎద్దేవా చేశారు. రైతు భరోసా నిధులను మూడు సార్లు ఎగ్గొట్టారని, ధాన్యం బోనస్ ఎప్పుడు ఇస్తారో క్లారిటీ లేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్లు, నిర్వహించిన పరీక్షల నియామక పత్రాలను తామే ఇచ్చినట్లుగా ఇప్పుడు హంగామా చేస్తున్నారని ఆరోపించారు. బడ్జెట్‌లో కేవలం పేపర్ మీద అంకెలను అటు ఇటు మార్చారే తప్ప, ప్రజలకు చేకూరిన ప్రయోజనం గుండు సున్నా అని, మంత్రుల మధ్య వాటాల పంచాయతీలే తప్ప, ప్రజల సంక్షేమంపై పట్టింపు లేదని విమర్శించిన ఆయన, కాంగ్రెస్ అంటేనే స్కామ్‌లు అని మరోసారి నిరూపించారని అన్నారు. ఫ్రీ బస్సు తప్ప కాంగ్రెస్ పాలనలో అంతా తుస్సు అని ఆయన వ్యాఖ్యానించారు. మూసీ సుందరీకరణ పేరుతో లక్షల కోట్లు కుంభకోణాలకు తెరలేపుతున్నారని, ప్రజలు ఈ దొంగ హామీలపై చర్చ జరపాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ప్రభుత్వానికి ఇచ్చిన సమయంలో సగం ముగిసిందని, ఇప్పటికైనా అబద్ధపు మాటలు కట్టిపెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్‌లో గంజాయి పట్టివేత

- ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అరెస్టు




**సికింద్రాబాద్, మార్చి 23 (జనంసాక్షి) :** ఒడిశా నుంచి ఢిల్లీకి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్ లను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 10.089 కిలోల డ్రై గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ జీఆర్‌పీ, ఈగల్ టీమ్, ఆర్పీఎఫ్ సంయుక్తంగా నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. గంజాయి విలువ సుమారు రూ,5,04,450 ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.... ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లా కు చెందిన దీపక్ సాహు (26), దీపక్ గౌడ (20) అనే ఇద్దరు స్నేహితులు ఈజీగా పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి రవాణాకు పాల్పడ్డారు. ఢిల్లీలో గంజాయికి అధిక డిమాండ్ ఉండటంతో అక్కడ విక్రయించి లాభాలు పొందాలనే ఉద్దేశంతో ఈ నెలలోనే ఒకసారి గంజాయి తరలించి విక్రయించారు. మరోసారి గంజాయి రవాణా కోసం మార్చి 22న గజపతి అటవీ ప్రాంతం నుంచి సుమారు 10 కిలోల గంజాయిని రూ,35,000కు కొనుగోలు చేసి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ చేరుకున్నారు. అక్కడ నుంచి ఢిల్లీ వెళ్లే మరో రైలులో ప్రయాణించేందుకు ప్లాన్ చేశారు. సోమవారం సికింద్రాబాద్‌కు చేరుకున్న అనంతరం, రాత్రి రైలు వరకు వేచి ఉండేందుకు జనరల్ వెయిటింగ్ హాల్‌లో ఉండగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో వారి వద్ద ఉన్న బ్యాగుల్లో గంజాయి ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి గంజాయి ప్యాకెట్లతో పాటు రెండు మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌ను సికింద్రాబాద్ రైల్వే పోలీస్ అధికారులు, ఈగల్ టీమ్, ఆర్పీఎఫ్ సిబ్బంది సమన్వయంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీపీ రైల్వే అండ్ రోడ్ సేఫ్టీ కె. రమేష్ నాయుడు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న అధికారులను అభినందించారు. నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## డయాలసిస్ సేవలను త్వరలోనే పున:ప్రారంభం

- ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, మార్చి 23 (జనంసాక్షి) :** డయాలసిస్ సేవలను త్వరలోనే పున:ప్రారంభం అవుతుందని ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. గత వారం రోజులుగా చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు నిలిచిపోయి రోగులు పడుతున్న ఇబ్బందులపై స్పందించిన డిసిఎస్ హెచ్ఓ అనురాగిణి సోమవారం స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి డయాలసిస్ సెంటర్, పాలియేటివ్ కేర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలియేటివ్ కేర్ లో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు నివేదికలు పంపడం జరిగిందన్నారు, వారం రోజుల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, చేవెళ్ల మాజీ సర్పంచ్, కౌన్సిలర్ బండారి శైలజాఆగిరెడ్డి, మద్దెల శ్రీనివాస్, తాళ్లపల్లి నర్సింలు, కృష్ణానాయక్, ముడిమ్యాల సొసైటీ మాజీ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, నాయకులు బుర్ల మహేష్, రాంరెడ్డి, వైద్యులు ఉన్నారు.

## కలెక్టరేట్ భవన ఆవరణలో రోడ్ల నిర్మాణం చేపట్టాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 23 (జనం సాక్షి) :** నూతన కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.సోమవారం సింగారం మలుపు దారి వద్ద నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టరేట్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవనం ఆవరణ లో అంతర్గత రహదారుల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రధాన రహదారికి కలెక్టరేట్ భవన సముదాయం వరకు సమాంతరంగా రోడ్డు వేయాలన్నారు. అలాగే భవన సముదాయానికి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను అక్కడి నుంచి తొలగించి కొద్ది దూరంలో ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.భవనం చుట్టూ నాలుగు వైపులా మొక్కలు పెట్టీ గ్రీనరీ ఏర్పాటు చేయాలని డీఆర్డీవో మొగులప్ప కు చెప్పారు.కలెక్టరేట్ సముదాయంతో పాటు బయట రోడ్లు, ఇతర పనుల్లో వేగం పెంచాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీ.ఈ.ఈ రాములు, పంచాయతీ రాజ్ ఈ ఈ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- ప్రజలకు అండగా నిలిచేది కమ్యూనిస్టులే..
- సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**ముషీరాబాద్, మార్చి 23 (జనం సాక్షి) :** రాష్ట్రంలో జి.హెచ్.ఎం.సి కార్పొరేషన్ల తో పాటు మున్సిపాలిటీ లలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, వారికి కనీస వేతనం కింద ప్రతినెల రూ.26 వేలు చెల్లించాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు నాలుగు డిఎ లు చెల్లించి, పిఆర్సి వెంటనే ప్రకటించాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఇందిరా పార్క్ వద్దగల ధర్నా చౌక్ లో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో 'మున్సిపల్ కార్మికుల మహాధర్నా' నిర్వహించారు. ఈ ధర్నాకు కూనంనేని సాంబశివరావు మద్దతు తో మాట్లాడారు. ఈ ధర్నాకు తాను ఎమ్మెల్యే గా రాలేదనీ, మీలో ఒక్కడిగా వచ్చాననీ అన్నారు. సుమారు 40 ఏళ్ల క్రితమే కొత్తగూడెంలో మున్సిపల్ కార్మికుల సంఘాన్ని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. మున్సిపల్ పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమానంగా పని చేస్తారనీ, వారికి వేలల్లో జీతాలు చెల్లిస్తున్న ప్రభుత్వాలు, వీరికి మాత్రం ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఆరోగ్యాలను, ప్రాణాలను పణంగా పెట్టి వారి కంటే ఎక్కువగా కష్టపడుతున్న కార్మికులకు కనీస వేతనం లేకపోవడం దారుణమన్నారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్, సింగరేణి కార్మికులు, కూరగాయల విక్రేతలు, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు ఓటు వేయడం వలనే తాను ఎమ్మెల్యే గా గెలిచానని చెప్పారు. ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో కొత్తగూడెం మేయర్ పీఠాన్ని సిపిఐ కైవసం చేసుకుందని, ఆటో డ్రైవర్ మేయర్ చేశామని తెలిపారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసుఫ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సఫాయి పనులు ఆపేసి, సమ్మెకి వెళ్తామని హెచ్చరించారు. అలాగే 60 సంవత్సరాలు దాటిన కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు మరణించిన కార్మికునికి దహన సంస్కారాల ఖర్చుల కోసం రూ. 50 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్ రాజ్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలను రద్దు చేసి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే రవిచంద్రన్, ప్రధాన కార్యదర్శి కే ఏసురత్నం రాష్ట్ర కార్యదర్శులు, వనంపల్లి జైపాల్ రెడ్డి, కాంతారావు, హరినాథ్ రావు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, ఏఐటీయూసీ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఓమయ్య, విలాస్, పళ్ళ దేవేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, నారాయణరెడ్డి, ధర్మరాజు, సారంగపాణి, బోట్ల బిక్షపతి, శ్రీనివాస్, టి ఆనంద్, చందు, వినయ్, చంద్రమోహన్, సురేష్, శ్రీకాంత్, రాయపూడి శ్రీను, కిషోర్, లడ్డు లాల్, జంగయ్య, సంజీవ, సంతోష, లక్ష్మి, అండాలు, కమల, ఎల్లమ్మ, మహేశ్వరి తదితర లు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు మెరుగైన వైద్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**వెల్దండ, మార్చి 23 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా పేదలకు మెరుగైన వైద్య ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాదులోని తన నివాసంలో వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన వేముల లక్ష్మయ్య గౌడ్ కు మంజూరైన రూ. 60 వేలు, కోమరిక వైష్ణవికి మంజూరైన రూ. 27 వేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతోమంది నిరుపేదలకు ఆర్థిక భరోసానిస్తుదని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ, శ్రీను నాయక్, అనిల్ కుమార్, ప్రశాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
24 మార్చి 2026

# ప్రపంచ బందిపోటుగా మారిన అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరిద్దాం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



**సంగారెడ్డి టౌన్, మార్చి 23 (జనం సాక్షి) :** ప్రపంచ బందిపోటుగా మారిన అమెరికన్ సామ్రాజ వాదాన్ని ఎదిరిద్దామని, లౌకిక భారతదేశాన్ని కాపాడుకునేందుకు.. మతోన్మాద శక్తులను పెకిలిద్దామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సోమవారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డిలో సీఐటీయూ ఆధ్వర్యంలో సంకల్పయాత్ర సంగారెడ్డి పాత బస్టాండ్ నుండి కలెక్టరేట్ దొడ్డి కొమురయ్య విగ్రహం వరకు నిర్వహించడం జరిగింది. భగత్ సింగ్ చిత్రపటాలతో టీ షర్టులను తొడిగి కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై చుక్క రాములు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ కోరుకున్న సమసమాజం కోసం కార్మికులు, యువత పోరాడాలన్నారు. భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట వారసత్వాన్ని కొనసాగగించేందుకు మనమంతా ముందు నిలవాలన్నారు. భగత్ సింగ్ చిన్న వయసులోనే దేశం పట్ల ప్రజల పట్ల మక్కువ పెంచుకున్నాడని తెలిపాడు. స్వాతంత్ర్యం అంటే బ్రిటిష్ పాలకుల నుండి విముక్తి పొందడమే కాదు, సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించాలి. ప్రజలందరూ సామరస్యంతో మానసిక బానిసత్వం నుండి బయటపడిన రోజునే మనం సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించినట్లని భావించాడు భగత్‌సింగ్ అని గుర్తుచేశారు. మతోన్మాదం పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ దేశం లౌకిక దేశంగా ఉండాలని ఆయన పదేపదే ప్రస్తావించాడన్నారు. దోపిడీ పీడన లేని, అసమానతలు లేని సమాజాన్ని సోషలిజం మాత్రమే అందిస్తుందన్నారు. సంపద సృష్టి కర్తలైన కార్మిక, కర్షక వర్గాల ఐక్యత సాధించి దోపిడీ లేని సమసమాజ సమాజాన్ని నిర్మించుకవడం కోసం భగత్ సింగ్ మార్గంలో ప్రయాణిద్దామని కార్మికులు సాధించుకున్న చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్పొరేట్ శక్తులకు మేలు చేసే విధనాలు రూపొందిస్తున్న పాలకులపై పోరాడుదామని పిలుపుచ్చారు. సామ్రాజ్యవాదాన్ని ప్రతీఘటించి పోరాడిన భగత్ సింగ్ చైతన్య స్ఫూర్తి ఈ దేశానికి అవసరమన్నారు. అమెరికా సామ్రాజ్యవాదం, ఆధిపత్యాన్ని ఎదిరిస్తున్న, దేశాలపై యుద్ధాలు ప్రకటిస్తూ, విధ్వంసాలు సృష్టిస్తుంది. దేశాలను ఆక్రమించడమే కాదు, దేశాధ్యక్షులను సైతం ఎత్తుకెళ్లి బంధించడం,లేదా చంపడమే చేస్తుందన్నారు. అంతర్జాతీయ న్యాయ చట్టాలను ఉల్లంఘిస్తుందన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమే కాదు, ఈ దేశంలో సోషలిస్టు సమాజాన్ని నెలకొల్పుడమే తమ అంతిమ లక్ష్యమని భగత్ సింగ్ ఆశాభావం వ్యక్తం చేశాడనీ గుర్తు చేశారు. దేశ పౌరులుగా నేడు దేశాన్ని పట్టిపీడిస్తున్న మతతత్వ, మతోన్మాద, కార్పోరేట్ రాజకీయాలకు వ్యతిరేకంగా, ప్రపంచాధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న సామ్రాజవాదానికి వ్యతిరేకంగా కలసికట్టుగా ఐక్యంగా పోరాడటమే భగత్ సింగ్ కు అర్పించే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లేశం, సాయిలు, రైతు సంఘం నేత జయరాజు, సీఐటీయూ నాయకులు మాణిక్, యాదగిరి, ప్రసన్న, వ్యకాస నాయకులు నర్సింలు, వివిధ పరిశ్రమల కార్మికులు పాల్గొన్నారు.

## 25 నుండి సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

**తూప్రాన్ మార్చి 23 (జనం సాక్షి) :** సీతారామచంద్రస్వామి ఉత్సవాలు ఈనెల 25 నుండి వచ్చేనెల ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉత్సవాల నిర్వహించనున్నట్లు పూర్వ ప్రముఖుల సమక్షంలో తీర్మానించినట్లు పురోహితులు ఆత్రేయ శర్మ తెలిపారు. సీతారాముల జాతర మహోత్సవం సందర్భంగా శ్రీ సీతా రాముల వారి దేవాలయం ఆవరణలో గౌరవ మున్సిపల్ చైర్ పర్సన్ బొంది రజిని రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్ణయించినట్లు చెప్పారు స్వామి వారి కల్యాణ లగ్న పత్రిక పురోహితులు శ్రీ ఆత్రేయ శర్మ గ్రామస్తులు పనిబాటల వారి సమక్షంలో చదివి వినిపించినారు. ఈ ఉత్సవాలు 25నుండి వచ్చేనెల 04 తేదీ వరకు ఈనెల 27 శుక్రవారం రోజున శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని గౌరవ మున్సిపల్ చైర్మన్ శ్రీమతి బొంది రజిని రవీందర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ సమత కాశి రెడ్డి, కౌన్సిలర్లు భైరం సత్య లింగం, చెలిమెల రాములు, జైపాల్ రాథోడ్, ఐలేష్ యాదవ్, చంద అశోక్ పురోహితులు ఆత్రేయ శర్మ, మనోహర్ పంతులు, గ్రామ పెద్దలు, పనిబాటల వారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కుంట కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



**బిజినేపల్లి, మార్చి 23 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ఇండ్లకు ఆనుకొని ఉన్న జుటయ్య కుంటకట్టను ధ్వంసం చేసిన నాయకులే అధికారులకు పిర్యాదు చేయడం దొంగనే దొంగా అనట్టుగా ఉందనివారి పైనఅధికారు చర్యలు తీసుకోవాలని మత్స్య సహకార సంఘం మండల అధ్యక్షులు తుమ్మల అల్లోజి, మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం పార్టీకి చెందిన నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా కుంటలను కబ్జా చేసి అమ్ముకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. సర్పంచి ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఎద్దుల రాములుని గెలిపించకపోతే జూటయ్య కుంట కబ్జా అవుతుందని ఆనాడే హెచ్చరించారని, నేడు అధికారంలో ఉన్న ఆ వర్గం నాయకులే కబ్జాకు తెర తీశారన్నారు. తాము రాజకీయ లబ్ధికోసం ఆరోపణలు చేయడం లేదని, ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు కూడా లేవని తెలిపారు. రాజకీయ అండదండలతో అధికారులు చర్యలు తీసుకోకుండా ఆలస్యం చేసేలా చూశారని, తాము ఉన్నతాధికారులకు పిర్యదు చేయడంతోనే బిఆర్ఎస్ నాయకులమైన మా పై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారుప్రభుత్వ భూములను కాపాడవలసిన ప్రజాప్రతినిధులేకబ్జాలకు పాల్పడడం విడ్డూరంగా ఉందన్నారు,కుంట కట్టను ధ్వంసం చేసిన వ్యక్తులపైన అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు శ్రీను,శ్రీశైలం,రిజ్వాన్,శివ,సుదర్శన్ తదితరులు ఉన్నారు.

## డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు ఆరోగ్య సేవల్లో కీలకం

- జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య



**సంగారెడ్డి, మార్చి 23 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాను డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు పైలెట్ జిల్లాగా ఎంపిక చేసిన నేపథ్యంలో ఆరోగ్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. సోమవారం నుండి సంగారెడ్డి డివిజన్ పరిధిలోని 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సి), రెండు ఏరియా ఆసుపత్రులు, మూడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సి), ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జిజిహెచ్), ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగుల డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌ను సంబంధిత సాఫ్ట్‌వేర్‌లో ప్రయోగాత్మకంగా నమోదు చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఇందిరానగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ నమోదు ప్రక్రియ, డేటా ఎంట్రీ, రోగుల వివరాల సేకరణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. రోగుల ఆరోగ్య చరిత్రను డిజిటల్ రూపంలో భద్రపరచడం ద్వారా వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించ వచ్చని ఆమె తెలిపారు. నెట్‌వర్క్, టెక్నికల్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వసంత్ రావు,డాక్టర్ శశాంక్, మెడికల్ ఆఫీసర్లు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదు

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, మార్చి 23 (జనం సాక్షి) :** వనపర్తి జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలకు సరిపడా నిల్వలు ఉన్నాయని, ప్రజల డిమాండ్ మేరకు సకాలంలో సిలిండర్లు సరఫరా చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ మరియు రాజానగరం శివారులో ఉన్న వారి గోదామును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీలో ఉన్న రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. మొత్తం కనెక్షన్లు, ప్రస్తుత సిలిండర్ల నిల్వ, రోజువారీ డిమాండ్, సరఫరా వివరాలను సమగ్రంగా పరిశీలించారు. ఏజెన్సీ మేనేజర్లను ప్రస్తుత స్టాక్ మరియు రోజువారీ డిమాండ్ గురించి కలెక్టర్ ఆరా తీశారు. స్పందించిన మేనేజర్లు ప్రస్తుతం గోదాంలో మొత్తం 1150 సిలిండర్ల నిల్వకు గానూ, నేటి డిమాండ్ మేరకు 206 సిలిండర్లు సరఫరాకు పంపించామని, మిగిలిన 944 సిలిండర్లు గోదాంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత ఏమీ లేదని స్పష్టం చేశారు. ప్రజలకు సరిపడా నిల్వలు ఉన్నాయని, అందువల్ల ప్రజలు తొందరపడి సిలిండర్లు బుక్ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. సిలిండర్ల సరఫరా విషయంలో ఎటువంటి ఆందోళన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రజలకు సమయానికి గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ వసతి గృహాలు, ప్రభుత్వ ఆసుపత్రులకు సకాలంలో సిలిండర్లు అందజేయాలని సూచించారు. ఇక జిల్లాలో డొమెస్టిక్ సిలిండర్లను ఎట్టి పరిస్థితుల్లో కమర్షియల్ గా వినియోగించడానికి వీలులేదని కలెక్టర్ హెచ్చరించారు. అలా ఎవరైనా నిబంధనలను అతిక్రమించిన ఎడల వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు డొమెస్టిక్ కనెక్షన్లు కమర్షియల్ గా వినియోగిస్తున్న వారి పట్ల చర్యలపై కలెక్టర్ ఆరా తీయగా, జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్ స్పందిస్తూ మొత్తం 25 మందిపై కేసులు నమోదు చేసి 50 డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, డీటీలు పరమేష్, చక్రపాణి, ఏజెన్సీ నిర్వాహకులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తాం

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్**
**సీపీఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు**




**చేర్యాల, మార్చి 23 (జనంసాక్షి) :** భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. భగత్ సింగ్ 95వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం చేర్యాల పట్టణంలోని అంగడి బజారు షాదీఖాన ఫంక్షన్ హాల్ లో భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడిన భగత్ సింగ్ మండే అగ్ని గోళం జ్వలించే నిప్పుకణికలా రెపరెపలాడే విప్లవ పతాక భగత్ సింగ్ పేరు వింటేనే ప్రతీ భారతీయుడి రోమాలు నిక్కబొడుచేలా 23 ఏళ్ల వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ఉరికొయ్యను ముద్దాడిన గొప్ప వీరుడన్నారు. తన స్నేహితులు విప్లవ యోధులైన సుఖ్ దేవ్,రాజ్ గురు లతో పాటు అసువులు బాశాడని, నిరంకుశ బ్రిటిష్ ప్రభుత్వం వారి ముగ్గురిని వరుసగా నిల్చోబెట్టి ఉరి తీసిందన్నారు. దేశం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్ స్ఫూర్తితో నేటి యువత ఆదర్శంగా తీసుకుని పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, సిపిఐ మండల కోశాధికారి నంగి కనకయ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గూడెపు సుదర్శన్, కొమురవేల్లి మండల సహాయ కార్యదర్శి బూరుగు సత్తయ్య గౌడ్, మహిళా సమాఖ్య డివిజన్ నాయకురాలు సుంకోజు రజిత, గూడెపు సంతోష, మల్లం అంజయ్య, ఆత్మకూరి హరికృష్ణ, బింగి పోషయ్య, శేఖర్, నవీన్,సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలు అమలయ్యే వరకు ఎమ్మెల్యేలను ప్రజల్లో తిరగనివ్వం

- బిజెపి రాష్ట్ర నాయకులు మెంటేపల్లి పురుషోత్తం రెడ్డి

**వనపర్తి బ్యూరో, మార్చి 23 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను, అమలు చేసే వరకు ఎమ్మెల్యేలను, మంత్రులను, ప్రజల్లో తిరగనీయబోమని, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు, బిజెపి రాష్ట్ర నాయకులు వెంటేపల్లి పురుషోత్తం రెడ్డి అన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచంద్ర రావు, పిలుపు మేరకు 6 గ్యారంటీలు 420 హామీలు అమలు చేయాలని, డిమాండ్ చేస్తూ పక్కా వ్యూహంతో అసెంబ్లీ సమీపానికి చేరుకున్న, వనపర్తి జిల్లా బీజేపీ నాయకులను, పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి, ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్లో నిర్బందించారు. సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటే పల్లి పురుషోత్తం రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి ఆరు గ్యారెంటీలు,420 మోస పూరిత, హామీలతో గద్దెనెక్కి 27 నెలలైనా, ఒక్క హామీ కూడా అమలు చేయకుండా, మహిళలు నిరుద్యోగులు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యోగస్తులు, రిటైర్డ్ ఉద్యోగస్తులు, అందరిని మోసం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇచ్చిన మాట ప్రకారం, వెంటనే గ్యారెంటీలు, హామీలు, అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్ర నాలుగు కోట్ల ప్రజల తరఫున, బిజెపి పార్టీ పెద్ద ఎత్తున అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని, బిజెపి పిలుపుకు చెమటలు పట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గత బిఆర్ఎస్ ప్రభుత్వం లాగానే,పోలీసులను ఉపయోగించి బలవంతంగా బిజెపి నాయకులను, కార్యకర్తలను అరెస్టుల పేరిట నిర్బంధించారని విమర్శించారు. ప్రజా ఉద్యమాలను ప్రతిపక్షాలను అణిచివేయాలని, చూస్తే రెట్టింపు ఉత్సాహంతో ఆందోళనలు నిర్వహిస్తామని, హామీలను అమలు చేసే వరకు రేవంత్ రెడ్డిని, ఎమ్మెల్యేలను, మంత్రులను, ప్రజల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. అసెంబ్లీ ముట్టడిలో పాల్గొన్న వారిలో సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటే పల్లి




పురుషోత్తం రెడ్డి జోగులాంబ గద్వాల జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్ రామచంద్ర రెడ్డి వనపర్తి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు జోగులాంబ గద్వాల జిల్లా ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి యువమోర్చా జిల్లా అధ్యక్షులు నలబోతుల అరవింద్ ఐటీసీ జిల్లా కన్వీనర్ అంజి యాదవ్ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు ఆగపోగు చాణుక్య పట్టణ నాయకులు చంద్రశేఖర్ వరుణ్ కుమార్ మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సెమినార్‌ను విజయవంతం చేయాలి

**బిజినేపల్లి, మార్చి 23 (జనం సాక్షి) :** రసాయన వ్యర్థాల నిర్వహణలో పర్యావరణహిత పరిష్కారాలపై అవగాహన పెంపొందించేందుకు ఈనెల 25 న బిజినపల్లి మండలం పాలెం శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించనున్న బయోరిమిడియేషన్ జాతీయ సెమినార్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ సెమినార్‌కు సంబంధించిన బ్రోచర్‌ను హైదరాబాద్ నాంపల్లిలోని కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్య చైర్మన్ జిట్టా బాలకిష్టా రెడ్డి, జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్, యాదగిరి కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చైర్మన్ జిట్టా బాలకిష్టా రెడ్డి, ప్రస్తుత కాలంలో రసాయన కాలుష్యం ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన సమస్యగా మారిందని పేర్కొన్నారు. పరిశ్రమలు, వ్యవసాయం, పట్టణీకరణ వల్ల ఉత్పన్నమవుతున్న రసాయన వ్యర్థాలు నేల, నీరు, జీవవ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో బయోరిమిడియేషన్ పద్ధతులు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. మొక్కలు,



సూక్ష్మజీవులు మరియు కొన్ని జంతు వ్యవస్థల సహాయంతో రసాయన కాలుష్యాన్ని సహజంగా నిర్మూలించడం బయోరిమిడియేషన్ ప్రధాన లక్ష్యమని, ఇది తక్కువ ఖర్చుతో కూడుకున్న సుస్థిర పరిష్కారమని పేర్కొన్నారు. జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్ మాట్లాడుతూ, భవిష్యత్ పర్యావరణ సమస్యలను ఎదుర్కోవడానికి శాస్త్రీయ దృక్పథం అత్యవసరమని అన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు బయోరిమిడియేషన్ రంగంలో మరింత పరిశోధనలు చేపట్టాలని సూచించారు. ఆధునిక సాంకేతికతలను వినియోగించి రసాయన వ్యర్థాల నిర్వహణకు వినూత్న పరిష్కారాలు కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రాములు మాట్లాడుతూ, జాతీయ సెమినార్‌ను విజయవంతం చేయడానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు, పరిశోధనాపరమైన ఆలోచనలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ఈ కార్యక్రమం ద్వారా సుస్థిర అభివృద్ధి దిశగా ముందడుగు పడుతుందని పేర్కొన్నారు. ఈ సెమినార్ ప్రధాన ఉద్దేశ్యం రసాయన వ్యర్థాల నిర్వహణలో ఆధునిక, పర్యావరణహిత పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించడం అని. విద్యార్థులు, పరిశోధకుల్లో సుస్థిర అభివృద్ధి పట్ల చైతన్యం పెంపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ డాక్టర్ వర్కాల శ్రీనివాసులు, సెమినార్ కన్వీనర్లు డాక్టర్ సి. నాగరాజు, శివ దొడ్ల తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలే కాంగ్రెస్ పాలన

- ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం
- ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆగ్రహం



**రామచంద్రపురం, మార్చి 23 (జనం సాక్షి) :** రాష్ట్రంలో కల్లబొల్లి వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రశ్నించే స్వరాలను అణచివేయడానికి ప్రయత్నిస్తోందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆరోపించారు. బీజేపీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలోని ఆయన స్వగృహంలో పోలీసులు సోమవారం గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరి, పోలీసుల తీరును తీవ్రంగా ఖండించారు. గుండాయిజం పాలనతో ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. పోలీసులు గృహనిర్బంధం చేయడం ప్రభుత్వం భయాన్ని బహిర్గతం చేస్తోందని, పిరికిపంద చర్యలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోదావరి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారూ.. మాకు హక్కు పత్రాలు ఇవ్వండి

- ఇదే నా మరణ వాంగ్మూలం
- అశోక్ నగర్ వాసి మహమ్మద్ సమ్మద్



**వరంగల్ బ్యూరో, మార్చి23(జనం సాక్షి) :** వరంగల్ జిల్లా కలెక్టర్ గారు మాకు హక్కు పత్రాలు ఇచ్చి మా కుటుంబాలని ఆదుకోండి.. అంటూ వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్ నగర్ వాసి మహమ్మద్ సమ్మద్ అనే వృద్ధుడు సోమవారం వరంగల్ గ్రీవెన్స్ లో తన ఆవేదన వెల్లడించాడు. ఇదేనా మరణ వాంగ్మూలం అంటూ విన్నవించాడు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్ నగర్ గ్రామంలో గత 75 ఏళగా ఉంటున్న సుమారు 40 కుటుంబాలకు నేటి వరకు హక్కు పత్రాలు ఇవ్వకపోవడంతో ఆయా కుటుంబాలు అయోమయంలో ఉన్నాయి. ఇదే విషయాన్ని మహమ్మద్ సమ్మద్ తమకు హక్కు పత్రాలు ఇవ్వాలంటూ గతంలో ఎమ్మార్వో, నర్సంపేట ఆర్డీవో తో పాటు జిల్లా కలెక్టర్కు దరఖాస్తులు చేసుకున్నారు. అయినా నేటికి సమస్య పరిష్కారం కాలేదు. 2025 వ సంవత్సరం ఆగస్టు 4వ తారీఖున కలెక్టర్ ను గ్రీవెన్స్ లో కలిసినప్పుడు హక్కు పత్రాల విషయమై సంబంధిత అధికారులకు ఆదేశించి హక్కు పత్రాలు ఇవ్వాలని చెప్పారని మహమ్మద్ సమ్మద్ గుర్తు చేశారు. నేటికీ తమకు హక్కు పాత్రలు ఇవ్వకపోవడం వల్ల తాము తమ కుటుంబాలు బతకలేని పరిస్థితిలో ఉన్నట్లు చెప్పారు. తన ఆరోగ్యం బాగాలేదని ఇదే తన మరణ వాంగ్మూలమని, తమ కుటుంబాలకు న్యాయం జరగని ఎడల తమకు ఆత్మహత్యలే శరణ్యం అంటూ వృద్ధుడు మహమ్మద్ సమ్మద్ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ హక్కు పత్రాల విషయమై సంబంధిత ప్రాంతాధికారుల కు సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని ఆదేశించినట్లు మహమ్మద్ సమ్మద్ తెలిపాడు. గ్రీవెన్స్ కార్యక్రమంలో అశోక్ నగర్ నుంచి వచ్చిన సుమారు 40 మంది ముస్లిం పెద్దలు, మహిళలు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం చేయొద్దు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం చేయొద్దని, వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుండి మొత్తం 55 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి, వాటిని ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో అందిన అన్ని దరఖాస్తులు వచ్చే సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రాధాన్యతతో స్పందించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి పర్యవేక్షణ లోపం ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అక్రమంగా చేసిన పట్టా రద్దు చేయాలని కలెక్టర్‌కు వినతి

- ముందస్తుగా ఎవరికి పట్టా చేయరాదని అధికారులకు సమాచారం తెలిపిన పట్టించుకోని వైనం
- ప్రజావాణిలో కలెక్టర్ కు ఇది ఫిర్యాదు చేసిన బాధితులు



**హనుమకొండ ప్రతినిధి, మార్చి 23 (జనం సాక్షి):** హనుమకొండ జిల్లా ఎలుకతుర్తి మండలం కేశవపూర్ గ్రామానికి చెందిన పద్మ, భారతమ్మలు వివాహాలు కావడంతో మంచిర్యాల జిల్లాలో ఉంటున్నారు. వారు ఇరువురు కేశవాపూర్ గ్రామానికి చెందిన పింగిలి కౌసల్య కుమార్తెలు,ఇద్దరు మాత్రమే వారసులు. తమ తల్లి కీర్తిశేషులు పింగిలి కౌసల్య పేరిట ఎల్కతుర్తి మండలం కేశవపూర్ శివారులోని సర్వే నంబర్ 511 బి/1/1 లో ఉన్న 1.38 ఎకరాల భూమి వీరికి వారసత్వంగా వస్తుంది. వీరి అనుమతి లేకుండా, వీరికి తెలియపరచకుండా ఈ భూమిని ఎవరికి పట్టా చేయరాదని కోరుతూ 14 జూలై 2025 రోజున ఎల్కతుర్తి తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత తహసిల్దార్ 2025 అక్టోబర్ నెలలో ఇదే భూమిని అసలు వారసులు అయిన పద్మ, భారతమ్మ లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కేశవపూర్ గ్రామానికి చెందిన సొల్లేటి శోభ అనే మహిళకు అక్రమంగా పట్టా చేసినారు. ఆ పట్టా రద్దు చేయాలని కోరడంతో ఆర్డీవో ఆఫీసులో అప్పీల్ చేసుకోవాలని తెలుపగా వారు ఆర్ డి ఓ కార్యాలయంలో అప్పీల్ చేశారు. అప్పీల్ చేసి 4 నెలలు అవుతున్న ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ తల్లి కౌసల్య పేరు మీద అదే గ్రామంలో మరో సర్వే నెంబర్ 487లో ఉన్న 4.27 ఎకరాల భూమిని ఎలాంటి విక్రయ దస్తావేజులు లేకుండా సంవత్సరం క్రితం అప్పటి తహసిల్దార్ 10 మందికి అక్రమంగా పట్టా చేశారు. ఆ భూమి కూడా తిరిగి ఇప్పించాలని ఆర్ డి ఓ కార్యాలయంలో 19-02-2026 నాడు అప్పీల్ చేయడం జరిగింది. 2 అప్పీల్ సైతం పరిష్కారం రాలేదు. ముందస్తుగా ఎవరి పేరిట పట్టా చేయకూడదని తెలుపుతూ ఫిర్యాదు పట్టించుకోకుండా పట్టా చేసిన అధికారులపై చర్య తీసుకోవాలని, అలాగే తమ తల్లి గారైన కౌసల్య పేరు మీద ఉన్న భూమిని తమ ఇద్దరి అక్కచెల్లెళ్ల పేరు మీదికి మార్చాలని పింగిలి పద్మ ప్రజావాణిలో కలెక్టర్‌ను కోరారు.

## రామప్పను సందర్శించిన యూకే ట్రావెల్ రైటర్



**ములుగు/వెంకటాపూర్,మార్చి23(జనం సాక్షి):** తెలంగాణ పర్యాటక ప్రాంతాల విశిష్టతను ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో యూకేకు చెందిన అంతర్జాతీయ ట్రావెల్ రైటర్ రాబర్ట్ పార్కర్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ ఆహ్వానించింది.తెలంగాణలోని పర్యాటక, సాంస్కృతిక విశేషాలు, స్థానిక వంటకాల ప్రాముఖ్యతపై అంతర్జాతీయ మ్యాగజిన్లలో వ్యాసాలు రాయడానికి ఆయన రాష్ట్రానికి విచ్చేశారు.ఈ సందర్భంగా సోమవారం ములుగు జిల్లాలోని ప్రపంచ వారసత్వ సంపద గుర్తింపు పొందిన రుద్రేశ్వర (రామప్ప) ఆలయాన్ని సందర్శించారు.పర్యటన సందర్భంగా అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్య కిరణ్, కాకతీయుల కళా సంపద,శిల్పకళా వైభవం, ప్రపంచ వారసత్వ గుర్తింపు రామప్ప దేవాలయానికి ఏ విధంగా వచ్చింది దేవాలయ ప్రాముఖ్యత ఫ్లోటింగ్ బ్రిక్స్ సౌండ్ బాక్స్ టెక్నాలజీ ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్ తదితర అంశాల గురించి పేరిణి శివతాండవం, పర్యాటక ప్రాముఖ్యతపై రాబర్ట్ పార్కర్‌కు వివరించారు.తెలంగాణను ఎందుకు సందర్శించాలనే అంశంపై పర్యాటక అవకాశాలు, సాంస్కృతిక సంపద, వివిధ రకాల స్థానిక వంటకాల ప్రత్యేకతలను ఆయనకు అవగాహన కల్పించారు. ఈ పర్యటనలో కల్యాణ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రతి నిధి,టూరిజం గైడ్ విజయ్, టూరిస్ట్ పోలీస్ అరుణ్, కేంద్ర పురావస్తు, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. రాబర్ట్ పార్కర్ తన అనుభవాలను అంతర్జాతీయ వేదికల్లో పంచుకోవడం ద్వారా తెలంగాణ పర్యాటక రంగానికి మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఉందని రాబర్ట్ పార్కర్ ఆర్టికల్స్ ద్వారా ఎక్కువ యూరప్, లండన్ దేశస్థులు తెలంగాణను సందర్శిస్తారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రురల్, మార్చి23 (జనంసాక్షి) :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ వసతి గృహాలు తనికి చేస్తూ ఉండాలని తెలిపారు. వేసవికాలం దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి , మార్చి 23, (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.బెల్లంపల్లి పట్టణానికి చెందిన తేజ్ ప్రకాష్ అగర్వాల్ తన పట్టా పాస్ పుస్తకంలో సవరణ కొరకు దరఖాస్తు చేసుకున్నానని, సవరణ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్ గ్రామానికి చెందిన నెల్కి వనజ తన తండ్రి పేరిట గల భూమిని తనకు తెలియకుండా పట్టా మార్పిడి చేయకూడదని కోరుతూ అర్జీ సమర్పించారు లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన రాపల్లి పరమేష్ తాను పంబాల (ఎస్. సి.) కులానికి చెందిన వాడను అని, తనకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కులగణన ప్రకారం గ్రూప్ 1 ఎస్. సి. పంబాలగా కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన మునిగంటి భాస్కరాచారి తాను ఆర్ అండ్ ఆర్ పాలసీ క్రింద ప్రభుత్వం కేటాయించిన భూమిని సదరు యజమాని వద్ద నుండి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో దస్తావేజు ద్వారా కొనుగోలు చేశానని, తన అవసరాల నిమిత్తం విక్రయిస్తుండగా సదరు భూమి నిషేధిత జాబితాలో ఉందని తెలుపుతూ పెండింగ్ నెంబర్ జారీ చేశారని, తాను ఇట్టి ప్లాటును విక్రయించేందుకు ఎన్ ఓ సి జారీ చేయగలరని కోరుతూ అర్జీ సమర్పించారు. . మందమర్రి మండల చుట్టుపక్కల గ్రామ రైతులు తాము సన్నరకం వడ్లను కొనుగోలు కేంద్రాలలో విక్రయించామని, బోనస్ డబ్బులను ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం సింగాపూర్ గ్రామానికి చెందిన మార్త నారాయణ తన భూమిని శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ మైన్ లో కోల్పోయానని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చెన్నూర్ పట్టణానికి చెందిన బాల లింగయ్య మంచిర్యాల సీనియర్ సివిల్ కోర్టులో కొనసాగుతున్న వ్యవసాయ భూములకు సంబంధించి రైతు బంధు, పంట రుణాలను నిలుపుదల చేసి మంజూరు చేసిన వాటిని రికవరీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్న సీఎం

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 23 (జనం సాక్షి) :** రైతులను అప్పుల భారీనుండి బయటకు తీసుకు వచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.స్టేషన్ ఘన పూర్ పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఓడిసిఎంఎస్ మార్కెట్ కమిటీ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంబొత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంవద్ద ఉన్న మక్క లను, వాటి తేమ శాతాన్ని పరిశీలించి మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మొట్ట మొదటి మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభించడం చాలా సంతో షంగా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మక్కల కు నిర్ణయించిన మద్దతు ధర 2400ఉండగా మధ్య దళారులు మక్కలను 1600 నుండి 1700 కే కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని తెలిపారు. మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరినవెంటనే మక్కల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.రైతుల ను అప్పుల ఊబినుండి బయటకు తీసుకువచ్చేం దుకు అనేక సబ్సిడీలు, సంక్షేమ పథకాలు అమ లు చేస్తున్నారని తెలిపారు. 21వేల కోట్లతో రుణ మాఫీ, 18వేల కోట్లతో రైతు భరోసా, 3వేల 500 కోట్లతో సన్నాలకు బోనస్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కు 14కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి సహకారంతోనే సాగు నీటి పనులు చేస్తున్నాని అన్నారు. రానున్న రోజులలో నియోజకవర్గంలో 100శాతం గ్రామాలకు సాగు నీరు అందించి ప్రతీ ఎకరానికి రెండు పంటలకు సాగు నీరు అందిస్తాన ని హామీ ఇచ్చారు. అదే నా ప్రాధాన్యత, ప్రణాళిక అని స్పష్టం చేశారు. జఫర్ గడ్ లో మార్కెట్ సబ్ యార్డు పని చేసేవిధంగా చర్యలు తీసుకుంటాన ని అన్నారు. అలాగే మండల కేంద్రాలలో కూడా మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగు నీరు, మక్కలు అరబెట్టుకునే ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నీల రాజమ్మ గట్టయ్య, మార్కెట్ డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, మార్క్ ఫెడ్, మార్కెట్, వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో దొంగల హల్‌చల్

- తాళం వేసి ఉన్న ఇంటికి కన్నం
- 10 తులాల బంగారం, రూ.1లక్ష నగదు అపహరణ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి పట్టణంలో దొంగలు మరోసారి చెలరేగి హాల్ చల్ సృష్టించారు. పట్టణంలోని కారల్ మార్బ్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో పక్కా ప్రణాళికతో దొంగతనానికి పాల్పడడం సంచలనాత్మకంగా మారింది. ఈ సంఘటనలో 10 తులాల బంగారం, రూ. లక్ష నగదు అపహరణకు గురయ్యాయి. వివరాల్లోకి వెళితే.. భూపాలపల్లి పట్టణంలోని కారల్ మార్బ్ కాలనీకి చెందిన మెండు రవికుమార్ కుటుంబ సభ్యులు నర్సంపే టలోని బంధువుల ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లగా, ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంట్లో ఎవరు లేని సమయం చూసి, తాళం పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న సుమారు 10 తులాల బంగారం, రూ.1 లక్ష నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు తలుపులు ధ్వంసమైన దృశ్యాన్ని చూసి షాక్‌కు గుర య్యారు. ఇంట్లో సామాన్లు చిందరవందరగా కనిపించడంతో ఏమి జరిగిందో అర్థంకాక బోరున విలపించారు. కిరాణా దుకాణం నడుపుకుంటూ కష్టపడి సంపాదించిన సొమ్ము ఒక్కసారిగా దోచుకుపోవడంతో ఏమిచేయాలో తెలియక దుఃఖసాగరంలో మునిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరిం చారు. కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా భూపాలపల్లి పట్టణంలో తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా కొంతకా లంగా దొంగతనాలు జరుగుతు న్నాయి. వరుస దొంగతనాలతో పట్టణ ప్రజలు భయంతో భీతిల్లిపోతున్నారు. పట్టణంలో ఈ దొంగతనాలకు కళ్లెం వేసేదెన్నడోనని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

- పోలీస్ అధికారులను ఆదేశించిన ఎస్పీ
- 13 ఫిర్యాదుల స్వీకరణ

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 23 (జనంసాక్షి):** కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ నితిక పంత్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని, వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. సోమవారం రోజు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత డిఎస్పీ,ఎఎస్పీ, సర్కిల్ ఇన్స్పెక్టర్ లతో ఫోన్ లో ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్పీ తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని, బాధితులు, సమస్యలు ఉన్నవారు ప్రజావాణి కార్యక్రమం ను సద్వినియోగం చేసుకోవాలి

## నేడు డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల శిబిరం

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనం సాక్షి):** జయ శంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నేడు (మంగళవారం) ఆటో, లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహిస్తామని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ అర్రివ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని హన్మకొండకు చెందిన శరత్ ఐ కేర్ హాస్పిటల్ సహకారంతో నిర్వహిస్తామని, నేడు ఉదయం 9 గంటలకు, సింగరేణి కమ్యూనిటీ హాల్, బస్టాండ్ పక్కన ఈ శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. కంటి చూపును పరీక్షించుకొని అవసరమైన చికిత్స పొందేందుకు డ్రైవర్లకు ఇది ఒక మంచి అవకాశమని, జిల్లాలోని ఆటో, లారీ, టిప్పర్ డ్రైవర్లు అందరూ ఈ శిబిరానికి హాజరై ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

## వడదెబ్బతో వృద్ధుడు మృతి

**గూడూరు, మార్చి23 (జనంసాక్షి):** వడదెబ్బ తగిలి వృద్ధుడు మృతి చెందిన సంఘటన గూడూరు మండలం మాట్టేవాడ గ్రామంలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళ్లగా ఎస్ఐ గిరిధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మాట్టేవాడ గ్రామానికి చెందిన వట్టం పాపయ్య (60) సోమవారం మధ్యాహ్నం అతడు వారి స్వంత ఆవులను మేపడానికి వెళ్లి స్పృహ తప్పి పడిపోగా సుమారుగా 3.00 గంటల ప్రాంతంలో అతని కుమారుడు వట్టం సుమన్ వెళ్లి చూడగా అప్పటికే అతని తండ్రి పాపయ్య వడదెబ్బ తగిలి మృతి చెందడం జరిగినది.ఇట్టి మృతిపై మృతుడి కుమారుడు వట్టం సుమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడమైనదని ఎస్ఐ గిరిధర్ రెడ్డి తెలిపారు.

# విపణి

## విదేశాల్లో క్రెడిట్ కార్డులను దీనికి వాడుతున్నారా?

### అయితే జాగ్రత్త!

**న్యూఢిల్లీ:** భారతీయ బ్యాంకులు జారీ చేసే ఇంటర్నేషనల్ క్రెడిట్ కార్డులను వాడుతున్నారా? అయితే, ఈ విషయం తెలియకుండా లావాదేవీలు జరిపితే మీరు చిక్కుల్లో పడ్డట్లే. భారతీయ చట్టాలపై అవగాహన లేకుండా చేసిన లావాదేవీల కారణంగా కొందరు భారతీయులు చిక్కుల్లో పడ్డారు. దుబాయ్ ప్రాపర్టీ కొనుగోళ్లకు తమ క్రెడిట్ కార్డులను వాడడంతో వారికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇఆ) నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరిలో ముగ్గురు వ్యక్తులకు ఈతరహా నోటీసులు జారీ అయినట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఎకనామిక్ టైమ్స్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఇంతకీ నిబంధనలు ఏం చెబుతున్నాయ్?

యూఏఈలో ప్రాపర్టీ డెవలపర్లకు డిపాజిట్ మొత్తంగా చెల్లించేందుకు వీరు తమ ఇంటర్నేషనల్ క్రెడిట్ కార్డులను వినియోగించినట్లు భావిస్తున్నారు. భారతీయ చట్టాల ప్రకారం.. అప్పులు చేసి విదేశాల్లో ఆస్తులు కొనుగోలు చేయడం నిషిద్ధం. క్రెడిట్ కార్డు కూడా ఓవిధంగా తాత్కాలిక అవసరాలను తీర్చే రుణం లాంటిదే. కాబట్టి ఫారిన్ ఎక్స్ఛేంజీ నిబంధనలు ఇందుకు అంగీకరించవు. భారతీయులు ఎవరైనా విదేశాల్లో ఆస్తులు కొనాలనుకుంటే లిబరైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (ఒఖీూ) కింద అధికారిక బ్యాంకింగ్ ఛానెల్స్ ద్వారా మాత్రమే డబ్బు పంపాలి. క్రెడిట్ కార్డులను కేవలం విదేశీ ప్రయాణాల్లో హోటల్ బుకింగ్స్, షాపింగ్ లేదా పుస్తకాలు కొనడం వంటి వ్యక్తిగత ఖర్చులకు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. చాలామంది భారతీయులు చట్టాలపై అవగాహన లేక ఇలాంటి పొరపాట్లు చేస్తుంటారని పన్ను నిపుణులు సూచిస్తున్నారు. ఇలా నోటీసులు అందుకున్న వ్యక్తులు తెలియక చేసిన తప్పు కాబట్టి క్షమించి విడిచి పెట్టాలని కోరే అవకాశం ఉంటుందన్నారు. చేసిన తప్పునకు పరిహారంగా కొత్త మొత్తం పెనాల్టీగా చెల్లించి బయటపడొచ్చు. కొన్ని సందర్భాల్లో మాత్రం కొనుగోలు చేసిన ఆస్తిని అమ్మేసి ఆ డబ్బును తిరిగి భారత్‌కు తీసుకురావాలని ఆర్‌బీఐ ఆదేశించే అవకాశమూ లేకపోలేదని చెబుతున్నారు. అయితే, హవాలా నెట్‌వర్క్ ద్వారా ఈ నగదు ఏమీ వెళ్లలేదు కాబట్టి ఆ సొమ్మును వెనక్కి తీసుకురావాలని ఆదేశించకపోవచ్చని పలువురు బ్యాంకర్లు పేర్కొంటున్నారు. ఏదేమైనా ఇలాంటి నిర్ణయాలు తీసుకొనేముందు సంబంధిత నిపుణులను సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు.



# నష్ట మేఘాలు కొనసాగుతాయ్!

- పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రతికూల సెంటిమెంటు
- చమురు, బ్యాంకింగ్ షేర్లపై ఒత్తిడి
- టెలికాం షేర్లకు సానుకూలతలు
- విశ్లేషకుల అంచనాలు




**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కొనసాగుతుండడంతో భారత స్టాక్ మార్కెట్లో ప్రతికూలతలే కనిపించనున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే సూచీలకు జరగాల్సిన నష్టం జరిగింది కాబట్టి భారీ పతనమేమీ కనిపించకపోవచ్చని మరికొందరు విశ్లేషకులు అంటున్నారు. అమెరికా-ఇరాన్ యుద్ధం ఇలాగే కొనసాగితే బ్యారెల్ చమురు ధర ఏప్రిల్ చివరకు 180 డాలర్లను అధిగమించొచ్చని సౌదీ అరేబియా చమురు అధికారులు అంటున్నారు. ఇక విదేశీ సంస్థాగత మదుపర్లు మార్చిలో ఇప్పటిదాకా రూ.88,180 కోట్ల విక్రయాలు చేయడం గమనార్హం. బలహీన రూపాయి కూడా ప్రతికూలతలను తెచ్చిపెడుతోంది. నిఫ్టీ-50 సూచీకి 23,000-22,900 వద్ద మద్దతు; 23,500-23,800 వద్ద నిరోధం కనిపించొచ్చని సాంకేతిక నిపుణుల అంచనా. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..టెలికాం షేర్లు రాణించొచ్చు. వినియోగదార్ల సంఖ్య విషయంలో సానుకూల వార్తలు రావడంతో వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్ లాభాల బాటపట్టవచ్చు. వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వం తన 49% వాటాను విక్రయించాలని చూస్తుండడమూ ఈ షేరుకు కలిసిరావొచ్చు. సరఫరా వ్యవస్థలో అవాంతరాలపై వాహన కంపెనీలకు ఆందోళనలున్నాయి. ద్రవ రూప పెట్రోలియం, గ్యాస్ కొరత కారణంగా ఫోర్జింగ్, హీట్ ట్రీట్‌మెంట్, పెయింటింగ్ పనులపై దెబ్బ పడుతోంది. ముడి చమురు, రబ్బరు ధరలు పెరగడం టైర్ల పరిశ్రమ మార్జిన్లపై ఒత్తిడి తెస్తోంది. నిఫ్టీ బ్యాంక్ సూచీలో ఒత్తిడి కొనసాగొచ్చు. సమీప భవిష్యత్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లపై మదుపర్ల దృష్టి కొనసాగొచ్చు. తాత్కాలిక ఛైర్మన్ విషయంలో అనిశ్చితి వల్ల బ్యాంకు షేర్లలో విక్రయాల ఒత్తిడి ఉన్నా.. ఒక శ్రేణికే పరిమితం కావొచ్చు. మార్కెట్ సెంటిమెంటు ప్రతికూలంగా ఉండడంతో సిమెంటు కంపెనీల షేర్లు తక్కువ స్థాయుల్లో కొనసాగొచ్చు. ఇటీవల బలహీనతల నేపథ్యంలో పుంజుకునే అవకాశాన్నీ కొట్టిపారేయలేం. ఐటీ షేర్ల కదలికలు ఒక శ్రేణికి పరిమితం కావొచ్చు. సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్(ఎస్ఏఏఎస్) కంపెనీలపై ఏఐ టూల్స్ వల్ల ఇబ్బంది అన్న భయాలు తొలగాయి. అయితే రాబోయే త్రైమాసికాల్లో కాంట్రాక్టులపై సానుకూల స్పందనలు వచ్చేంత వరకు అప్రమత్తత కొనసాగొచ్చు. లోహ, గనుల కంపెనీల షేర్లు స్వల్పకాలంలో ఊగిసలాటకు గురికావొచ్చు. డాలరు సూచీ కదలికలు, కమొడిటీ ధరల ఆధారంగా ఇవి ట్రేడవవచ్చు. అధిక ముడి పదార్థాల వ్యయాల వల్ల మార్చి త్రైమాసిక ఫలితాలపై ఒత్తిడి కనిపించొచ్చు. ముడి చమురు ధరల పెరుగుదల వల్ల ఎఫ్ఎమ్‌సీజీ రంగంపై మరింత ప్రభావం పడొచ్చు. వంటనూనెల ధరలు మరింత పెరగవచ్చు. రూపాయి క్షీణత వల్ల కంపెనీలపై దిగుమతి ఆధారిత ముడిపదార్థాల వ్యయాల భారం పెరగొచ్చు.

## శాంసంగ్ టు ఐఫోన్.. ఫైల్ ట్రాన్స్‌ఫర్ ఇక సులువు

**న్యూఢిల్లీ:** శాంసంగ్ ఫోన్ల నుంచి ఐఫోన్లకు వీడియోలు, ఫోటోలు నేరుగా క్విక్ షేర్ చేయలేకపోతున్నారా? థర్డ్ పార్టీ యాప్స్‌ను వాడాల్సి వస్తోందా? ఇకపై ఈ సమస్యకు చెక్ పెట్టెందుకు శాంసంగ్ సిద్ధమైంది. తన ఎస్26 సిరీస్‌లో యాపిల్ ఫోన్ల తరహా ఎయిర్‌డ్రాప్ ఫీచర్‌ను తీసుకొచ్చింది. దీని సాయంతో ఫోటోలను, వీడియోలను ఐఫోన్లకు సులువుగా షేర్ చేయొచ్చు. ముందుగా ఈ ఫీచర్‌ను దక్షిణకొరియాలోని ఎస్26 యూజర్లకు అందుబాటులోకి తెచ్చింది. మున్ముందు ప్రపంచ వ్యాప్తంగా తీసుకురానుంది. అంతేకాదు మరిన్ని డివైజులకు సైతం అందుబాటులోకి తేనుంది. ఇలాంటి ఫీచర్‌నే 2025లో గూగుల్ తన పిక్సెల్ డివైజ్‌లలో తీసుకొచ్చింది. తాజాగా శాంసంగ్ కూడా ఈ ఫీచర్‌ను జోడించింది. శాంసంగ్ ఎస్26 ఫోన్ నుంచి వీడియోలను ఐఫోన్‌కు పంపాలంటే కొన్ని సెట్టింగ్స్ మార్చుకోవాల్సి ఉంటుంది. శాంసంగ్ ఎస్26 ఫోన్‌లో సెట్టింగ్స్ లోకి వెళ్లి కనెక్టెడ్ డివైజెస్‌ను ఎంపిక చేయాలి. షేర్ విత్ యాపిల్ డివైజెస్‌ను క్లిక్ చేసి ఆన్‌చేయాలి ఐఫోన్‌లోనూ ఎయిర్‌డ్రాప్ ఆప్షన్‌ను ఎనేబుల్ చేయాలి. షేర్ చేయాల్సిన ఫైల్‌ను సెలెక్ట్ చేసి, క్విక్ షేర్ ద్వారా లిస్టులో కావాల్సిన ఐఫోన్ డివైజ్‌ను ఎంపిక చేసుకుంటే సరిపోతుంది.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,24,350 | ₹ 1,35,650 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,30,000

## ఏసీ కంపెనీల ఆశలపై నీళ్లు చల్లుతోన్న వర్షం

**న్యూఢిల్లీ:** సాధారణంగా వేసవి ప్రారంభంలో ఉష్ణోగ్రత పెరుగుదల కారణంగా ఏసీలకు గిరాకీ అధికంగా ఉంటుంది. కానీ ప్రస్తుతం దేశంలో పలు ప్రాంతాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రారంభ డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉండటంతో ఏసీ తయారీ కంపెనీలు అప్రమత్తమయ్యాయి. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్లాస్టిక్ వంటి ముడి పదార్థాల ధరలు పెరగడం, మరోవైపు ఎల్‌పీజీ గ్యాస్ లభ్యత తగ్గడం వల్ల ఉత్పత్తిపై ప్రభావం పడింది. ఇటీవల ప్రకటించిన ధరల పెంపుపై కూడా పరిశ్రమ వర్గాల్లో ఆందోళన నెలకొంది. ప్లాస్టిక్ ధరల పెరుగుదల వల్ల వాషింగ్ మెషీన్ల వంటి పెద్ద గృహోపకరణాల ధరలు 10-12 శాతం పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సాధారణంగా మార్చిలో కూలింగ్ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. కానీ ప్రస్తుతం అసాధారణ వాతావరణ పరిస్థితులు తయారీదార్లను కలవరపెడుతున్నాయి. ఏప్రిల్‌లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయనే అంచనాలతో పరిశ్రమ ఎగ్జిక్యూటివ్‌లు ఆశాభావంతో ఉన్నారు. వచ్చే వారం తర్వాత దిల్లీ, ఉత్తరాదిలో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని గోద్రేజ్ ఎంటర్‌ప్రైజెస్ బిజినెస్ హెడ్ కమల్ నంది తెలిపారు. ఏప్రిల్‌లో పరిస్థితులు సాధారణ స్థితికి రావొచ్చన్నారు. ఏప్రిల్ 1 నుంచి గోద్రేజ్ ధరలు 5-10 శాతం పెరుగుతాయని, దీంతో డిమాండ్‌పై ఆందోళన ఉందని వెల్లడించారు. ప్లాంట్‌లకు ఎల్‌పీజీ సరఫరా తగ్గిందని, ఇదే పరిస్థితి కొనసాగితే పీక్ సీజన్‌కు ముందే ఉత్పత్తిలో 20-30 శాతం కోత ఉంటుందని హయర్ ఇండియా అధ్యక్షుడు ఎన్ఎస్ సతీశ్ తెలిపారు. ప్లాస్టిక్ ధరల పెరుగుదలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ ధరలతో పాటు ఇతర ముడివస్తువుల ధరలు పెరుగుతున్నాయని బ్లూస్టార్ ఎండీ బి.త్యాగరాజన్ పేర్కొన్నారు. ఇప్పటికే తక్కువ లాభాలతో పరిశ్రమ నడుస్తోందని, ఈ భారాన్ని వినియోగదారులపై పడుతుందని స్పష్టం చేశారు. మార్చిలోపు యుద్ధం ముగియకపోతే, వేసవిపై పెద్దగా ఆశలు ఉండవన్నారు.



# పశ్చిమాసియా యుద్ధ ప్రభావం

## రవాణా ఆలస్యం.. ముడి పదార్థాల కొరత : సీఐఐ

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణల కారణంగా భారతీయ కంపెనీలు రవాణా ఆలస్యం నుంచి కీలక ముడి పదార్థాల కొరత వరకు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆదివారం తెలిపింది. ప్రపంచ వాణిజ్య ఎగుమతులు, దిగుమతులపై ఆధారపడిన రంగాలన్నింటిలో పెరుగుతున్న ఒత్తిడిని ఇది స్పష్టం చేస్తోందని తెలిపింది. ఇరాన్-అమెరికా యుద్ధం కీలక సముద్ర మార్గాలకు అంతరాయం కలిగించి, ప్రపంచ సరఫరా వ్యవస్థలపై ఒత్తిడి తెస్తున్నందున, సంస్థలు ఇప్పటికే పర్యవసాన ప్రభావాలను చూస్తున్నాయని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ వెల్లడించారు. సరఫరా అంతరాయాలు ఇంధన మార్కెట్లు, వాణిజ్యంపై ఒత్తిడి పెంచాయని, దిగుమతులు-ఎగుమతులు రెండింటినీ ప్రభావితం చేశాయని.. దీని పర్యవసానాలు తయారీ, ఇతర పరిశ్రమల్లో కనిపిస్తున్నాయని సీఐఐ పేర్కొంది. కొత్తగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, అంతర్జాతీయ ఒడుదొడుకులను తట్టుకునేందుకు మన దేశం గతంలో కంటే మెరుగైన స్థితిలో ఉందని తెలిపింది. నిర్మాణాత్మక సంస్కరణలు, ఆత్మనిర్భర్ భారత్ కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి వంటి వాటి మద్దతుతో దేశం బలమైన స్థితికి చేరిందని బెనర్జీ వెల్లడించారు. ముడి చమురు వైవిధ్యీకరణ, ఎల్‌పీజీ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచడం, ఎగుమతులను సులభతరం చేయడం, కరెన్సీ స్థిరీకరణ వంటి చర్యలతో ప్రభుత్వం స్పందించిన తీరు వేగంగా, ప్రణాళికాబద్ధంగా, నిరంతరాయంగా ఉందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ఎయిరిండియా గ్రూప్ గణనీయంగా ప్రభావితమైందని సంస్థ అధిపతి క్యాంప్‌బెల్ విల్సన్ వెల్లడించారు. అయితే దాని ఆర్థిక ప్రభావం ఇంకా పూర్తిగా కనపడలేదని పేర్కొన్నారు. అనవసరమైన ఖర్చులపై గతంలో కంటే కఠినమైన నియంత్రణ ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లు ఇతర విమానయాన సంస్థల్లానే కార్యకలాపాల అంతరాయాలతో సతమతమవుతున్నాయి. 3 వారాల్లోనే ఆ ప్రాంతానికి వెళ్లాల్సిన 2,500 విమానాలను రద్దు చేయాల్సి వచ్చిందని క్యాంప్‌బెల్ తెలిపారు. విమానాశ్రయాలు లేదా గగనతలాలు మూసివేయడంతో, భద్రతను కూడా దృష్టిలో పెట్టుకుని ఈ రోజుకు కూడా సాధారణ పశ్చిమాసియా షెడ్యూల్‌లో 30% మాత్రమే నడుపుతున్నామన్నారు. పశ్చిమాసియా యుద్ధం తమ వ్యాపారంపై పెద్దగా ప్రభావాన్ని చూపలేదని ఎల్ అండ్ టీ పేర్కొంది. సుమారు 95 శాతం ప్రాజెక్టులు యధావిధిగా పని చేస్తున్నాయని కంపెనీ డిప్యూటీ ఎండీ సుబ్రమణియన్ శర్మ వెల్లడించారు. సరఫరా వ్యవస్థలో ఆందోళనలు ఉన్నాయని తెలిపారు. కమొడిటీ ధరల భారంతో దిగుమతి బిల్లు అధికమవుతున్నా, ప్రభుత్వం మూలధన వ్యయాలను కొనసాగించే ప్రభుత్వం మూలధన వ్యయాలను కొనసాగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. స్వల్పకాలానికి ద్రవ్యలోటు పెరిగినా సరే అవసరమైతే ఎక్కువగా రుణాలు తీసుకోవడానికి ప్రభుత్వం వెనకాడకపోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో, హర్మూజ్ జలసంధి మార్గంలో ఎల్ఎన్‌జీ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో, మన దేశంలోని యూరియా ప్లాంట్లు సగం సామర్థ్యంతో నడుస్తున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.



## పసిడికి యుద్ధ సెగ..

### భారీగా తగ్గుతున్న బంగారం ధర

ఈ ఏడాది ఆరంభంలో ఆకాశాన్నంటిన బంగారం, వెండి ధరలు గత కొన్ని రోజులుగా దిగొస్తున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో నెలకొన్న ద్రవ్యోల్బణ భయాలతో ఈ లోహాల మెరుపులు తగ్గుతున్నాయి. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు భారీగా క్షీణించాయి. సోమవారం నాటి ట్రేడింగ్‌లో అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 4,138 డాలర్లకు దిగొచ్చి నాలుగు నెలల కనిష్ఠానికి పడిపోయింది. స్పాట్ గోల్డ్ ధర తగ్గడం వరుసగా ఇది తొమ్మిదో రోజు కావడం గమనార్హం. గత వారం ఆరంభంలో ఈ పసిడి ధర 5000 డాలర్ల పైన పలికింది. అటు వెండి ధర 62.47 డాలర్లకు పతనమైంది. ఇక, దేశీయంగానూ ఈ లోహాలకు గిరాకీ తగ్గింది. ఏప్రిల్ ఫ్యూచర్ కాంట్రాక్టుల్లో 10 గ్రాముల బంగారం ధర నేడు 9.8శాతం తగ్గి రూ.1,30,300 వద్ద కొనసాగుతోంది. మే ఫ్యూచర్స్‌లో వెండి ధర 10.97శాతం పతనమై కేజీ ధర రూ.2.01లక్షలుగా ట్రేడ్ అవుతోంది.

**హైదరాబాద్‌లో ధరలు ఇలా..**

హైదరాబాద్‌లో సోమవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,36,510గా ఉంది. కేజీ వెండి ధర రూ.2.09లక్షలు పలికింది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో చమురు ధరలు భారీగా పెరగడంతో ద్రవ్యోల్బణం పెచ్చుమీరుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఉద్రిక్తతల ప్రభావంతో దేశాల ఆర్థిక వ్యవస్థలు నెమ్మదించొచ్చనే అంచనాలకు తోడు డాలర్ బలోపేతం కావడం.. బంగారం, వెండి ధరలపై పెను ప్రభావం చూపుతోంది. మరోవైపు, యూఎస్ ఫెడ్, బ్యాంక్ ఆఫ్ జపాన్ సహా అన్ని ప్రధాన కేంద్ర బ్యాంకులు కీలక రేట్లను యథాతథంగా కొనసాగించడం కూడా ఈ లోహాల ధరల పతనానికి కారణమని బులియన్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### 10 కిలోల ఎల్‌పీజీ సిలిండర్లు..

## అవన్నీ పుకార్లే..

### కొట్టిపారేసిన కేంద్రం

దిల్లీ: ఎల్‌పీజీ సిలిండర్ బరువును 14.2 కిలోల నుంచి 10 కిలోలకు తగ్గించే అవకాశాలున్నట్లు వచ్చిన వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. అవన్నీ ఊహాగానాలే అంటూ కొట్టిపారేసింది. ఈ మేరకు పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వివరణ ఇచ్చారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఏర్పడిన వంటగ్యాస్ కొరతను అధిగమించేందుకు చమురు సంస్థలు సిలిండర్ (ఒఖఉ అఎశ్రీతినిటవతీ) బరువును తగ్గించే యోచనలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. గృహ అవసరాలకు 10 కేజీల ఎల్‌పీజీ సిలిండర్లను పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం గృహ అవసరాల కోసం 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్లను పంపిణీ చేస్తున్నారు. దీనిని 10 కిలోలకు తగ్గించాలని, పాత సిలిండర్లలోనే 10 కేజీల ఎల్‌పీజీని నింపి అందించే అవకాశాలను పరిశ్రమ వర్గాలు పరిశీలిస్తున్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. గృహ అవసరాలకు సిలిండర్ల కొరత రాకుండా చూసేందుకు ఈ వ్యూహాన్ని అమలుచేయాలని ఇంధన కంపెనీలు యోచిస్తున్నాయనేది ఆ వార్తల సారాంశం. సాధారణంగా 14.2 కిలోల గ్యాస్ సిలిండర్‌ను సగటున ఒక కుటుంబానికి 35-40 రోజులు వస్తుంది. అదే 10 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ అయితే దాదాపు నెల రోజులు వస్తుందని అంచనా. సంక్షోభ పరిస్థితుల్లో పంపిణీ అందరికీ చేరేలా ఈ మార్పులు చేయాలని భావిస్తున్నట్లుగా ఈ ఉదయం వార్తలు రాగా.. అలాంటిదేమీ లేదని తాజాగా కేంద్రం క్లారిటీ ఇచ్చింది.

### పశ్చిమాసియా యుద్ధంతో

## భారత్‌కు ఎన్నో సవాళ్లు

ఇస్తున్నామని, దేశంలో 60 శాతం ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వ్ ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ఎ÷-లాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను అని అన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే 10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. అలాగే దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నామన్నారు.

## జేపీ అసోసియేట్స్ కొనుగోలుకు అదానీ

### బిడ్ ఆమోదంపై ఎన్‌సీఎల్ఏటీకి వేదాంతా



దిల్లీ: జై ప్రకాశ్ అసోసియేట్స్ (జేపీ అసోసియేట్స్)ను రూ.14,535 కోట్లకు కొనుగోలు చేయడానికి అదానీ గ్రూప్ సమర్పించిన బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ)ను అనిల్ అగర్వాల్ నేతృత్వంలోని వేదాంతా గ్రూప్ ఆశ్రయించింది. దివాలా ప్రక్రియ ద్వారా జేపీ అసోసియేట్స్‌ను కొనుగోలు చేసే రేసులో వేదాంతా గ్రూప్ ఉంది. అయితే గత ఏడాది నవంబరులో అదానీ ఎంటర్‌ప్రైజెస్ సమర్పించిన పరిష్కార ప్రణాళిక లేదా బిడ్‌ను రుణదాతలు ఆమోదించారు. ఈ నెల 17న అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.14,535 కోట్ల బిడ్‌ను ఎన్‌సీఎల్‌టీ అలహాబాద్ బెంచ్ ఆమోదించింది. దీంతో ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలపై ఎన్‌సీఎల్ఏటీలో వేదాంతా అప్పీల్ దాఖలు చేసింది. ఈ అంశంపై సోమవారం ఛైర్‌పర్సన్ జస్టిస్ అశోక్ భూషణ్, సభ్యుడు (సాంకేతిక) బరుణ్ మిత్రాలతో కూడిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం ముందు విచారణ జరగనుంది.

## ఏఐలో భారత సంస్థల జోరు

### అంతర్జాతీయ కంపెనీలతో పోలిస్తే ముందంజ

### నైపుణ్యాల్లో మాత్రం వెనుకబడ్డాయ్

### డెలాయిట్ నివేదిక

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)ను అందిపుచ్చుకోవడంలో దేశీయ సంస్థలు దూసుకెళ్తున్నాయి. అంతర్జాతీయ కంపెనీలతో పోలిస్తే మన సంస్థలు ముందంజలో ఉన్నాయని, వచ్చే ఏడాది చాలా కంపెనీలు తమ ఏఐ వ్యయాలను పెంచుకోవాలని భావిస్తున్నాయని డెలాయిట్ నివేదిక పేర్కొంది. అయితే ఈ వేగవంతమైన విస్తరణ వల్ల సామర్థ్యాల్లో వ్యత్యాసాలు వస్తున్నాయి. ప్రపంచ సగటుతో పోలిస్తే మన దేశంలో స్పెషలిస్ట్ ఏఐ నైపుణ్యాలు తక్కువ స్థాయిలో ఉన్నాయని నివేదిక తెలిపింది. 'స్టేట్ ఆఫ్ ఏఐ ఇన్ ది ఎంటర్‌ప్రైజ్' నివేదిక ప్రకారం.. కీలక కార్యకలాపాల్లో భారీ స్థాయి ఏఐ వినియోగం, అంతర్జాతీయ సంస్థల కంటే భారత సంస్థల్లో ఎక్కువగా ఉంది. డెలాయిట్ గ్లోబల్ స్టేట్ ఆఫ్ ఏఐ ఇన్ ది ఎంటర్‌ప్రైజ్ సర్వేలో భారత ఏఐ ఇన్‌సైట్స్ భాగంగా ఉంది. మన ఎడిషన్‌లో 200 మందికి పైగా వ్యాపార, టెక్నాలజీ ప్రముఖుల నుంచి అభిప్రాయాలను తీసుకున్నారు. ఉత్పత్తి అభివృద్ధి (62%), వ్యూహాలు- కార్యకలాపాలు (56%), మార్కెటింగ్, విక్రయాలు (55%), సరఫరా వ్యవస్థ (48%) వంటి రంగాల్లో ఏఐ వినియోగం ఎక్కువగా ఉంది. మన దేశంలో దాదాపు 40 శాతం సంస్థలు ఏఐను విస్తృతంగా వినియోగిస్తున్నాయి. ప్రపంచ సగటు (28%) కంటే ఇది చాలా ఎక్కువ. ఏఐని మన సంస్థలు ప్రయోగాత్మకంగానే వాడటం లేదని, స్వల్పకాలిక ఉత్పాదక, వ్యాపార ఫలితాలను మెరుగుపరుచుకోవడానికి ఏఐని ఎక్కువగా వినియోగించడాన్ని ఇది సూచిస్తోందని డెలాయిట్ స్పష్టం చేసింది. వచ్చే ఏడాది ఏఐ బడ్జెట్‌ను పెంచాలని 94% దేశీయ సంస్థలు భావిస్తున్నాయి. ఏఐ వల్ల తమ ఉత్పాదకత పెరుగుతుందని 97% సంస్థలు ఆశిస్తున్నాయి. ప్రధాన సవాళ్లు: భారత్‌లో కేవలం 0-4% సంస్థల వద్ద మాత్రమే అత్యున్నత స్థాయి ఏఐ నైపుణ్యాలు ఉన్నాయి. ప్రపంచ సగటు 2-8 శాతంతో పోలిస్తే ఇది తక్కువే. ఏఐ అమలుకు ప్రధాన అడ్డంకులుగా నియంత్రణ, నిబంధనలు (39%), . ప్రపంచ సగటు 2-8 శాతంతో పోలిస్తే ఇది తక్కువే. ఏఐ అమలుకు ప్రధాన అడ్డంకులుగా నియంత్రణ, నిబంధనలు (39%), సంస్థాగత మార్పుల పట్ల వ్యతిరేకత (34%) ఉన్నాయి. ఖర్చు (12%), మౌలిక సదుపాయాలు (5%) పరిమితుల వల్ల పెద్దగా ఒత్తిడి లేదని సంస్థలు చెబుతున్నాయి. పాలనపరమైన సంసిద్ధత, ఆపరేటింగ్ మోడల్ మార్పు వంటివి తక్షణ అడ్డంకులుగా కనిపిస్తున్నాయి. ఈ అడ్డంకులు ఉన్నప్పటికీ, ఏఐ వల్ల మంచి ప్రయోజనమే దక్కుతుందని మన కంపెనీలు ఆశిస్తున్నాయి. ఏఐతో ఉత్పాదకత పెరుగుతుందని 97% మంది అంటున్నారు. భారత కంపెనీలు కేవలం టెక్నాలజీని పొందడంపైనే కాకుండా, అంతర్గత నైపుణ్యాలను పెంచుకోవడం, బలమైన పాలనను ఏర్పాటు చేయడం, కొత్త పని విధానాలకు అనుగుణంగా ఉద్యోగులను మార్చడంపై దృష్టి పెట్టాలని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఎస్.అంజనీ కుమార్ పేర్కొన్నారు.

# రబీ ధాన్యం కొనుగోలుకు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం

- ఈ-నామ్ 2.0 అమలుకు రైతుల సహకారం కోరిన కలెక్టర్ కోయ శ్రీహర్ష
- అర్జీలు సత్వరమే పరిష్కరించాలి
- గొర్రె కాపరుల సమస్యలపై గొంగడి ధర్నా





**పెద్దపల్లి, మార్చి 23 (జనం సాక్షి) :** ఈ-నామ్ 2.0 వ్యవస్థ అమలుకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఈ-నామ్ 2.0 అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులకు పారదర్శకమైన పోటీ ధరలు అందించేందుకు ఈ-నామ్ వ్యవస్థ అమలవుతోందని, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో కూడా ఈ-నామ్ ప్లాట్‌ఫారమ్ ద్వారా వివిధ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు-అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం 1.0 నుంచి 2.0కి మార్పిడి జరుగుతున్న నేపథ్యంలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ-నామ్ 2.0 అమలు తప్పనిసరని, రైతులకు మరింత పారదర్శకంగా మెరుగైన ధరలు లభిస్తాయని వివరించారు.

రైతులు పంటను మార్కెట్ యార్డుకు తీసుకురావడానికి ముందు పూర్తి వివరాలు నమోదు చేసుకుని ఎల్‌ఓటీ ఐడీ పొందాలని సూచించారు. కమిషన్ ఏజెంట్లు, ట్రేడర్లు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

**రబీ ధాన్యం కొనుగోలు సమీక్ష**

రబీ సీజన్‌లో 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 1.77 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని, 12 వేల ఎకరాల్లో సన్న రకం ధాన్యం ఉందని తెలిపారు. ఏప్రిల్ 15 నుంచి మే నెలాఖరు వరకు కొనుగోలు పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు వాహనాలు సిద్ధం చేయాలని, తేమ శాతం తెలిసిన 24 గంటల్లో కొనుగోలు పూర్తి చేసి మిల్లులకు తరలించాలని సూచించారు. గతంలో 20 వేల మెట్రిక్ టన్నులకు మించి ధాన్యం వచ్చిన కేంద్రాల వద్ద అదనపు సెంటర్లు ఏర్పాటు చేయాలని, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, వెయింగ్ యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. యాసంగి కొనుగోలుకు 1.1 కోట్ల గన్ని సంచులు అవసరమని, మిల్లర్ల నుంచి 30 లక్షల సంచులు సేకరించాలని, రాష్ట్రం నుంచి కొత్త సంచుల స్టాక్ సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం స్టోరేజీ స్పేస్ ఉందని, మరో 2 లక్షల టన్నులకు స్పేస్ గుర్తించాలని సూచించారు. రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు సకాలంలో సమర్పించాలని, అలా చేస్తే ముందస్తుగా ధాన్యం కేటాయిస్తామని చెప్పారు.

**ప్రజావాణి కార్యక్రమం**

ప్రజావాణి కార్యక్రమంలో అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఏ. శ్యామల విరాసత్ భూమి మ్యూటేషన్, పెద్దపల్లి మండలం పెద్దకలువల గ్రామానికి చెందిన నారసాని వెంకటేష్ మీసేవ మంజూరు, ఓదెల మండలం గూడెం గ్రామానికి చెందిన తిరుపతి అనర్హుల రేషన్ కార్డుల రద్దు వంటి దరఖాస్తులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# అపర భద్రాద్రిలో జిల్లా కలెక్టర్ పర్యటన

## భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు



**ఇల్లందకుంట, మార్చి 23 (జనం సాక్షి) :** అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలించారు. కరీంనగర్ జిల్లాకు తలమానికంగా ఉన్న అతిపెద్ద దేవాలయమైన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుండి ప్రారంభమై ఏప్రిల్ ఆరో తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ నెల 27న జరగనున్న సీతారాముల కళ్యాణం సందర్భంగా ఏర్పాటుచేసిన కళ్యాణమంటపంతో పాటు భక్తుల కోసం ఏర్పాటు చేయనున్న గ్యాలరీలను పరిశీలించడంతోపాటు ట్రాఫిక్ సంబంధించిన నియమ నిబంధనలను గురించి అధికారులతో మాట్లాడారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో కళ్యాణానికి తరలివస్తున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీటి వసతితో పాటు వైద్య సౌకర్యం ,టాయిలెట్ సౌకర్యం, ఏర్పాటు చేయాలన్నారు. దుమ్ము ధూళి లేవకుండా తగు చర్యలు తీసుకోవాలని కళ్యాణానికి వచ్చే భక్తుల పార్కింగ్ వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. భక్తులు అందరూ కళ్యాణాన్ని తిలకించేలా ఎల్ఈడి స్క్రీన్ లను ఏర్పాటు చేయాలని అన్నదానం చేసే చోట ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు. ఈ సంఘర్షణలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్,అడిషనల్ లోకల్ బాడీ అశ్విని తానాజీ వాకర్డే, ఆర్డీవో రమేష్, హుజరాబాద్ ఏసీపీ మాధవి, ఇల్లందకుంట ఎస్సై క్రాంతి కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు నాయకులు పాల్గొన్నారు.

# తల్లిని కోల్పోయిన విద్యార్థులకు ఉపాధ్యాయుల అండ



**పరకాల, (జనం సాక్షి):** తల్లిని కోల్పోయిన విద్యార్థులకు ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అండగా నిలిచారు. పరకాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న యాట రాజేందర్, ఏడవ తరగతి చదువుతున్న రమ్య శ్రీ అనే విద్యార్థుల తల్లి యాట నాగమణి ఇటీవల మరణించారు. తల్లిని కోల్పోయి దుఃఖంలో ఉన్న విద్యార్థుల కుటుంబా న్ని చూసి చలించి ప్రధానోపాధ్యాయులు సిలువేరు సురేందర్, ఉపాధ్యాయులు బోధ నేతర సిబ్బంది కలిసి మానవతా దృక్పథంతో, ఆ కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పంతో 25 కేజీల బియ్యం, నెలకు సరిపడే నిత్యవసర సరుకులు విద్యార్థుల ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడు సురేందర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న విద్యార్థులకు అండగా నిలబడడం తమ బాధ్యత అని, భవిష్యత్తులో వారికి ఏ అవసరం వచ్చిన పాఠశాల తరఫున తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన ఉపాధ్యాయులు బోధ నేతర సిబ్బందినీ ఆయన అభినందించారు.

## రాష్ట్ర బడ్జెట్లో కల్లుగీత కార్మికుల సంక్షేమానికి

# 5000 వేల కోట్లు కేటాయించాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 23 (జనం సాక్షి) :**

కల్లుగీత కార్మికులకు గత బడ్జెట్ లో కేటాయించిన 93 కోట్లలో ఈ సంవత్సర కాలంలో 17 కోట్లు మాత్రమే ఇచ్చారు. మిగతా 76 కోట్లు ఈ నెల చివరి వరకు ఇవ్వాలి 2026-27 బడ్జెట్ లో గీత కార్మికుల సంక్షేమానికి 5 వేల కోట్లు కేటాయించాలని గత సంవత్సరం కేటాయించిన ఖర్చు చేయకుండా ఉన్న మిగతా డబ్బులు మార్చి చివరి వరకు విడుదల చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఫిబ్రవరి 17న రాష్ట్ర కార్యవర్గం హైదరాబాదు లోని ఇందిరా పార్క్ వద్ద నిరాహార దీక్ష చేశాం. మార్చి 17న మరొక్కసారి సోదర వృత్తి సంఘాలను కలుపుకొని ధర్నా నిర్వహించాము. అయినా ప్రభుత్వం ఎప్పటి లాగానే వ్యవహరిస్తుంది. ఐదు లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్న కల్లుగీత వృత్తి పై కనికరమే లేదు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి ఈ బడ్జెట్ సమావేశాల్లో గీత కార్మికులకు తగిన కేటాయింపులు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కామారెడ్డి లో నిరసన చేయడం జరిగింది సంవత్సరాల నుండి వేలాది మంది గీత కార్మికులకు 50 సంవత్సరాలు నిండిన పింఛన్ రావడం లేదు, అలాగే ప్రమాదంలో మరణించిన, వికలాంగులైన గీత కార్మికులకు సంవత్సరాలు గడుస్తున్న ఎక్సిగేషియో ఇవ్వడం లేదన్నారు.కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కల్లుగీత వృత్తి ప్రమాదంలో మరణించిన వారికి ఎక్స్ గ్రేషియా 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచుతాం అన్నారు, గీత కార్మికులకు వృత్తి పింఛన్ 2000 నుండి 4000 రూపాయలు ఇస్తామని చెప్పారు,560 జీవో ప్రకారం ప్రతి సొసైటీకి 5 ఎకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలి ప్రభుత్వ భూమి లేనిచో కొని ఇవ్వాలి, జిల్లాలో తాటి ఈత నీరా ఉత్పత్తుల కేంద్రం ఏర్పాటు చేసి యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, సభ్యత్వం కలిగి ఉన్న ప్రతి కల్లుగీత కార్మికులకు ద్విచక్రవాహనాలు ఇవ్వాలని. కల్లుగీత వృత్తి చేసే ప్రతి ఒక్క గీత కార్మికునికి కాటమయ్య రక్షణ కిట్లను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్ గౌడ్ కార్యదర్శి రాజా గౌడ్ ఉపాధ్యక్షులు రవీందర్ గౌడ్, స్వామి గౌడ్, సాయ గౌడ్, మోహన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# సంచలనం: హైడ్రా కమిషనర్‌పై కోర్టు ధిక్కరణ తీర్పు

- నాలుగు వారాల్లో బతుకమ్మకుంటలో గోడలు, నిర్మాణాలు తొలగించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు
- కోర్టు ఆదేశాలను పట్టించుకోకపోవడంపై తీవ్ర ఆగ్రహం



**అంబర్పేట్, మార్చి 23:**
బఘ్ అంబర్‌పేట్ పరిధిలోని బతుకమ్మకుంట సరస్సు వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. సరస్సు పరిధిలో నిర్మించిన కాంపౌండ్ గోడలు, ఇతర నిర్మాణాలు, సూచిక ఫలకాలను వెంటనే తొలగించాలని న్యాయస్థానం గట్టిగా ఆదేశించింది. ఈ పనులను ఈ రోజు నుంచి నాలుగు వారాల్లోపు పూర్తి చేయాలని స్పష్టమైన గడువు విధించింది. కోర్టు ఆదేశాలను పట్టించుకోకపోవడంపై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై ఇలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని కఠిన హెచ్చరికలు జారీ చేసింది. ఈ తీర్పు నగరంలో తీవ్ర చర్చకు దారితీసింది. బతుకమ్మకుంట సరస్సు పరిరక్షణ అంశం మళ్లీ ప్రధాన చర్చగా మారింది. హైడ్రా అధికారుల తదుపరి చర్యలపై, నాలుగు వారాల గడువులోపు ఆదేశాలు అమలు చేస్తారా లేదా అనే అంశంపై అందరి దృష్టి నిలిచింది. సరస్సు పరిరక్షణకు సంబంధించి ఇప్పటికే అనేక పిటిషన్లు, ప్రజా ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ఈ తీర్పు మరింత కీలకంగా మారింది.

**అసెంబ్లీ ముట్టడిలో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి అరెస్ట్**

**వికారాబాద్, మార్చి 23:**
బీజేపీ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి అరెస్టయ్యారు. అసెంబ్లీ గేటు దూకే క్రమంలో పోలీసులు అడ్డుకుని బేగంబజార్ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ పాలనా వైఫల్యాలకు నిరసనగా గెరిల్లా వ్యూహంతో ముట్టడి చేశామని, రేవంత్ సర్కార్‌ను ఎన్నికల్లో దించుతామని డాక్టర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా మీడియా కన్వీనర్ మోహన్ రెడ్డి, రాఘవేందర్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒకే తేదీ, ఒకే నెల.. రెండేళ్ల వ్యవధిలో ముగ్గురు

- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకున్న పిల్లలు
- మాజీ సైనికుడు చింతకింది శివకృష్ణ- మౌనిక దంపతుల హర్షం



**చెన్నారావుపేట, మార్చి 23 (జనంసాక్షి):** ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ (ఐబి ఆర్ అచీవర్)గా ఒకే తేదీన జన్మించిన ముగ్గురు పిల్లలు చోటు సంపాదించుకు న్నారు. ఒకే తేదీ... ఒకే నెల... తమ ముగ్గురు పిల్లల జన్మదిన వేడుకలను కన్న తల్లిదండ్రులు ఒకేసారి జరుపుతున్నారు. ఇదేమిటి ఒకే రోజున ముగ్గురు పిల్లల జన్మదిన వేడుకలు జరుపుకోవడం అని ఆశ్చర్యపోతున్నారా.... అవును ఇది అక్షరాలా నిజమే... ఇది ఎక్కడో కాదు...వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు చింతకింది శివకృష్ణ- మౌనిక దంపతులకు ముగ్గురు పిల్లలు సంతానం. మొదటి సంతానంగా కూతురు అక్షర జూన్ 3వ తేదీన 2020వ సంవత్సరం, రెండవ సంతానం కుమారుడు అర్జున్ జూన్ 3వ తేదీన 2022వ సంవత్సరం, మూడవ సంతానం కుమారుడు ఆదిత్య 3వ తేదీన 2024వ సంవత్సరంలో జన్మించారు. అంటే ముగ్గురు పిల్లలు కూడా ఒకే తేదీ, ఒకే నెల జూన్ 3వ తేదీన రెండేళ్ల వ్యవధిలో జన్మించడం విశేషంగానే చెప్పవచ్చు. అంతేకాకుండా ముగ్గురు పిల్లల జన్మదిన వేడుకలను తల్లిదండ్రులు ఒకేరోజు జరుపుకోవడం కూడా అరుదైన విషయమే. ఇది నిజంగా చాలా అరుదైన అద్భుతమైన విషయంగా చెప్పుకోవచ్చు. ఒకే తేదీన (జూన్ 3)న వేర్వేరు సంవత్సరాల్లో(2020, 2022, 2024))లో ముగ్గురు పిల్లలు పుట్టడం అనేది గణాంకాల ప్రకారం లక్షల్లో ఒకరికి మాత్రమే ఇలాంటిది జరుగుతుంది. గణాంక పరంగా ఒకే కుటుంబంలో ముగ్గురు పిల్లలు ఒకే తేదీన వేరువేరు సంవత్సరాల్లో పుట్టే అవకాశం 1 లక్ష 33 వేల 225 మందిలో ఒకరికి మాత్రమే వస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాకతాళియం వైద్యపరంగా చూస్తే ఇది కేవలం ప్రకృతి సిద్ధంగా జరిగిన ఒక గొప్ప వింత అని డెలివరీ తేదీలు సహజంగానే ఆ రోజున రావడం విశేషంగా చెప్పుకోవచ్చని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన దంపతులు తమ ఇద్దరు పిల్లలు ఒకే తేదీన ఏప్రిల్ 9న వేరువేరు సంవత్సరాల్లో జన్మించినందుకు గాను లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించారు.మాజీ సైనికుడు చింతకింది శివకృష్ణ- మౌనిక దంపతుల ముగ్గురు పిల్లలు అక్షర, అర్జున్, ఆదిత్యలు ఏకంగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నారు. ఈ మేరకు సోమవారం ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఐబిఆర్ అచీవర్ గా గుర్తిస్తూ (ఐడి నెంబర్ 8407)ను జారీ చేసింది.దీంతో తమ ముగ్గురు పిల్లలు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లోకి ఎక్కడంతో తల్లిదండ్రులు శివకృష్ణ - మౌనిక దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఉప్పరపల్లి గ్రామస్తులు సైతం హర్షం వ్యక్తం చేశారు.

# బాల్య వివాహాల కట్టడికి చర్యలు



**హనుమకొండ ప్రతినిధి మార్చి 23 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో బాల్య వివాహాల నిరోధక చట్టం-2006కు సంబంధించిన గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సోమవారం ఆవిష్కరించారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో, మిషన్ శక్తి జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా "బేటీ బచావో - బేటీ పఢావో" కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాల్య వివాహాల నిరోధక అధికారులుగా జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్‌డీఓ/సబ్ కలెక్టర్, ప్రాజెక్టు స్థాయిలో సీడీపీవో, మండల స్థాయిలో తహశీల్దార్, సెక్టార్ స్థాయిలో ఐసీడీఎస్ సూపర్వైజర్, గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి సీఎంపీవోగా వ్యవహరిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, డీఆర్‌డీఓ శ్రీను, పరకాల మరియు హనుమకొండ ఆర్‌డీఓలు డాక్టర్ కన్నం నారాయణ, రాథోడ్ రమేష్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, డీడబ్ల్యూఓ విశ్వజ, జీఈసీఓ సునీత, ఈఓ సింధు రాణి, మిషన్ కోఆర్డినేటర్లు కళ్యాణి, పావని పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

**మేడ్చల్-మల్కాజిగిరి, మార్చి 23:** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపి, జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 163 దరఖాస్తులు స్వీకరించారు. అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా ఆదాయ అధికారి చంద్రావతితో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ శాఖకు సంబంధించిన 58 దరఖాస్తులు అధికంగా వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజలు నమ్మకంతో వస్తున్నారని, వారి సమస్యలు త్వరగా పరిష్కరించి నమ్మకాన్ని నిలబెట్టాలని అధికారులకు సూచించారు.

**నా లింకు డాక్యుమెంట్ పోయినది**

నేను అనగా కృష్ణ నాయక్ తండ్రి రాములు నాయక్, గ్రామము బోయిన్‌పల్లి తొండ మండల నారాయణ పేట జిల్లా నారాయణ పేట నేను 06/02/2025నాడు మహమద్ గులం దస్తగిరి తో 133.33 గల ప్లాటను కొనుగోలు చేశానది. డాక్యుమెంట్ నెంబర్ 8101/2025 సంబంధించిన డాక్యుమెంట్ 3229/2012, 1 జనవరి 2026 నాడు నారాయణపేట బస్టాండ్‌లో నా లింకు డాక్యుమెంట్ పోయినది ఎవరికైక దొరికిన క్రింది నెంబరికి సంప్రదించాలని కోరుచున్నాము 9346764970




## యుద్ధాల నియంత్రణకు అంతర్జాతీయ

# చర్చలు అవసరం : చాడ వెంకటరెడ్డి

కరీంనగర్ టౌన్ మార్చి 23 (జనంసాక్షి) : ప్రపంచవ్యాప్తంగా దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలు, బాంబుల దాడులను నివారించాలంటే అంతర్జాతీయ స్థాయిలో చర్చలు జరగాలని సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. తక్షణమే ఐక్యరాజ్య సమితి చొరవ తీసుకోవాలని, అలాగే భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ముందడుగు వేయాలని సూచించారు.కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో చర్చలు జరిపి బాంబుల దాడుల నియంత్రణకు కృషి చేయాలని ఆయన హితవు పలికారు.అదేవిధంగా, దేశంలో నిరుద్యోగం సమస్య పరిష్కారం కాలేదని, నల్లధనం వెలికితీతలో పురోగతి కనిపించలేదని, ప్రభుత్వరంగ సంస్థలు బలహీనపడి కార్పొరేట్ సంస్థలు లాభపడుతున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా గౌతమ్ ఆదాని, ముకేశ్ అంబానీ వంటి పారిశ్రామికవేత్తల ఆస్తులు పెరిగినా, పేదల జీవన స్థితిలో మార్పు లేదన్నారు. సిపిఐ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రజలకు మరింత చేరువ కావడానికి ఏప్రిల్ నెలలో "ఇంటింటికి సిపిఐ" కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బత్తుల బాబు, టేకుమల్ల సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, న్యాలపట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# గొర్రె కాపరుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట గొంగడి ధర్నా
- సమస్యలపై కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతి పత్రం



**పెద్దపల్లి,మార్చి 23(జనంసాక్షి) :** గొర్రె కాపరుల సమస్యలు పరిష్కరించాలని గొట్టె కాపరులు సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట సోమవారం గొర్రె కాపరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినూత్న నిరసన గొంగడి ధర్నా నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి గొర్రెల కాపరులు తమ సంప్రదాయ దస్త్రమైన గొంగడి ధరించి కలెక్టరేట్ వద్దకు చేరుకొని ఆందోళనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ మార్కెట్ స్థలాల పరిరక్షణ, గొర్రెల పెంపకానికి సంబంధించిన సబ్సిడీలు, పశు వైద్య సేవల విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. గొర్రె కాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సలేంద్ర రాములు అధ్యక్షతన జరిగిన గొంగడి ధర్నాకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలారపు పర్వతాలు యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో గొర్రె కాపరులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మార్కెట్ యార్డుల అభివృద్ధి,పశు వైద్య సేవలు, ప్రభుత్వ పథకాల అమలులో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లాలోని గొర్రెలు-మేకల మార్కెట్ యార్డ్ స్థలాలకు వెంటనే సరిహద్దు రాళ్లు వేయాలని, మార్కెట్ యార్డులకు నీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముత్తారం, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, ఎలిగేడు, ధర్మారం మండలాలకు సంబంధించిన గొర్రెలు-మేకల మార్కెట్ యార్డ్ స్థలాల కేటాయింపులపై ప్రభుత్వ ఉత్తర్వుల ప్రతులను అందించాలని కోరారు. కుందనపల్లి గ్రామంలోని జిల్లా గొర్రెలు-మేకల మార్కెట్ యార్డ్ స్థలంలో ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించి ఫెన్సింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా మార్కెట్ యార్డ్ నిధుల్లో మిగిలి ఉన్న రూ.4.50 లక్షలతో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, ర్యాంపుల నిర్మాణం వంటి పనులు చేపట్టాలని, గొర్రెల కాపరులకు సంబంధించిన ఎన్ ఎల్ ఎం పథకం సబ్సిడీలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

పెద్దపల్లి జిల్లాలో పశు వైద్య సేవలను విస్తరించేందుకు కొత్త సబ్ సెంటర్లను ఏర్పాటు చేసి, పశు వైద్యులు, సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఒగ్గు కళాకారుడు నర్ర సతీష్ బృందంతో కలెక్టర్‌ను వేడుకొంటూ తన గానామృతంతో గొంగడి పరిచి పబ్బతి పట్టి ప్రాధేయపడుతూ మా మార్కెట్లను మాకు ఇస్తూ మా ఉపాధిని కాపాడండి అని రోధిస్తూ ఆలపించారు. పబ్బతి పట్టి అడిగిన సమస్యలు నెల రోజులలో పరిష్కరించని పక్షంలో గొర్రెలతో కలెక్టర్ ముందే ధర్నా చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాత రాజు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నర్సయ్య యాదవ్, నాయకులు దాడి చంద్రమౌళి యాదవ్,వేల్పుల రామ్మూర్తి యాదవ్,తాత సదానందం, తమ్మినవేణి కొమరయ్య, అట్ల లక్ష్మయ్య, నూనేటి సంపత్ యాదవ్, ఆవుల లత, రాములు యాదవ్,ఎలుక కొమురయ్య యాదవ్, బత్తిని లక్ష్మణ్ యాదవ్, ఆసరి రాయమల్లు యాదవ్, సింగారపు రవికుమార్ యాదవ్,సనేంద్ర కొమురయ్య యాదవ్,పర్శ సమయ్య యాదవ్, అట్ల సాగర్,ఆవుల సంతు,కొమ్మ ఐలయ్య,మల్లెత్తుల కనకయ్య,గోపు చంద్రయ్య, నాగరాజు, మంద స్వామి,పోలాజ్,నక్క కొమురయ్య,గొల్ల కురుమలు,గొర్రె కాపరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
24 మార్చి 2026




## పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని గీతా నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఏ, బీ వింగ్ పదోతరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భం గా విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా పరిశీలించారు సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మార్చి 23 (జనం సాక్షి):** సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించారు.మొత్తం 167 అర్జీల రాగా, సంబంధిత అధికారులకు అందజేశారు. రెవెన్యూ శాఖకు 62, గృహ నిర్మాణ శాఖకు 28, డీఆర్డీఓకు-19, జిల్లా పంచాయతీ కార్యాలయం 9, ఉపాధి కల్పన అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్పీ కార్యాలయానికి 5 చొప్పున, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు 4, జిల్లా విద్యాధికారి, జిల్లా వైద్యాధికారి, జిల్లా సంక్షేమ శాఖ, నీటి పారుదల శాఖ, సెస్ ఎండీకి 3 చొప్పున, జిల్లా పౌర సరఫరాల శాఖ, మైనింగ్ శాఖ అధికారి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయం, లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు 2 చొప్పున, మత్స్య శాఖ అధికారి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి, ఈడీఎం, ఈఈ ఆర్ అండ్ బీ, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, సబ్ రిజిస్టర్ సిరిసిల్లకు ఒకటి చొప్పున వచ్చాయి. వాటిని సంబంధిత కార్యాలయాలకు పంపించారు.ఇట్టి ప్రజావాణి లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజావాణి' దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, మార్చి 23 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 233 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచవద్దని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు. 10వ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కరీంనగర్ సప్తగిరి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిరుమల నగర్ లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహిస్తున్న ఇంగ్లీష్ పరీక్షల సరళిని పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులు సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ప్రథమ చికిత్స, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. తరగతి గదిలో తగిన వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# సింగరేణి నిధులను ప్రభుత్వం కొల్లగొడుతోంది

- కార్మికుల వేతనాలు చెల్లించలేని పరిస్థితి : ఏఐటీయూసీ
- సేవ్ సింగరేణి పోరాటంపై విమర్శలు సరికాదు.. సంఘీభావం తెలపాలి
- మార్చి 30న కొత్తగూడెం హెడ్‌క్వార్టర్స్ ముందు ధర్నా





**గోదావరిఖని, మార్చి 23 (జనం సాక్షి):** సింగరేణి నిధులను రాష్ట్ర ప్రభుత్వం కొల్లగొడుతోందని, సంస్థను నష్టాల్లోకి నెట్టివేస్తోందని ఏఐటీయూసీ అధ్యక్షు లు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తీవ్రంగా ఆరోపించారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరు ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ జోక్యం వల్ల సింగరేణి సంస్థ నష్టాలకు గురవుతోందని, కార్మికులకు వేతనాలు చెల్లించే పరిస్థితి కూడా లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థల నుంచి రావాల్సిన బొగ్గు విద్యుత్ బకాయిలను చెల్లించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సింగరేణి అధికారులు మంత్రులు, ఎమ్మెల్యేలకు ఊడిగం చేసే పరిస్థితి నెలకొనడం దురదృష్టకర మని పేర్కొన్నారు. సింగరేణి పరిరక్షణ కోసం ఏఐటీయూసీ సేవ్ సింగరేణి పోరాట జాత కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ నెల 30న కొత్తగూడెం హెడ్‌క్వార్టర్స్ ముందు వంటవార్పు, ధర్నా కార్యక్రమం నిర్వహి స్తామని వెల్లడించారు. ఈ పోరాటం ద్వారా కార్మిక సమస్యల పరిష్కారానికి యాజమాన్యం, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు.

గతంలో కేసీఆర్ ప్రభుత్వం సింగరేణిపై నీలి పెట్టితే, ప్రస్తుత ప్రభుత్వం కాలు పెట్టిందని విమర్శించారు. గత 12 సంవత్సరాలుగా ఒక్క కొత్త బొగ్గు బావిని కూడా ప్రారంభించలేదని, తాడిచెర్ల ఓసిని ప్రైవేటుకు అప్పగించారని ఆరోపించారు. 1992లో సింగరేణి బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లినప్పుడు ఏఐటీయూసీ పోరాటంతోనే సంస్థ మనుగడ కొనసాగిందని గుర్తుచేశారు.

సేవ్ సింగరేణి పోరాట జాతపై ఐఎన్‌టీయూసీ, సిఐటీయూ, హెచ్ఎంఎస్ యూనియన్లు విమర్శలు చేయడం సరికాదని, కార్మిక వర్గ ఐక్యతను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని ఖండించారు. కార్మికుల శ్రేయస్సు, సంస్థ పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలపాలని హితవు పలికారు. మినిమం వేజ్ బోర్డు చైర్మన్‌గా ఉన్న ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ కార్మికుల వేతనాలు ఎంత పెంచారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాదే, మంత్రులు, ఎమ్మెల్యేలు మావోళ్లే అంటున్న జనక్ ప్రసాద్ సింగరేణిపై ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. ఐఎన్‌టీయూసీ, సిఐటీయూ కార్మిక సంఘాల నాయకులు కొత్త గనుల ఏర్పాటు, కార్మికుల సంక్షేమం కోసం తమతో కలిసి రావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రావాల్సిన 50 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా సంస్థను నిర్వీర్యం చేస్తోందని, కేంద్రం కొత్త గనులు ఇవ్వకపోవడంతో ఉన్న గనులు మూతపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిలు వచ్చిన తర్వాతే కార్మిక సమస్యలు పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. యాజమాన్యం, ప్రభుత్వాలు సమస్యలు పరిష్కరించకపోతే ఏప్రిల్‌లో సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లయ్య, వీరభద్రం, ముస్కె సమ్మయ్య, సంకె అశోక్, రంగుశ్రీనివాస్, విజయలక్ష్మి, ఎం.ఎ.గౌస్ పాల్గొన్నారు. సేవ్ సింగరేణి పోరు జాత కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆర్‌జీ-1 ఏరియాలోని జిడికె-1 ఇంక్లైన్, టూ ఇంక్లైన్, ఓసిపి-5, జిడికె-11 ఇంక్లైన్, ఏరియా వర్క్‌షాప్, ఏరియా హాస్పిటల్‌లో గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. ప్రజానాట్య మండలి కళాకారులు కన్నం లక్ష్మి నారాయణ బృందం విప్లవ గేయాలు ఆలపించారు.

### ప్రపంచ రక్తహీనత దినోత్సవం సందర్భంగా

## ఐఎంఏ కరీంనగర్ ఆరోగ్య శిబిరం



**కరీంనగర్ బ్యూరో, మార్చి 23 (జనంసాక్షి) :** ప్రపంచ రక్తహీనత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐఎంఏ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో మహిళల డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రక్తహీనత నిర్ధారణ, అవగాహన శిబిరం విశేష స్పందన పొందింది. ఈ శిబిరంలో సుమారు 300 మంది విద్యార్థినులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో దాదాపు 150 మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించి తగిన చికిత్స అందించారు. అదనంగా, ఐరన్ మాత్రలు, ఐరన్ సిరపులు, ఐరన్ పుష్కలంగా ఉండే చిక్కీ పోషకాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఐఎంఏ కరీంనగర్ అధ్యక్షురాలు డా. ఏ. శైలజ మాట్లాడుతూ... మహిళల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, ఆరోగ్యంగా ఉన్న మహిళ కుటుంబం, సమాజానికి బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు. ఐ ఎం ఏ కార్యదర్శి డా.ఎన్.మహేష్ బాబు మాట్లాడుతూ... రక్తహీనత లక్షణాలు, రక్తం శరీరానికి ఎంత అవసరమో వివరించారు.

కోశాధికారి డా. వి. నీలిమ మాట్లాడుతూ... రక్తం ఏర్పడటంలో సరైన పోషకాహారం ఎంత కీలకమో వివరించారు. వైద్యురాలు డా. శ్రీలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ... రక్తహీనత వల్ల గుండె, మెదడు ఆరోగ్యంపై పడే ప్రభావాలను వివరించారు. పల్మనాలజిస్ట్ డా. నరేందర్ పటేల్ మాట్లాడుతూ... రక్తహీనతలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది సాధారణ లక్షణమని తెలిపారు. గైనకాలజిస్ట్ డా. జ్యోతి ఎన్ రక్తహీనత చికిత్స, నివారణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన మహిళల డిగ్రీ కళాశాల యాజమాన్యం, ముఖ్యంగా నజియా మేడంకి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



## అడవులను కాపాడితేనే దేశం సుస్థిరం

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 23 (జనం సాక్షి) :** అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవం, పిచ్చుకల దినోత్సవం పురష్కరించుకుని జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.ముందుగా కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ కార్యాలయం నుండి డిగ్రీ కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపొందించవచ్చని కళాశాలలో ఉన్న ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్రతి పుట్టినరోజున ఒక మొక్క నాటడం అలవాటు చేసుకోవాలని సూచించారు.అటవీ సంరక్షణే దేశ సంరక్షణ అనే నినాదంతో ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. పిచ్చుకల సంరక్షణపై కూడా దృష్టి సారించాలని, ఇంటి వద్ద నీటి గిన్నెలు ఉంచడం, చిన్న గూళ్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ,ప్రాణవాయువు లేకుండా మానవ జీవనం సాధ్యం కాదు. అడవులు, చెట్లు మన జీవనాధారాలు.

ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించాలని, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో ముందుండాలని పిలుపునిచ్చారు.అటవీ శాఖ అధికారిణి నిఖిత,ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, ప్రిన్సిపల్ తదితర అధికారులు పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు. పోలీస్, అటవీ శాఖ అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమావేశంలో సాంస్కృతిక సారథి కళాకారులు తమ గీతాలతో చెట్టూ చెట్టమ్మను నేను చెట్టును నేనురా మనిషి మనుగడకు జీవం పోసే అమ్మ వంటి నినాదాలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం అటవీ సంరక్షణ, పరిరక్షణ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 23 (జనం సాక్షి) :** జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు,నీటి ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రతిజ్ఞ తీసుకున్న ప్రతి వ్యక్తి నేడు నీటిని సంరక్షించేందుకు, పొదుపుగా వినియోగించేందుకు తాము అంకితం చేస్తారని నీటిని వృథా చేయకుండా ఒక్క బొట్టు కూడా వృథా చేయకుండా చూసేందుకు తన కుటుంబ సభ్యులు కూడా నీటిని వృథా చేయకుండా చూసేలా చేస్తారని నీటిని అత్యంత విలువైన వనరుగా భావిస్తూ, తెలివిగా వినియోగిస్తారని ప్రాంతీయ ,జాతీయ స్థాయిలో ప్రపంచ నీటి దినోత్సవం ను పురస్కరించుకొని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు నీటిని పరిరక్షించడం ఎంత ముఖ్యమో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరిని నీటి వినియోగంలో జాగ్రత్త పాటించాలని,భూమి, భవిష్యత్తు తరాల కోసం నీటిని రక్షించుకోవడం అవసరం అని సూచించారు.ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ కలెక్టర్ మధుమోహన్, సీఈఓ చందర్, ఆర్డిఓ వీణ, భూగర్భ జల శాఖ అధికారి సతీష్, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

## అత్యాచారం కేసులో పదేళ్ల జైలు శిక్ష

- 12వేల జరిమానా : వికారాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు వెల్లడి
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా



**వికారాబాద్ జిల్లా బ్యూరో మార్చ్ 23 (జనం సాక్షి):** అత్యాచారం కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ వికారాబాద్ జిల్లా కోర్టులో తీర్పు వెలబడిందని జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా ఒక ప్రకటనలో తెలియజేశారు.2016 సంవత్సరంలో పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులో నిందితుడికి కోర్టు పదేళ్ల కారాగార శిక్ష , 12000 రూపాయల విధిస్తూ తీర్పునిచ్చిందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా వివరించారు.పరిగి మండలం, బర్కత్‌పల్లి గ్రామానికి చెందిన సుక్కాని అంజయ్య (37) అనే వ్యక్తిపై 2016లో అత్యాచారం మరియు బెదిరింపులకు ఐపీసీ సెక్షన్లు 376, 506 సంబంధించి కేసు క్రైమ్ నెంబర్ 268/2016) నమోదైంది. ఈ కేసు విచారణ వికారాబాద్‌లోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో కొనసాగింది. పోలీసులు సమర్పించిన పక్కా సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి చౌదరి చంద్ర కిషోర్ నిందితుడు అంజయ్య దోషిగా నిర్ధారిస్తూ 10 సంవత్సరాల జైలు శిక్ష 12,000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేయడంలో విశేష కృషి చేసిన అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. నాటి దర్యాప్తు అధికారులు వై. నాగేష్ (అప్పటి పరిగి ఎస్సై) ప్రసాద్ (అప్పటి పరిగి సిఐ), ప్రస్తుత పరిగి సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.హెచ్.ఓ మోహన్ కృష్ణలను, అలాగే కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన అడిషనల్ పి.పి. మెరాజ్ ఫిర్దౌస్, సి.డి.ఓ జగన్ మోహన్ రెడ్డి, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్. నిరంజన్ గౌడ్‌ల పనితీరును ఎస్పీ ప్రశంసించారు. మహిళల భద్రత విషయంలో జిల్లా పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని, నేరస్థులు చట్టం నుండి తప్పించుకోలేరని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు.

### భగత్ సింగ్ స్ఫూర్తితో యువత

## మరో పోరాటానికి సిద్ధం కావాలి

- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి పిలుపు
- భగత్ సింగ్ వర్ధంతి పురస్కరించుకొని నివాళులర్పించిన ఫార్వర్డ్ బ్లాక్ నేతలు



**కరీంనగర్ బ్యూరో, మార్చి 23 (జనంసాక్షి) :** భగత్ సింగ్ స్ఫూర్తితో యువత మరో పోరాటం సిద్ధం కావాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రోజున భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని కరీంనగర్ నగరంలోని భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేతలు నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ చూపిన ధైర్యం, త్యాగస్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం భగత్ సింగ్ చేసిన పోరాటం నేటికీ ప్రాసంగిక మని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్యాయం, అసమానతలపై యువత చైతన్యంతో ముందుకు రావాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు అవసరమని సూచించారు. దేశ అభివృద్ధి, ప్రజల హక్కుల సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని, భగత్ సింగ్ ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అంబటి జోజిరెడ్డి అన్నారు. భగత్ సింగ్ ధైర్యం, దేశభక్తి ప్రతి భారతీయుడికి ఆదర్శమని పేర్కొన్నారు. విద్యాసంస్థలు, యువజన సంఘాలు, సామాజిక సంస్థలు భగత్ సింగ్ జీవిత చరిత్రపై చర్చలు, వ్యాస రచన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రస్తుత సమాజంలో యువత భగత్ సింగ్ జీవితం నుండి ప్రేరణ పొందుతూ దేశాభివృద్ధికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఫార్మల్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి, నగర అధ్యక్షుడు సత్య రావు, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.


## రైతుల కోసం మాట్లాడితే కేసులు పెడతారా?



**ముస్తాబాద్ మార్చి 23 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండలం లో రైతన్నల యూరియా కోసం పోరాడినందుకు బహుమతిగా కాంగ్రెస్ పార్టీ పెట్టినటువంటి అక్రమ కేసులో భాగంగా కోర్టుకు హాజరైన ముస్తాబాద్ బిఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నరసింహారెడ్డి మాట్లాడుతూ రైతులకు వ్యవసాయానికి యూరియా అందుతలేదని రైతుల పక్షాన ఉండి మాట్లాడితే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తుంది ప్రజల పక్షాన రైతుల పక్షాన ఉండి పోరాడుతాం ఎక్కడ అన్యాయం జరిగేంతవరకు నిలబడి ప్రజలకు. మద్దతుగా ఉంటాం కేసులకు భయపడి వాళ్ళం కాదు ఇప్పుడు కూడా రైతుల పొలాలు ఎండిపోతున్నాయి ఎక్కువ మానేరు నుండి చివరి ఆయకట్టు వరకు వ్యవసాయానికి నీరు అందించాలి. ఓ పక్క పొలాలు ఎండిపోతున్న. యూరియా బుకింగ్ కోసం రైతులు పడిగాపులు కాస్తున్న ఇప్పటి కూడా యూరియా అందుతలేదని ఆరోపించారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ కాలేదు. రైతు భరోసా అందలేదు. ఎండిపోయిన పొలాలకు నష్టపరిహారం వెంటనే ప్రభుత్వం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర నాయకులు మెంగని మనోహర్, యాది మల్లేష్ ,నల్ల నరసయ్య, గన్నె నర్సింలు, సిరిసిల్ల కోర్టులో హాజరు కావడం జరిగింది.

## గ్రామ పంచాయతీకి తాళం

### ధర్నాకి దిగిన ఉపసర్పంచ్






**నల్లగొండ ప్రతినిధి,మార్చి 23 (జనంసాక్షి) :** నల్లగొండ జిల్లాలో ని శాలిగౌరరం మండలంలోని ఊట్కూరు గ్రామంలో గ్రామపంచాయతీ కి ఉప సర్పంచ్ తాళం వేసి ధర్నా చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఊట్కూరు గ్రామ ఉపసర్పంచ్ రంగు రాములు అదే గ్రామానికి చెందిన సర్పంచ్ మరియు కొందరు వ్యక్తులు గ్రామ పంచాయతీకి బహుమతిగా ఇచ్చినటువంటి ఆరు గుంటల భూమిని ఒక ప్రైవేటు వ్యక్తికి అమ్మడానికి చూశారని దాన్ని అమ్మొద్దు అని ధర్నా చేశారు ఆరోపించారు. ఆలాగే అప్పట్లో గ్రామ అవసరాల ప్రయోజనం కోసం వాడుకోవాలని మాజీ సర్పంచ్ యానాల శ్రీనివాస్ రెడ్డి అప్పట్లో దానంగా ఇచ్చినటువంటి భూమిని అమ్మాలని చూస్తున్నారని ఆరోపిస్తూ దాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని గ్రామపంచాయతీకి తాళం వేసి అతని నిరసనను తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు దేవనబోయిన సైదులు బొడ్డు లింగయ్య ఎస్కే షరీఫ్ కప్పాల వెంకన్న తాడోజు నరసింహ రంగు గణేష్ రంగు వీరయ్య బొమ్మ గోని బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి నల్లగొండ ప్రతినిధి ఈ యానాల శ్రీనివాసరెడ్డి కుమారు డు అయిన యానాల సంజీవరెడ్డిని అడుగగా మా నాన్నగారు ఇచ్చిన భూమి గ్రామ అవసరాల కోసం మాత్రమే వాడుకోవాలని అది అమ్మాలని చూస్తే బాగుండదని తెలిపారు.

## లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన మంత్రి కొండా సురేఖ

- భద్రాచలం సీతారామ కల్యాణానికి హాజరు కావాలని విజ్ఞప్తి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శూక్లా ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో మార్చి 27న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కళ్యాణమహోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖాధికారులతో కలిసి అందజేశారు. భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణం విశిష్టత గురించి కొండా సురేఖ గవర్నర్‌కు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో వైభవంగా జరిగే పవిత్ర వేడుకని, ఈ మహోత్సవానికి దేశం నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, అర్చకులు పాల్గొన్నారు.

# డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులు భర్తీ చేస్తున్నాం

- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రభుత్వ హాస్పిటళ్లలో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు సహా అవసరమైన అన్నిరకాల పోస్టులను భర్తీ చేస్తున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ రెండు సంవత్సరాల్లో సుమారు 10 వేల పోస్టులను భర్తీ చేశామని, మరో 7 వేలకుపైగా పోస్టుల రిక్రూట్‌మెంట్ ప్రక్రియ చివరి దశలో ఉందని మంత్రి వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వ హాస్పిటల్లో డాక్టర్లు, సిబ్బందికి సంబంధించి శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో ఒకేసారి భారీ సంఖ్యలో మెడికల్ కాలేజీలు పెరిగాయని, దీంతో కాలేజీల్లో డాక్టర్ల కొరత ఏర్పడిందని మంత్రి తెలిపారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులకు అర్హత కలిగిన డాక్టర్లు లేకపోవడం వలన, ఆయా పోస్టుల భర్తీ ఇబ్బందిగా మారిందని మంత్రి వివరించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెడికల్ కాలేజీల్లో 1200 టీచింగ్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేశామని, రెగ్యులర్ బేసిస్‌లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని, ఏప్రిల్‌లో భర్తీ ప్రక్రియ పూర్తి అవుతుందని మంత్రి తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ హాస్పిటళ్లలో 1616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులను భర్తీ చేస్తున్నామని, ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా మరో నెల రోజుల్లో పూర్తి అవుతుందన్నారు. ఇప్పటికే 7 వేలకుపైగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేశామని, మరో 2312 పోస్టుల భర్తీ ప్రక్రియ ఏప్రిల్‌లో పూర్తి అవుతుందని మంత్రి వెల్లడించారు. గత రెండేళ్లలో కలిపి 1500లకు పైగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. దాదాపు అన్ని రకాల పోస్టులను భర్తీ చేస్తున్నామని మంత్రి వివరించారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో ప్రైవేటు మెడికల్ షాపులపై మండలిలో సభ్యులు ప్రశ్నించగా.. తాము అధికారంలోకి వచ్చాక ప్రైవేటు షాపులకు పర్మిషన్లు ఇవ్వలేదని, అప్పటికే ఉన్న వాటిని సైతం తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. కోర్టు నుంచి స్టే ఆర్డర్లు తెచ్చుకుని కొన్ని షాపులు కొనసాగుతున్నాయని, కోర్టు నుంచి అనుమతి రాగానే వాటిని కూడా తొలగిస్తామని మంత్రి తెలిపారు. ప్రజలకు తక్కువ ధరలో మెడిసిన్ అందించే విధంగా, జనరిక్ మెడికల్ షాపులను ప్రోత్సహిస్తామని మంత్రి వివరించారు.

## ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుకు స్పీకర్ సహకరించాలి

- లండన్ ఎన్నారైల విజ్ఞప్తి
- ఎన్నారై బీఆర్ఎస్ నాయకులు అనిల్ కూర్మాచలం, నవీన్ రెడ్డి




**లండన్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలైన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలని మోసం చేస్తుందని ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లండన్‌లో ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో, ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అనుమతించాలని అనిల్ కూర్మాచలం ఎన్నారైల పక్షాన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కి విజ్ఞప్తి చేశారు. అత్యంత కీలకమైన ఈ బిల్లును ఆమోదిస్తే ప్రజలకు భరోసా లభిస్తుందని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలని అడిగే అధికారం న్యాయ పరంగా పోరాడే శక్తి ఉంటుందని అనిల్ కూర్మాచలం తెలియజేసారు. ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇంకా ఎక్కువ రోజులు ప్రజల్ని మోసం చేస్తూ ఆరు గ్యారంటీలను అమలు చేయకుం డా తప్పించుకోలేదని, అసెంబ్లీ స్పీకర్ ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సహకరించి ప్రజల పక్షాన నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశంలో ఎన్నారై బీఆర్ఎస్ యూకే నాయకులు అశోక్ గౌడ్ దుసారి, రత్నాకర్ కడుదుల, సిక్కా చంద్రశేఖర్ గౌడ్, సత్యమూర్తి చిలుముల, హరి గౌడ్ నవపేట్, రవి ప్రదీప్ పులుసు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ కబ్జాపై హైకోర్టు కొరడా

- ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో భూమి స్వాధీనం
- పోలీస్ ప్రొటెక్షన్ తో హక్కుదారునికి భూమి అప్పగింత





**మహాదేవపూర్, మార్చి (జనంసాక్షి) :** అక్రమ కబ్జాపై హై కోర్టు ఉత్తరులతో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో పోలీస్ ప్రొటెక్షన్ తో హక్కుదారునికి భూమి స్వాధీనం చేశారు. పూర్తి హక్కు కలిగి ఉన్నప్పటికీ అక్రమంగా కబ్జా చేసుకుని కొనసాగుతున్న వ్యక్తి అక్రమ కబ్జాపై కొరుడ కురిపిస్తూ హక్కుదారునికి, పోలీస్ ప్రొటెక్షన్ తో భూమిని అప్పగించడం తో న్యాయవ్యవస్థ మరియు పోలీస్ వ్యవస్థ పై ప్రజలకు మరింత నమ్మకాన్ని పెంచేలా చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల మండలంలోని బొమ్మపూర్ శివారులో, సర్వే నెంబర్ 98/బి.2 ఎకరాల నాలుగు గుంటల వ్యవసాయ భూమి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు, హక్కుదారుడు కంకణాల అరుణ భర్త రవీందర్ కు పోలీస్ ప్రొటెక్షన్ తో భూమిని అప్పగించడం జరిగింది.

**ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో భూమి స్వాధీనం**

సోమవారం రోజు ఉన్నత న్యాయస్థానం బదితుని రైట్ పిటిషన్ రెండు 21599,2019, పరిగణంలోకి తీసుకొని రాజ్యాంగంలోని ఆర్టికల్ 226, అనుగుణంగా మంథని సివిల్ కోర్ట్ న్యాయస్థానం, జడ్జిమెంట్ డిగ్రీ, ఓ ఎస్ నంబర్ 52 /2012 ను పరిగణంలోకి తీసుకుంటూ, సర్వహక్కులు కలిగిన కంకణాల అరుణ, కు చెందిన సర్వేనెంబర్ 98/ఎలోని నాలుగు ఎకరాల రెండు గంటల వ్యవసాయ భూమిని,వారికి అప్పగించుటకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడంతో పూర్తి హక్కుదారుడైన కంకణాల అరుణ రవీందర్ కు ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ సమక్షంలో మొఖాపై పోలీస్ ప్రొటెక్షన్ తో వేళ్ళు,నాలుగు ఎకరాల రెండు గుంటల వ్యవసాయ భూమిని అప్పగించడం జరిగింది.

**పోలీస్ ప్రొటెక్షన్ తో హక్కుదారునికి భూమి అప్పగింత**

రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో మహాదేవపూర్ సబ్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్, బొమ్మ పూర్ శివారులోని సర్వే నెంబర్ 98/బి లో నాలుగు ఎకరాల రెండు గుంటల వ్యవసాయ భూమి, పూర్తి హక్కుదారుడైన కంకణాల అరుణ రవీందర్ కు, వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి అక్రమంగా కబ్జా చేసి ఉన్న వారి నుండి, హక్కుదారుడైన కంకణాల అరుణ రవీందర్ కు, అప్పగించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల అనుసారం, హక్కుదారునికి భూమి అప్పగించే కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ తో పాటు, సివిల్ కానిస్టేబుల్ మరియు ఏఆర్ కానిస్టేబుల్ లతోపాటు మహిళా కానిస్టేబుల్ ఉన్నారు.



## నిమ్స్‌లో మందుల ధరలు కంట్రోల్ చేయండి

- మండలిలో ఎమ్మెల్సీ రమణ విమర్శలు

**హైదరాబాద్, మార్చి 23 (జనంసాక్షి) :** నిమ్స్ ఆస్పత్రిలో మెడిసిన్స్ ధర అధికంగా ఉంటున్నాయని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్. రమణ తెలిపారు. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రిలోనూ అదేవిధంగా అధిక ధరలు ఉంటున్నాయని పేర్కొన్నారు. బయటి మెడికల్ షాపు రేట్లతో సమానంగా మెడిసిన్స్ అమ్ముతున్నారని విమర్శించారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శాసనమండలిలో ఎల్.రమణ మాట్లాడుతూ.. మందులు కొనలేక పేద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వమే మందులు సరఫరా చేసి పేద రోగులకు ఉపశమనం కలిగించాలని కోరారు. అధిక ధరలకు మెడిసిన్స్ అమ్మే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఎల్.రమణ డిమాండ్ చేశారు. సరిపడ స్టాక్ లేక బయటి మెడికల్ షాపులపై ఆధారపడాల్సి వస్తుందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

## పుష్కరాల ఏర్పాట్లలో ఆలస్యం ఉండొద్దు

- జయశంకర్ భూపాలపల్లి ల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లలో ఆలస్యం చేస్తే అస్సలు సహించేది లేదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో సరస్వతి అంత్య పుష్కరాల పనులపై రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, ఇరిగేషన్, పీఆర్, మిషన్ భగీరథ, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరంలో మే 21 నుండి జూన్ 1 వరకు సరస్వతి అంత్య పుష్కరాల సరస్వతి జరుగనున్నాయని, అంత్య పుష్కరాల నిర్వహణకు సంబంధించిన అన్ని పనులు నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల నిర్వహించిన సమావేశంలో అధికారులే ఎప్పటి వరకు పనులు పూర్తి చేస్తారో డెడ్‌లైన్ ఇచ్చారని, అట్టి డెడ్ లైన్ ప్రకారం జాప్యం లేకుండా కచ్చితంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనులలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా మహాదేవపూర్ వద్ద ఆర్చ్ నిర్మాణ పనులు పురోగతిపై దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులు ఇచ్చిన సమాధానంపై ఏప్రిల్ 30లోపు పూర్తి చేయాలని, ఏం చేస్తారో నాకు సంబంధం లేదు, ఇచ్చిన టైమ్‌లైన్ ప్రకారం పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, రహదారులు, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు వంటి అన్ని ఏర్పాట్లు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని గుర్తించిన పార్కింగ్ స్థలాలలో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం డిఎస్పీ సూర్య నారాయణ, వైద్య, ఇరిగేషన్, దేవాదాయ, విద్యుత్తు, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భారీగా తగ్గిన బంగారం ధరలు

- యుద్ధ ప్రభావంతో దిగివస్తున్న రేట్లు



**హైదరాబాద్, మార్చి23 (జనంసాక్షి) :** అమెరికా-ఇరాన్ మధ్య దాడులు ముదురుతుండటం, వస్తువుల ధరలు పెరుగుతాయనే భయం, ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లు పెరుగుతాయన్న ఆందోళనల వల్ల ప్రపంచ మార్కెట్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. దింతో అంతర్జాతీయంగా బంగారం, వెండి ధరలు భారీగా పడిపోయాయి. అమెరికా-ఇరాన్ యుద్ధం తీవ్రతరం కావడం, ముడి చమురు ధరలు అధికంగా ఉండటంతో ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరిగాయి. ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధం మొదలైన కొత్తలో అందరూ పోటీ పడి బంగారం కొనడంతో ధరలు ఆకాశానికి అంటాయి. ఇప్పుడు అంత రేటు పెట్టి ఎవరూ కొనలేక పోతుండటంతో ధరలు మెల్లగా దిగివస్తున్నాయి. ధరలు బాగా పెరిగినప్పుడు కొన్నవారు, ఇప్పుడు ఆ లాభాన్ని నగదుగా మార్చుకోవడానికి ఉన్న బంగారాన్ని అమ్మేస్తున్నారు. దీనివల్ల మార్కెట్లో బంగారం నిల్వలు పెరిగి ధరలు తగ్గుతున్నాయి. బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచే అవకాశం ఉండటంతో, ప్రజలు బంగారం మీద కంటే డిపాజిట్లు లేదా బాండ్ల మీద పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇక పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయనే భయం మొదలైంది. ఇది కూడా వడ్డీ రేట్లు పెరగడానికి దారితీస్తోంది. సోమవారం 1 గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర రూ.595 తగ్గి రూ.14,002, 22క్యారెట్ల ధర రూ. 545 తగ్గి రూ. 12,835, 18 క్యారెట్ల ధర రూ.446 తగ్గి రూ.10,502. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.5,950 తగ్గి రూ.1,40,020, 22 క్యారెట్ల బంగారం ధర రూ.5,450 తగ్గి రూ.1,28,350, 18 క్యారెట్ల బంగారం ధర రూ.4,460 తగ్గి రూ.1,05,020 వద్ద చేరింది. హైదరాబాద్, వరంగల్,నిజామాబాద్, ఖమ్మంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.14,002, 22 క్యారెట్ల బంగారం ధర రూ.12,835, 18 క్యారెట్ల బంగారం ధర రూ.10,502కు చేరింది. విజయవాడ, విశాఖపట్నం, అమరావతి, గుంటూరు, నెల్లూరు, కాకినాడ, తిరుపతి, కడప, అనంతపురంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.14,002, 22 క్యారెట్ల బంగారం ధర రూ.రూ.12,835, 18 క్యారెట్ల బంగారం ధర రూ.10,502గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో కేజీ వెండి ధర రూ.15 తగ్గి రూ.230, కేజీకి రూ.2,30,000 వద్ద రూ.15,000 తగ్గింది.


## వేములకు కెటిఆర్ తదితరుల పరామర్శ



**హైదరాబాద్, మార్చి23 (జనంసాక్షి) :** మాజీ మంత్రి, బాల్కొండ బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పరామర్శించారు. ఇటీవల స్వల్ప అనారోగ్యానికి గురైన వేములను సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య యోగ క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, అనిల్ జాదవ్ తదితరులున్నారు.

## హామీల అమలులో చిత్తశుద్ధిలేని కాంగ్రెస్ ప్రభుత్వం

- మండలిలో ప్రతిపక్ష నేత మధుసూధనాచారి విమర్శలు



**హైదరాబాద్, మార్చి23 (జనంసాక్షి) :** ప్రజలకు ఇచ్చిన హామీలే కేంద్ర బిందువుగా అసెంబ్లీలో చర్చ జరగాలని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏంటనేది చూడకుండా ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చారని కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. శాసనమండలి, శాసనసభను వాయిదా వేసుకుంటూ పోవడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. అధికార పక్షాన్ని నిజాయితీగా ప్రశ్నించాలని అనుకుంటున్న పార్టీలు తమతో కలిసి రావాలని మధుసూదనాచారి పిలుపునిచ్చారు. హామీల అమలుపై ఈ ప్రభుత్వాన్ని నిజాయితీ, చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రైతులు అప్పుల్లో కూరుకుపోకుండా పెట్టుబడి సాయం అందించి ఆదుకున్నది కేసీఆర్ ప్రభుత్వం అని గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలన్న ఆలోచన లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హామీల అమలుపై ఎక్కడికక్కడ నిలదీస్తున్నామని మధుసూదనాచారి తెలిపారు. బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీది ద్రోహం, వంచన అని మండిపడ్డారు. ఏడాదికి రూ.20వేల కోట్లు ఇస్తామని హామీ ఇచ్చి ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. బీసీలకు కాంగ్రెస్ బ్జడెట్‌లో కేటాయింపులు ఎలుక తోకలా ఉందని ఎద్దేవా చేశారు. బీసీలకు గత బ్జడెట్‌లలో కేటాయించిన నిధుల్లో సగం కూడా ఖర్చు చేయలేదని అన్నారు.

# నేడు ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా వాకథాన్

- నాపా ఆధ్వర్యంలో కెబిఆర్ పార్క్‌లో కార్యక్రమం
- వ్యాధిపట్ల ప్రజలు చైతన్యవంతం కావాలని పిలుపు

**హైదరాబాద్, మార్చి23 (జనంసాక్షి) :** మాయమైందనుకున్న క్షయ వ్యాధి మళ్లీ విజృంభిస్తోంది. చాపకింద నీరులా వ్యాప్తి చెందుతోంది. కేంద్రప్రభుత్వం కట్టడి చర్యలు తీసుకుంటున్నా, ప్రజల నిర్లక్ష్యం కారణంగా మళ్లీ వ్యాప్తిం చెందుతోంది. వ్యాధి బారిన పడ్డవారు సరిగా గుర్తించకపోవడం, వైద్యుల సలహాలు పాటించక పోవడం, సరైన చికిత్స తీసుకోక పోవడం వంటి కారణాలతో మళ్లీ వ్యాప్తి చెందుతోంది. ఈ క్రమంలో సామాజిక బాధ్యతయగా గుర్తించిన యువ వైద్యులు ఓ బృందంగా ఏర్పడి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, చైతన్యం చేయడానికి పూనుకున్నారు. హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తు ప్రచార కార్యక్రమాలకు దిగారు. 24న మంగళవారం ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో చైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఆదివారం సంజీవయ్య పార్క్‌లో నిర్వహించిన వాకథాన్‌తో పాటు మంగళవారం కెబిఆర్ పార్క్‌లో కూడా దీనిని నిర్వహించబోతున్నారు. న్యూ ఏజ్ పల్మనాలజిస్ట్స్ అసోసియేషన్ కోర్ కమిటీ నాపా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. ఇందులో ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. వివేక్ వర్ధన్ వీరపనేని,డా. బి. అనిరుధ్,డా. రోహిత్ రెడ్డి,డా. గోవర్ధన్ రెడ్డి, డా. కె. ప్రశాంతి,డా. ఉపేంద్ర, డా. ఓబుల్ రెడ్డిలు ఉన్నారు. వీరంతా కలసి ఈకార్యక్రమం ద్వారా ప్రజాచైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. విష్ణున్ రావు వీరపనేని,డా. సుధాకర్ కంది,డా. టిఎల్ఎన్ స్వామి,డా. దయానంద్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి మూడు నిముషాలకు ఇద్దరు వ్యక్తులు టిబి కారణంగా చనిపోతున్నారని, ఇది అత్యంత బాధాకరమైన విషయమని, ప్రజలు చైతన్యం కావాలని నాపా ప్రతినిదులు సూచించారు. టిబికి ఆధునిక వైద్య చికిత్స అందుబాటులో ఉందని, ఇది క్యూరబుల్ అని అన్నారు. ప్రపంచ జనాభాలో నాలుగింట ఒక వంతు మంది క్షయవ్యాధి బారినపడుతున్నారని అన్నారు.ఏళ్ళ తరబడి క్షయవ్యాధి అనేది వైద్యపరమైన చిక్కులు, సామాజిక మరియు ఆర్థిక ఇబందులు చూపుతుందని అన్నారు. ఈ క్షయవ్యాధి ప్రపంచ మరణానికి ప్రధాన కారణం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మరణాల తో 1.04 కోట్ల కొత్త కేసులు నమోదైనవి అని నివేదించిందని అన్నారు. అవగాహనను పెంచడానికి, ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని 1982 నుండి ప్రతి సంవత్సరం మార్చి 24న జరుపుకుంటు న్నామని అన్నారు. తమ బాధ్యతగా నాపా ప్రతినిధులంతా కలసి ప్రజలను చైతన్యం చేఏందుకు ముందుకు వచ్చామని నాపా ప్రతినిధి డాక్టర్ వివేక వర్ధన్ వీరపనేని అన్నారు. వాడుక భాషలో టిబిగా పిలిచే క్షయ వ్యాధి వల్ల ప్రతి సంవత్సరం అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధి మైకోబ్యాక్టీరియం ట్యుబర్‌కులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. కానీ మెదడు, మూత్రపిండాలు మరియు వెన్నెముక వంటి శరీరంలోని ఇతర భాగాలపై కూడా ఇది ప్రభావం చూపిస్తుందని అన్నారు. అందువల్ల ప్రజలు అప్రమత్తం కావలని, సకాలంలో వైద్యుల సలహాలు తీసుకుని, చికిత్సకు సిద్ధం కావాలన్నారు. తాము నిర్వహించే వాకథాన్ ప్రజల్లో చైతన్యం కలిగిస్తే అంతకు మించిన లక్ష్యం మరోటి లేదన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370